ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
మంగళవారం 13.01.2026 | సంపుటి :12 సంచిక : 175 | పేజీలు :12 వెల : రూ. 4/-
RNI NO.TELTEL / 2013 /50370

సామాన్యుని స్వరం
JANAMSAKSHI TV

హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్



# జిల్లాల పునర్విభజనకు విశ్రాంత న్యాయమూర్తితో కమిషన్

## అసెంబ్లీలో చర్చించాకే నిర్ణయం: సీఎం రేవంత్ రెడ్డి

> గతంలో జిల్లాల విభజన సరిగా జరగలేదు. రెవెన్యూ డివిజన్లు, మండలాల ఏర్పాటు అడ్డగోలుగా చేశారు. జిల్లాల సరిహద్దులు మార్చాలని విజ్ఞప్తులు వస్తున్నాయి. త్వరలో జిల్లాల పునర్విభజన ఉంటుంది. ఇందుకోసం రిటైర్డ్ జడ్జి నేతృత్వంలో ప్రత్యేక కమిటీ వేస్తాం. ఆ కమిటీ రాష్ట్రమంతా తిరిగి ప్రజల అభిప్రాయాలు స్వీకరిస్తుంది. అందుకు అనుగుణంగా జిల్లాల పునర్విభజన చేస్తాం
> - సీఎం రేవంత్ రెడ్డి

- వాటిని సరిదిద్ది పాలనాపరమైన ఇబ్బందులు తొలగిస్తాం
- టీజీఓ డైరీ ఆవిష్కరణ కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్(జనంసాక్షి): తెలంగాణలో గత ప్రభుత్వం అశాస్త్రీయంగా ఏర్పాటు చేసిన కొత్త జిల్లాలు, మండలాలను రేషనలైజ్ చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ టీజీఓ డైరీ ఆవిష్కరణ కార్యక్రమంలో సీఎం ఈ వ్యాఖ్యలు చేశారు. రాష్ట్ర పాలనలో సమస్యలు సృష్టించిన ఈ జిల్లాల ఏర్పాటును సమీక్షించి సరిదిద్దుతామని ఆయన స్పష్టం చేశారు. ఇది రాష్ట్రంలోని పాలనా వ్యవస్థను మరింత సమర్థవంతం చేయడానికి అవసరమన్నారు.గత ప్రభుత్వం అశాస్త్రీయంగా కొత్త జిల్లాలు ఏర్పాటు చేయడం వల్ల పాలనపై ప్రజలకు నమ్మకం సన్నగిల్లిందని మిగతా 2లో..



## నాణ్యత విషయంలో రాజీపడొద్దు

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అందించే కిట్‌పై అధికారులతో సమీక్షలో సీఎం రేవంత్ 2లో..

## తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేశారో జాగ్రత్త !

- 15 శాతం జీతం కోత విధిస్తాం : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- దివ్యాంగులకు మానవీయ కోణంలో సహకారం
- 'బాల భరోసా' 'ప్రణామ్' డే కేర్ సెంటర్ల ప్రారంభంలో సీఎం

2లో

## చలానా పడగానే.. ఖాతా నుంచి చెల్లింపు

- ఆ మేరకు బ్యాంక్‌తో అనుసంధానించండి
- 'అరైవ్ అలైవ్' రోడ్ సేఫ్టీ కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి
- ఈ ఉద్యమంలో అందరూ పాల్గొనాలి: డీజీపీ శివధర్‌రెడ్డి



# నీటివాటా కోసం పోరు కొనసాగిస్తాం

## కేటాయింపులకు మించి వాడరాదన్నదే మా అభ్యంతరం: మంత్రి ఉత్తమ్

- సుప్రీంలో నల్లమల సాగర్ లింక్ ప్రాజెక్టుపై పిటిషన్‌ను ఉపసంహరించుకున్న తెలంగాణ
- మధ్యవర్తిత్వం ద్వారా జల వివాదాలు పరిష్కరించుకోవాలి
- ఇరురాష్ట్రాలకు సుప్రీం ధార్మసనం సూచన

న్యూఢిల్లీ(జనంసాక్షి): పోలవరం - నల్లమల సాగర్ లింక్ ప్రాజెక్టుపై సుప్రీంకోర్టులో సోమవారం విచారణకు వచ్చింది.. ఈ విచారణకు తెలంగాణ నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి హాజరయ్యారు. నల్లమల సాగర్ లింక్ ప్రాజెక్టుకు వ్యతిరేకంగా సుప్రీంలో తెలంగాణ సర్కార్ రిట్ పిటీషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే ఆర్టికల్ 131 కింద సివిల్ సూట్ దాఖలు చేసుకోవాలని సీజేఐ ధర్మాసనం సూచించింది. మధ్యవర్తిత్వం ద్వారా జల వివాదాలను పరిష్కరించుకోవాలని కూడా మార్గనిర్దేశంచేసింది. కేంద్ర ప్రభుత్వం నియమించిన ఉన్నతస్థాయి కమిటీ వద్ద తెలంగాణ వాదనలు వినిపించుకోవచ్చనీ అభిప్రాయపడింది.అయితే.. తెలంగాణ ప్రభుత్వంతో మాట్లాడి మళ్లీ తమ వాదనలు వినిపిస్తానని గత విచారణ సందర్భంగా సీనియర్ కౌన్సిల్ అభిషేక్ మను సింఘ్వీ తెలిపారు. నల్లమల సాగర్ లింక్ ప్రాజెక్టుకు ఎలాంటి అనుమతులు లేనందున ప్రాజెక్టు పనులు ఆపాలని తెలంగాణ సర్కార్‌కు తెలిపింది. ఈ నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం విచారణ చేపట్టింది. రాష్ట్రం తరఫున సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ మరో సారి వాదనలు వినిపిస్తున్నారు.పోలవరం ప్రాజెక్టు మిగతా 2లో..

## తెలంగాణ ప్రాజెక్టులకు నేనెప్పుడూ అడ్డు చెప్పలేదు

పోలవరంలో మిగిలిన నీటిని తెలంగాణ కూడా వినియోగించుకునే అవకాశం : ఏపీ సీఎం చంద్రబాబు

అమరావతి(జనంసాక్షి):రాష్ట్ర ప్రజల ఆశలను నిలబెట్టామని.. వారిలో విశ్వాసాన్ని మళ్లీ కల్పించామని సీఎం చంద్రబాబు అన్నారు. 2025 ఏడాది మంచి ఫలితాలను ఇచ్చిందని చెప్పారు. విధ్వంసమైన వ్యవస్థల నుంచి సుపరిపాలనను గాడిలో పెట్టామన్నారు. సూపర్‌సిక్స్ ద్వారా సంక్షేమం, అభివృద్ధిని వేగంగా చేయగలిగామని.. ఈ ఏడాది కూడా మరింత కష్టించి పని చేద్దామన్నారు. సచివాలయంలో మిగతా 2లో..

# జిల్లాలను కుదిస్తే ఊరుకోం

## అగ్గిరాజేస్తాం : కేటీఆర్

- జిల్లాలను రద్దు చేస్తే కాంగ్రెస్ పార్టీ పతనం తప్పదు
- ప్రజలతో కలిసి పోరాడుతాం
- ప్రజలకు అభివృద్ధి, సంక్షేమ ఫలాలు ఇంటి ముందటికి రావడం కాంగ్రెస్‌కు ఇష్టం లేదు
- రెండు సంవత్సరాలలో ఒక్క వర్గానికి కూడా కాంగ్రెస్ పార్టీతో లబ్ధి జరగలేదు
- మహబూబ్‌నగర్ సర్పంచ్‌ల ఆత్మీయ సమ్మేళనంలో కేటీఆర్

మహబూబ్‌నగర్‌బ్యూరో(జనంసాక్షి): కాంగ్రెస్ పార్టీ జిల్లాలను రద్దు చేస్తామన్న కాంగ్రెస్ ప్రభుత్వ ప్రకటనను బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా ఖండించారు. రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి మీడియాతో మాట్లాడుతూ జిల్లాలను రద్దు చేస్తాము, వాటిని శాస్త్రీయంగా చేయలేదు అంటూ చెబుతున్న సాకుల పైన కూడా కేటీఆర్ మండిపడ్డారు. జిల్లాలను రద్దు చేస్తే ఎవ్వరూ ఊరుకోరని కేటీఆర్ హెచ్చరించారు. కలెక్టర్లను, జిల్లా ఎస్పీలను ప్రజల వద్దకు తీసుకువచ్చి పాలనా ఫలాలు మిగతా 2లో..





## ప్రభుత్వ ఉద్యోగులకు శుభవార్త

- డీఏ పెంపు
- 3.64 % పెంచుతూ ఉత్తర్వులు

హైదరాబాద్(జనంసాక్షి): సంక్రాంతి వేళ ప్రభుత్వ ఉద్యోగులకు తెలంగాణ సర్కార్ శుభవార్త చెప్పింది. డీఏను 3.64 శాతం పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసింది. పెరిగిన డీఏ 2024 జులై 1 నుంచి వర్తించనుంది. జనవరి నెల వేతనంతో పెరిగిన డీఏను ప్రభుత్వం ఫిబ్రవరి 1న చెల్లించనుంది. 2023 జులై 1 నుంచి గతేడాది డిసెంబర్ 31 వరకు ఉన్న డీఏ బకాయిలను జీపీఎఫ్ ఖాతాలో జమ చేయనుంది.సోమవారం సాయంత్రం అందుకు సంబంధించిన ఉత్తర్వులను ప్రభుత్వం జారీ చేసింది. 2023, జులై 1వ తేదీ నుంచి ఈ డీఏ అమలు చేయాలని జారీ చేసిన ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది. 2026 జనవరి మాసంలో తీసుకునే జీతంతో కలిపి ఈ డీఏ చెల్లించనున్నట్లు ఆ ఉత్తర్వుల్లో వివరించింది. జిల్లా పరిషత్, మున్సిపాలిటీ ఉద్యోగులకు సైతం ఈ డీఏను వర్తింప చేయనున్నారు. మిగతా 2లో..

## కొన్ని షరతులపై మాత్రమే టికెట్ ధరలు పెంచుతామని చెప్పాం

సినిమాటోగ్రఫీశాఖ మంత్రి కోమటిరెడ్డి



హైదరాబాద్ (జనంసాక్షి):టికెట్ ధరల పెంపు విషయంలో అంతా కూర్చొని మాట్లాడుకున్న తర్వాతే నిర్ణయం తీసుకున్నామని తెలంగాణ సినిమాటోగ్రఫీశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. సోమవారం సినిమా టికెట్ ధరల పెంపు అంశంపై మరోసారి స్పందించారు.“సంధ్య థియేటర్ ఘటన తర్వాత టికెట్ ధరల పెంపునకు అనుమతి ఇవ్వబోమని నేను, ముఖ్యమంత్రిగారు ప్రకటించిన మాట వాస్తవమే. ఆ తర్వాత మేమంతా కూర్చొని మాట్లాడుకుని మిగతా 2లో..

## మన జెన్‌జీలో చాలా క్రియేటివిటీ ఉంది

వికసిత్ భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్ ముగింపు కార్యక్రమంలో ప్రధాని మోదీ



న్యూఢిల్లీ(జనంసాక్షి):మన జెన్‌జీ తరం సృజనాత్మకతతో నిండి ఉందని ప్రధాని మోదీ అన్నారు. వినూత్న ఆలోచనలు, లక్ష్యాలు, ఉత్సాహంతో దేశ నిర్మాణంలో ముందువరుసలో ఉందని పేర్కొన్నారు. 'వికసిత్ భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్ ముగింపు కార్యక్రమంలో ప్రధాని మోదీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా దేశ విదేశాల నుంచి మిగతా 2లో..

## కనీస చార్జీ రూ.960

- గరిష్టంగా రూ.రూ.13,300
- వందేభారత్ స్లీపర్ ఛార్జీలు ఖరారు

న్యూఢిల్లీ(జనంసాక్షి):ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న వందేభారత్ స్లీపర్ రైలు పట్టాలెక్కేందుకు సిద్ధమైంది. అత్యాధునిక సదుపాయాలతో, దూర ప్రాంత ప్రయాణాలకు అనువుగా ఉండే ఈ రైలు కోల్‌కతా- గువా హటి మధ్య త్వరలో పరుగులు పెట్టనుంది. ఈ నేపథ్యంలో వందే భారత్ స్లీపర్ రైలుకు సంబంధించిన ఛార్జీల వివరాలు, బుకింగ్ రూల్స్‌ను రైల్వే శాఖ నోటిఫై చేసింది. ఆ వివరాలు ఇవీ..ఈ రైలులో కనీస ఛార్జి రూ.960 నుంచి ప్రారంభమవుతుంది. 400 కిలోమీటర్ల ప్రయాణానికి 3ఏసీ ప్రయాణానికి ఈ ఛార్జీ వర్తిస్తుంది. అంటే ప్రయాణికుడు అంతకంటే మిగతా 2లో..





## ఎట్టిపరిస్థితుల్లో గ్రీన్‌లాండ్‌ను స్వాధీనం చేసుకుంటాం

లేకుంటే చైనా, రష్యాలు ఆ ప్రాంతాన్ని ఆక్రమిస్తాయి:ట్రంప్

వాషింగ్టన్(జనంసాక్షి) గత కొంతకాలంగా గ్రీన్‌లాండ్‌ను స్వాధీనం చేసుకుంటానంటూ డెన్మార్క్‌ను రెచ్చగొడుతున్న ట్రంప్ తాజాగా ఆ అంశంపై మరోసారి మాట్లాడారు. ఎట్టిపరిస్థితుల్లోనూ గ్రీన్‌లాండ్‌ను చేజిక్కించుకోవాల్సిందేనన్నారు లేకుంటే చైనా, రష్యాలు ఆ పని చేస్తాయని హెచ్చరికలు జారీ చేశారు. మిగతా 2లో..

## నిజమైన స్నేహితుల మధ్య విభేదాలు సహజమే

- ప్రధాన మోదీ, ట్రంప్‌లది మంచి స్నేహబంధం
- ఇండియాతో భాగస్వామ్యం కంటే మాకు ఏదీ ఎక్కువ కాదు
- అమెరికా రాయబారి సెర్జియో గోర్ కీలక వ్యాఖ్యలు



న్యూఢిల్లీ(జనంసాక్షి):భారత్-అమెరికా మధ్య వాణిజ్య ఉద్రిక్తతల నేపథ్యంలో అమెరికా రాయబారి సెర్జియో గోర్ కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మధ్య స్నేహబంధం నిజమైనదని అన్నారు. నిజమైన స్నేహితుల మధ్య విభేదాలు సహజమేనని, వాటిని పరిష్కరించుకుని ముందుకు సాగేందుకే వారు ప్రయత్నిస్తారని వ్యాఖ్యానించారు. 'ఇండియాతో భాగస్వామ్యం కంటే మాకు ఎవరూ ఎక్కువ కాదు. ఇరుదేశాల మధ్య ద్వైపాక్షిక, వాణిజ్య సంబంధాలను మరో స్థాయికి తీసుకు వెళ్లేందుకు కృషి చేస్తాను' అని గోర్ చెప్పారు. అమెరికా-భారత్ వాణిజ్య ఒప్పందం విషయంలో సంక్లిష్టతలు ఉన్నప్పటికీ వీలైనంత త్వరగా వాణిజ్య ఒప్పందం చేసుకునేందుకు రెండు దేశాల ప్రతినిధులు నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నారని అన్నారు. ఈనెల 13న మిగతా 2లో..

## ఢీ అంటే ఢీ..

- మా చివరి రక్తపు బొట్టు వరకు పోరాడుతాం
- మమ్మల్ని ఆదేశించే నైతిక అధికారం అమెరికాకు లేదు
- ట్రంప్‌కు క్యూబా కౌంటర్

హవానా(జనంసాక్షి): అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ క్యూబాకు హెచ్చరికలు జారీ చేశారు. వెనెజువెలా నుంచి చమురు కానీ, నిధులు కానీ కావాలంటే తమతో త్వరగా ఒప్పందం చేసుకోవాలని తేల్చిచెప్పారు.ఈ నేపథ్యంలో ట్రంప్‌నకు క్యూబా కౌంటరిచ్చింది. నిబంధనలను నిర్దేశించే నైతిక అధికారం అమెరికాకు లేదంటూ ఘాటుగా స్పందించింది. అధ్యక్షుడు ట్రంప్ హెచ్చరికలపై క్యూబా అధ్యక్షుడు మిగ్యుల్ డియాజ్-కానెల్ ట్విట్టర్ వేదికగా స్పందించారు. మిగతా 2లో..

## గేమ్ చేంజ్... ఇరాన్‌లో ప్రభుత్వ అనుకూల ప్రదర్శనలు



టెహ్రాన్(జనంసాక్షి):ఆర్థిక సంక్షోభంతో ఇరాన్‌లో ఆందోళనలు వెల్లువెత్తాయి. ప్రభుత్వ వ్యతిరేక నిరసనల్లో ఇప్పటివరకు 500 మందికిపైగా మృతి చెందారు. ఈ క్రమంలోనే తాజాగా కీలక పరిణామాలు చోటుచేసుకున్నాయి. దేశవ్యాప్తంగా పెద్దఎత్తున ప్రభుత్వ అనుకూల ప్రదర్శనలు మొదలయ్యాయి. తమ బలాన్ని ప్రదర్శించేందుకు ఇరాన్ ప్రభుత్వం సోమవారం మిగతా 2లో..

## ఓటర్ల జాబితా డిజిటలైజేషన్‌లో లోపాలు

బెంగాల్ సర్ ప్రక్రియపై మమత అభ్యంతరం



కోల్‌కతా(జనంసాక్షి): ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణకు సంబంధించి పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ మరోసారి అభ్యంతరాలు లేవనెత్తారు. ఈ ప్రక్రియ కోసం వినియోగిస్తున్న 2002 నాటి ఓటర్ల జాబితా డిజిటలైజేషన్ ప్రక్రియలో లోపాలు చోటుచేసుకున్నాయని ఆరోపించారు. దీంతో నిజమైన ఓటర్లు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని పేర్కొన్నారు. ఈమేరకు మిగతా 9లో..

## కదులుతున్న కారులో యువతిపై గ్యాంగ్ రేప్

రాజస్థాన్‌లోని బికనీర్ జిల్లాలో దారుణం

జైపుర్(జనంసాక్షి): ఇంటినుంచి కళాశాలకు వెళుతున్న యువతిని అడ్డగించి ఆమెపై గ్యాంగ్ రేప్‌నకు పాల్పడిన ఘటన రాజస్థాన్‌లోని బికనీర్ జిల్లాలో చోటుచేసుకుంది. మిగతా 2లో..

జనంసాక్షి
www.janamsakshi.org
మంగళవారం
13.01.2026

## నాణ్యత విషయంలో రాజీపడొద్దు

**హైదరాబాద్(జనంసాక్షి):**ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అందించనున్న 22 వస్తువులతో కూడిన కిట్ కు సంబంధించి నాణ్యత విషయంలో రాజీపడొద్దని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులకు సూచించారు. సోమవారం ముఖ్యమంత్రి నివాసంలో ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లు, పాఠశాలల విద్యార్థులకు అందించే వస్తువులకు సంబంధించి సెంట్రల్ ప్రొక్యూర్మెంట్ పై ఉన్నతాధికారులతో సీఎం సమీక్ష నిర్వహించారు. వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు తిరిగి ప్రారంభమయ్యే నాటికి విద్యార్థులకు కిట్ అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థుల విషయంలో ఖర్చుకు వెనకాడొద్దని, ఎట్టి పరిస్థితుల్లోనూ నాణ్యత విషయంలో రాజీ పడొద్దని తెలిపారు. యూనిఫామ్ తో పాటు 21 వస్తువులతో కూడిన కిట్ ను విద్యార్థులకు అందించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. స్కూల్ బెల్ట్, టై, షూస్, స్కూల్ బ్యాగ్, నోట్ బుక్స్, ఇతర వస్తువులను అందించేందుకు అవసరమైన ప్రొక్యూర్మెంట్ ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, రెసిడెన్షియల్ స్కూళ్లకు సంబంధించిన పెండింగ్ బిల్లులకు సంబంధించి పూర్తి వివరాలను అందించాలని అధికారులను ఆదేశించారు. ఈ సమీక్ష సమావేశంలో ప్రభుత్వ సలహాదారులు సుదర్శన్ రెడ్డి, వేం నరేందర్ రెడ్డి, స్పెషల్ సీఎస్ సబ్యసాచి ఘోష్, సిఎం సెక్రటరీ వేముల శ్రీనివాసులు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## ఇరాన్‌లో ప్రభుత్వ అనుకూల ప్రదర్శనలు

లక్షల మంది ప్రభుత్వ మద్దతుదారులను వీధుల్లోకి సమీకరించింది. టెహ్రాన్‌లోని ఎంఘెలాబ్ స్క్వేర్ వద్ద వేల మంది ప్రదర్శనకారులు గుమిగూడారు. దేశాధ్యక్షుడు పెజెష్కియాన్, విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాఘ్చి తదితరులూ ఇందులో భాగమయ్యారు. జాహెదాన్, కెర్మన్, రష్త్ తదితర ప్రాంతాల్లోనూ ప్రదర్శనలు జరిగాయి. దీనికి సంబంధించిన దృశ్యాలను ఇరాన్ అధికారిక మీడియా ప్రసారం చేసింది. 'అమెరికన్-ఇజ్రాయెల్ ఉగ్రవాదానికి వ్యతిరేకంగా ఇరాన్ తిరుగుబాటు'గా ఈ ప్రదర్శనలను పేర్కొంది. తమ దేశంలో పరిస్థితులు పూర్తిగా అదుపులోకి వచ్చాయని అబ్బాస్ అరాఘ్చి ఇప్పటికే ప్రకటించిన విషయం తెలిసిందే.

## కదులుతున్న కారులో యువతిపై గ్యాంగ్ రేప్

ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జనవరి 6న యువతి కళాశాలకు వెళ్తుండగా ఇద్దరు యువకులు అడ్డగించి ఆమెను బలవంతంగా కారులోకి ఎక్కించి నాపసర్ ప్రాంతంలో ఆమెపై అత్యాచారానికి పాల్పడ్డారు. కొన్ని గంటలపాటు కదులుతున్న కారులో ఆమెపై అఘాయిత్యానికి పాల్పడ్డారు. ఈ క్రమంలో కారు ఓ గ్రామంలోకి ప్రవేశించడంతో స్థానికులు అనుమానం వచ్చి ఆపారు. దీంతో యువతిని కారులో నుంచి బయటకు తోసేసి అక్కడ్నుంచి నిందితులు పారిపోయారు. గ్రామస్థులు బాధిత యువతి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు జనవరి 11న భారతీయ న్యాయ సంహిత కింద కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## ఎట్టిపరిస్థితుల్లోనూ గ్రీన్‌లాండ్‌ను స్వాధీనం చేసుకుంటాం

వెనిజువెలా అధ్యక్షున్ని బంధించి ఆ దేశ పాలనను హస్తగతం చేసుకున్న ట్రంప్ తన తదుపరి టార్గెట్ గ్రీన్‌లాండ్ అని ప్రకటించారు. అరుదైన ఖనిజాలు, చమురు, సహజవాయువులు పుష్కలంగా ఉండడంతో ప్రపంచంలోనే అతిపెద్ద ఆ ద్వీపంపై అమెరికా అధ్యక్షుడి కన్ను పడింది. దీంతో ఎలాగైనా ఆ ద్వీపాన్ని అమెరికాలో విలీనం చేస్తామని దాని రక్షణ బాధ్యత తమపై ఉందని ఇప్పటికే పలుమార్లు ప్రకటించారు. అయితే దీనిపై గ్రీన్‌లాండ్ ప్రజలు నిరాసక్తి చూపిస్తున్నారు. ఎట్టిపరిస్థితుల్లో అమెరికాలో కలిసేది లేదని తాము స్వతంత్రంగా ఉండదలుచుకుంటున్నామని తమ దేశ పార్లమెంటులో తీర్మానం సైతం చేశారు.అయినప్పటికీ ట్రంప్ తన తీరును మార్చుకోవడం లేదు తాజాగా గ్రీన్‌లాండ్ వ్యవహారంపై మరోసారి స్పందించారు. "గ్రీన్‌లాండ్‌ను అమెరికా స్వాధీనం చేసుకుంటుంది. లేకపోతే చైనా, రష్యా దాన్ని స్వాధీన పరచుకుంటాయి. ఎట్టిపరిస్థితుల్లో అది నేను జరగనివ్వను". అని ట్రంప్ అన్నారు. గ్రీన్‌లాండ్ కోసం డెన్మార్క్‌తో ఒప్పందం చేసుకుంటాం. లేదా ఎలాగైనా స్వాధీనం చేసుకుంటాం అని పేర్కొన్నారు.రష్యా, చైనా దేశాల సైనిక బలం ఏమిటో మీకు తెలుసు వారికి ప్రతిచోట సబ్‌మెరైన్లు, డిస్ట్రాయర్లు ఉన్నాయి. వారి సైనిక శక్తిని మీరు తట్టుకోలేరు అని డెన్మార్క్‌నుద్దేశించి వ్యాఖ్యానించారు. అయితే గ్రీన్‌లాండ్‌పై ట్రంప్ వ్యాఖ్యలనను డెన్మార్క్ ప్రధాని ఖండించారు. ఒకవేళ గ్రీన్‌లాండ్‌పై అమెరికా దాడి చేస్తే అది 80 సంవత్సరాల ట్రాన్స్ అట్లాంటిక్ ఒప్పందానికి భంగం కలిగించడమేనన్నారు.

## నిజమైన స్నేహితుల మధ్య విభేదాలు సహజమే

భారత్-అమెరికా ప్రతినిధులు మరోసారి సమావేశం కావాల్సి ఉందని వెల్లడించారు. వచ్చే ఏడాది లేదా రెండేళ్లలో ట్రంప్ భారత పర్యటనకు వచ్చే అవకాశం ఉందని చెప్పారు. భారత్‌కు అమెరికా రాయబారిగా ఆయన సోమవారంనాడు అధికారికంగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తమకు భారత్ తర్వాతే ఎవరైనా అని చెప్పారు. భారతదేశం ప్రపంచంలోనే అతిపెద్ద దేశమని, అందువల్ల ఒప్పందంపై ముగింపునకు తీసుకురావడం అంత తేలికైన పనికాదని, అయినప్పటికీ సాధ్యమైనంత త్వరగా ఒప్పందం కుదిరేందుకు తాము కృతనిశ్చయంతో ఉన్నామని చెప్పారు. భద్రత, కౌంటర్ టెర్రరిజం, ఇంధనం, సాంకేతికత, విద్య, ఆరోగ్యం వంటి రంగాల్లో రెండు దేశాల మధ్య పరస్పర సహకారం కొనసాగుతుందని తెలిపారు. సిలికాన్ ఆధారిత సాంకేతికతలను రక్షించడానికి, మెరుగుపరచడానికి ఉద్దేశించిన 'ప్యాక్స్ సిలికా' కూటమిలోకి పూర్తి సభ్యత్వ దేశంగా భారత్‌ను ఆహ్వానిస్తున్నామని గోర్ వెల్లడించారు. కూటమిలో అమెరికా, జపాన్, సౌత్ కొరియా, యూకే, ఇజ్రాయెల్ దేశాలు కలిసి పనిచేయనున్నట్టు చెప్పారు.

## ఢీ అంటే ఢీ

ఈ క్రమంలో క్యూబా ఒక స్వేచ్ఛాయుతమైన, స్వతంత్ర, సార్వభౌమ దేశం. మేము ఏం చేయాలో ఎవరూ నిర్దేశించాల్సిన అవసరం లేదు. క్యూబా ఎప్పుడూ సంఘర్షణను కోరుకోదు. చివరి రక్తపు బొట్టు వరకు మాతృభూమిని రక్షించడానికి సిద్ధంగా ఉంది. ఎలాంటి పరిస్థితులను అయినా ఎదుర్కొనేందుకు క్యూబా సిద్ధంగా ఉందని చెప్పుకొచ్చారు. మరోవైపు.. క్యూబా విదేశాంగ మంత్రి బ్రూనో రోడ్రిగ్జ్ స్పందిస్తూ.. ప్రపంచ శాంతి ముప్పు కలిగించే విధంగా అమెరికా వ్యవహరిస్తోంది. నేరపూరిత రీతిలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చర్యలు ఉన్నాయి అంటూ ఘాటు విమర్శలు గుప్పించారు. ఏ దేశం నుండి అయినా ఇంధనాన్ని దిగుమతి చేసుకునే హక్కు క్యూబాకు ఉందని వివరణ ఇచ్చారు. ఈ నేపథ్యంలో అమెరికా, క్యూబా మధ్య మాటల యుద్ధం మొదలైంది. అయితే, క్యూబా లొంగిపోయే అవకాశం లేదని నిపుణులు అంచనా వేస్తున్నారు. దీంతో, ట్రంప్ నిర్ణయం ఎలా ఉండనుంది అనే ఉత్కంఠ నెలకొంది.

ట్రంప్ హెచ్చరికలు..

ఇక, అంతకుముందు క్యూబా విషయమై ట్రంప్ సంచలన వ్యాఖ్యలు చేశారు. వెనెజువెలాలోని అపారమైన చమురు నిల్వలపై ఆధిపత్యం అమెరికా చేతుల్లోకి వచ్చింది. ఇకపై తమతో ఒప్పందం చేసుకుంటే తప్ప చమురు దక్కదని క్యూబాకు ట్రంప్ స్పష్టంచేశారు. ఈ మేరకు ఆదివారం సోషల్ మీడియాలో పోస్టుచేశారు. ఆలస్యం కాకముందే మేల్కోవాలని, ఒప్పందానికి సిద్ధం కావాలని పేర్కొన్నారు. వెనెజువెలా నుంచి వస్తున్న చమురు, డబ్బుతోనే క్యూబా మనుగడ సాగిస్తోందని పేర్కొన్నారు. ఒకవేళ ఒప్పందం గనుక చేసుకోకపోతే అవన్నీ ఆగిపోతాయని క్యూబాను ట్రంప్ హెచ్చరించారు.ఈ సందర్భంగా ట్రంప్ విదేశాంగ మంత్రి రూబియో సామర్థ్యాన్ని కొనియాడుతూనే.. ఆయన భవిష్యత్తులో క్యూబాకు అధ్యక్షుడయ్యే అవకాశం ఉందని వ్యాఖ్యానించారు. రూబియో తల్లిదండ్రులు 1950వ దశకంలో క్యూబాలోని బాటిస్టా నియంతృత్వ పాలన నుంచి తప్పించుకుని అమెరికాకు వలస వచ్చిన వారు కావడం గమనార్హం.

# జిల్లాల పునర్విభజనకు విశ్రాంత న్యాయమూర్తితో కమిషన్

సీఎం రేవంత్ రెడ్డి విమర్శించారు. జిల్లాల సరిహద్దులు మా ర్చాలని విజ్ఞప్తులు వస్తున్నాయని, త్వరలో జిల్లాల పునర్విభజన కోసం విశ్రాంత న్యాయమూర్తి నేతృత్వంలో కమిటీ ఏర్పాటు చేయనున్నట్లు సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. ఆ కమిటీ రాష్ట్రమంతా తిరిగి అభిప్రా యాలు స్వీకరిస్తుందని చెప్పారు. రాచ కొండ కమిషనరేట్ పేరు సహేతుకంగా లేదనే మార్చినట్లు చెప్పారు. ప్రభుత్వ ఉద్యోగులకు కొత్త జిల్లా కేంద్రాల్లో ఇళ్ల స్థలాలు ఇస్తామని సీఎం వెల్లడించారు. వరంగల్, హనుమకొండ జిల్లాలను కలపాలని ప్రజల నుంచి డిమాండ్ వస్తోందని.. ఇలాంటి సమస్యలను పరిష్కరించడానికి త్వరలో రిటైర్డ్ జడ్జి నేతృత్వంలో ఓ కమిషన్ ఏర్పాటు చేస్తామని ఆయన తెలిపారు. ఈ కమిషన్ ఆరు నెలలపాటు క్షేత్రస్థాయిలో పర్యటించి జిల్లాలు, మండలాల రేషనలైజేషన్ పై నివేదిక సమర్పిస్తుందని సీఎం చెప్పారు. అన్ని జిల్లాల్లో మండలాలు సమానంగా ఉండేలా చర్యలు తీసుకుంటామని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. అలాగే, బ్జడెట్ సమావేశాల్లో ఈ అంశంపై చర్చించి, అన్ని పార్టీల అభిప్రాయాలు తీసుకుంటామని, విధివిధానాలు రూపొందిస్తామని రేవంత్ రెడ్డి తెలిపారు. కమిషన్ నివేదిక ఆధారంగానే చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రభుత్వ ఉద్యోగులను ప్రభుత్వ సారథులుగా సీఎం రేవంత్ రెడ్డి అభివర్ణించారు. 'మా ప్రభుత్వ వారధులు.. సారథులు ప్రభుత్వ ఉద్యోగులే. ఆనాడు ప్రభుత్వం తప్పుడు పనులను ఉద్యోగులపై ఒత్తిడి చేసి అమలు చేయించింది. పెద్ద దిక్కుగా ఉండాల్సిన వ్యక్తి ఫామ్ హౌజ్‌లో పడుకున్నారు' అని రేవంత్ రెడ్డి విమర్శించారు. 'నేను అన్నగా వచ్చాను. ఇప్పుడు నేను 18 గంటలు పనిచేస్తున్నాను. ఈరోజు డీఏ ÷ల్ మీద సంతకం చేసి వచ్చాను. దీంతో ప్రభుత్వానికి రూ.227కోట్ల భారం పడుతుంది' అని రేవంత్ రెడ్డి ఉద్యోగులనుద్దేశించి మాట్లాడారు.ఉద్యోగుల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నాం. ప్రతీ ఉద్యోగికి రూ.1.02 కోట్ల ప్రమాద బీమా పథకాన్ని త్వరలో అమలు చేస్తాం. ఉద్యోగులు, ప్రభుత్వం వేరువేరు కాదు. ఇద్దరం కలిస్తేనే ప్రజలకు మెరుగైన సేవలు అందుతాయి' అని సీఎం అన్నారు. అలాగే, భూములు, ఇసుక, ఉ÷ సబ్సిడీలో అవకతవకలు జరుగుతున్నాయని, వాటిని నిరోధిస్తే ప్రభుత్వ



ఆదాయం మెరుగవుతుందని సీఎం రేవంత్ చెప్పుకొచ్చారు. తాను ఇప్పటివరకు ఒక్క రోజు కూడా సెలవు తీసుకోలేదని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. తీసుకుందామని అనుకున్నా.. ఏదో ఒక పని వచ్చి పడుతోందన్నారు. ప్రభుత్వంలో ఉన్న 200 మంది మాత్రమే రాష్ట్రాన్ని నడపలేరని, 10.50లక్షల ప్రభుత్వ ఉద్యోగులే రాష్ట్రాన్ని నడిపిస్తున్నారని అన్నారు. ఉద్యోగులే ప్రభుత్వ సారథులు, వారధులు. వారి సమస్యల పరిష్కారానికి ప్రథమ ప్రాధాన్యం. ఉద్యోగుల్లో కూడా నేను అంటే నచ్చని వారు చాలా మంది ఉండొచ్చు. నేను వచ్చాక ఉద్యోగుల జీతాలు ఎలా వస్తున్నాయో మీరే గమనించాలి. ఉద్యోగుల డీఏ దస్త్రాలపై సంతకం చేసి ఇక్కడికి వచ్చాను. ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి రూ.కోటి బీమా ఇవ్వాలని నిర్ణయించాం. ప్రభుత్వ ఉద్యోగుల బకాయిలు రూ.12వేల కోట్లు మేర పెండింగ్‌లో ఉన్నాయి. పన్ను వసూళ్లలో అవకతవకలు అరికడితే రావాల్సిన నిధులు వస్తాయి. పన్నులు పెంచాల్సిన అవసరం లేదు. సరిగా వసూళ్లు చేస్తే చాలు'అని అన్నారు.

## జిల్లాలను కుదిస్తే ఊరుకోం

అందిస్తే సహించలేక, ప్రజలకు అందుతున్న అభివృద్ధి ఫలాలను చూడలేకనే జిల్లాలను రద్దు చేస్తామంటూ కాంగ్రెస్ ప్రభుత్వం చెప్తుందన్నారు. తెలంగాణలోని ఏ జిల్లాను రద్దు చేసినా అక్కడ అగ్గి పుట్టిస్తామని, ప్రజలతో కలిసి ప్రభుత్వం పైన తీవ్రంగా పోరాటం చేస్తామని కేటీఆర్ హెచ్చరించారు. జిల్లాలను రద్దు చేస్తే కాంగ్రెస్ పార్టీ పతనం తప్పదని హెచ్చరించారు.కేసీఆర్ గారు ప్రజల వద్దకు పరిపాలన, అభివృద్ధిని తీసుకుపోయే విధంగా పరిపాలన వికేంద్రీకరణను చేపట్టారు. అందుకే తాండాలను గ్రామ పంచాయతీలుగా చేయడంతో పాటు నూతన మండలాలు, రెవెన్యూ డివిజన్లను ఏర్పాటు చేయడం జరిగింది. దీంతో పాటు జిల్లా యంత్రాంగం అంతా ప్రజలకు అందుబాటులో ఉండాలని, కలెక్టర్లు, ఎస్పీలు ప్రజల మధ్య ఉండాలన్న సదుద్దేశంతో చిన్న జిల్లాలను ఏర్పాటు చేయడం జరిగింది.పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టును రేవంత్ రెడ్డి కావాలనే పక్కన పెట్టారని కేటీఆర్ విమర్శించారు. లక్షలాది ఎకరాలకు గత ప్రభుత్వం నీళ్లు ఇవ్వడంతో వలస పోయిన ప్రతి మహబూబ్ నగర్ బిడ్డ తిరిగి వచ్చారని కేటీఆర్ అన్నారు. కానీ మహబూబ్ నగర్ బిడ్డను అని చెప్పుకునే రేవంత్ రెడ్డి పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టును కావాలనే అడ్డుకుంటున్నాం న్నారు. 30 వేల కోట్ల రూపాయలతో 90% పనులు పూర్తి చేసినా, కనీసం మిగిలిపోయిన 10% పనులు పూర్తి చేయలేక కావాలని ఆపుతున్నారన్నారు. కేవలం కేసీఆర్ కి పేరు వస్తుందన్న దురుద్దేశంతో, తమ పాత బాస్ చంద్రబాబుకి కోపం వస్తుందన్న ఏకైక కారణంతోనే ఈ రెండు సంవత్సరాలలో పాలమూరు రైతన్నలను ఎండబెడుతున్నారన్నారు.

## తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేశారో జాగ్రత్త !

- 15 శాతం జీతం కోత విధిస్తాం
- దివ్యాంగులకు మానవీయ కోణంలో సహకారం
- ప్రణామ్ కార్యక్రమంతో వృద్ధులను ఆదుకోవాలనే నిర్ణయం
- 'బాల భరోసా' పథకం, 'ప్రణామ్' డే కేర్ సెంటర్ల ప్రారంభంలో సిఎం రేవంత్

**హైదరాబాద్(జనంసాక్షి):** దివ్యాంగులకు మానవీయ కోణంలో సహకారం అందిస్తున్నామని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రజాభవన్‌లో జరిగిన కార్యక్రమంలో 'బాల భరోసా' పథకం, 'ప్రణామ్' డే కేర్ సెంటర్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రతిభావంతులకు సహాయ ఉపకరణాలను ఉచితంగా పంపిణీ చేశారు. దాదాపు రూ. 50 కోట్లతో పరికరాలను అందించామని రేవంత్ తెలిపారు. ప్రభుత్వం మీ కోసం ఉందని చెప్పడానికే ఈ కార్యక్రమం నిర్వహించినట్లు వెల్లడించారు.ప్రణామ్ కార్యక్రమంతో వృద్ధులను ఆదుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది. తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేసే ప్రభుత్వ ఉద్యోగుల జీతాల్లో 10 నుంచి 15 శాతం కోత విధిస్తాం. ఈ బ్జడెట్ సమావేశాల్లో బిల్లు తీసుకొస్తున్నాం. తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేసేవారిని మనమే దారిలోకి తీసుకురావాలి. కన్నవారి పట్ల బాధ్యత లేనివారికి సమాజంపై ఏం బాధ్యత ఉంటుందని రేవంత్ అన్నారు. దివ్యాంగులు ఒకరినొకరు పెళ్లి చేసుకుంటే రూ. 2 లక్షల ఆర్థిక సాయం చేస్తామని ప్రకటించారు. వారిని ఇతరులు పెళ్లి చేసుకున్నా ఆర్థిక సాయం అందిస్తామన్నారు. ప్రభుత్వ ఉద్యోగాల్లో దివ్యాంగులకు సముచిత స్థానం ఇస్తాం. క్రీడల్లో రాణించినవారికి ఉద్యోగాలు ఇస్తాం. ప్రభుత్వం కల్పించే అవకాశాలను ఉపయోగించు కుంటూ ఎదగాలి. ఈ ప్రాంతంలో ప్రత్యేక ప్రతిభావంతులకు జైపాల్ రెడ్డి స్ఫూర్తి. మా ప్రభుత్వంలో ట్రాన్స్‌జెండర్లకు కూడా ప్రభుత్వ ఉద్యోగాలు, ఇందిరమ్మ ఇళ్లు ఇస్తున్నాం. కోఆప్షన్ సభ్యులుగా ట్రాన్స్‌జెండర్‌ను కార్పొరేటర్‌గా నామినేట్ చేయాలని మంత్రులను కోరుతున్నా. అలాగే మున్సిపాలిటీల్లో కోఆప్షన్ సభ్యులుగా నామినేట్ చేయాలి. ట్రాన్స్‌జెండర్ సమస్యలను వాళ్లే చెప్పుకొనే అవకాశం ఇవ్వాలి. రాష్ట్రంలో ఉన్న ప్రతి ఒక్కరికీ వైద్యం అందించాలనేదే ఈ ప్రభుత్వ లక్ష్యం. తెలంగాణ సమాజం స్వేచ్ఛను, సామాజిక న్యాయం, సమాన అవకాశాన్ని కోరుకుంటుంది దాదాపు వందేళ్ల తర్వాత రాష్ట్రంలో కులగణన జరిగింది. కులాల జనాభా ఆధారంగా నిధులు కేటాయించాలి. మా ఒత్తిడితోనే కేంద్రం కుల గణన చేస్తోందని సీఎం రేవంత్ వెల్లడించారు. కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు అడ్లూరి లక్ష్మణ్, రాజనర్సింహ, సీతక్క తదితరులు పాల్గొన్నారు.

## చలానా పడగానే.. ఖాతా నుంచి చెల్లింపు

**హైదరాబాద్(జనంసాక్షి):**వాహనాలకు చలానాల విషయంలో కఠినంగా వ్యవహరించాలని సీఎం రేవంత్ రెడ్డి పోలీసులకు కీలక సూచనలు చేశారు. అవి ఎంతోకాలం పెండింగ్‌లో లేకుండా వెంటనే వారి ఖాతాల నుంచి కట్ అయ్యేలా చూడాలన్నారు. యూసుఫ్‌గూడలోని కోట్ల విజయభాస్కర్‌రెడ్డి ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన 'అరైవ్ అలైవ్' రోడ్ సేఫ్టీ ప్రచార కార్యక్రమంలో సీఎం మాట్లాడుతూ.. వాహనం పై చలాన్ పడిన వెంటనే బ్యాంక్ ఖాతా నుంచి డబ్బులు కట్ అయ్యేలా చూడాలన్నారు. యజమాని వాహనాన్ని రిజిస్ట్రేషన్ చేయించడానికి వచ్చినప్పుడే బ్యాంక్ ఖాతా వివరాలు తీసుకోండి. ఆ వివరాలు సింక్ చేయండి. చలాన్ పడిన వెంటనే ఆటోమేటిక్‌గా డబ్బులు ఖాతా నుంచి కట్ కావాలని రేవంత్ అన్నారు. రోడ్డు ప్రమాదాల వల్ల దేశ జీడీపీలో 3 శాతం మేర నష్టం జరుగుతోందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రతి నిమిషానికో రోడ్డు ప్రమాదం జరుగుతోందని, 3 నిమిషాలకో ప్రాణం పోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్డు ప్రమాద నివారణకు పోలీసుశాఖ ప్రణాళిక చేపట్టిందన్నారు. రాష్ట్ర పోలీసు వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని చెప్పారు. సమాజంలో కొందరి నిర్లక్ష్యం మరొకరికి ప్రాణాపాయంగా మారుతోంది. రోడ్డు ప్రమాదాలపై విద్యార్థి దశలోనే అవగాహన కల్పించాలి. ఫిజికల్ క్రైమ్‌తో పాటు సైబర్ నేరాలు భారీగా పెరిగిపోయాయి. సైబర్ నేరాల నియంత్రణలో తెలంగాణ అగ్రస్థానంలో ఉంది. డ్రగ్స్ నియంత్రణకు ఈగల్ ఫోర్స్ ఏర్పాటు చేశాం. వీటి నియంత్రణలో హైదరాబాద్ ప్రథమ స్థానంలో ఉందని రేవంత్‌రెడ్డి తెలిపారు. ప్రమాదాల నివారణ కోసం అరైవ్ అలైవ్ అనే ఈ ఉద్యమాన్ని ప్రారంభిస్తున్నామని డీజీపీ శివధర్ రెడ్డి తెలిపారు. ఇందులో పోలీసులు, రవాణా శాఖ పని మాత్రమే కాదు.. ప్రజాప్రతినిధులు, ప్రజలందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. గతేడాది రోడ్డు ప్రమాదాలు పెరిగినా.. విస్తృత అవగాహనతో మరణాల సంఖ్య తగ్గిందని చెప్పారు. అందరూ కచ్చితంగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. జనవరి 13 నుంచి 24 వరకు పది రోజుల పాటు అరైవ్ అలైవ్ కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలోమంత్రి పొన్న ప్రభాకర్, డిజిపి శివధర్ రెడ్డి, సివి ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

**ఈ ఉద్యమంలో అందరూ పాల్గొనాలి: డీజీపీ శివధర్‌రెడ్డి**

ప్రమాదాల నివారణ కోసం అరైవ్ అలైవ్ అనే ఈ ఉద్యమాన్ని ప్రారంభిస్తున్నామని డీజీపీ శివధర్ రెడ్డి తెలిపారు. ఇందులో పోలీసులు, రవాణా శాఖ పని మాత్రమే కాదు.. ప్రజాప్రతినిధులు, ప్రజలందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు.

## ప్రభుత్వ ఉద్యోగులకు శుభవార్త

యూనివర్సిటీ టీచింగ్, నాన్ టీచింగ్ స్టాఫ్‌కు కూడా ఈ డీఏ కింద నిధులు చెల్లించనున్నారు. 30.03 శాతం నుంచి 33.67 శాతానికి ఈ డీఏను ప్రభుత్వం సవరించిన విషయం విదితమే.

## కనీస చార్జీ రూ.రూ.960

తక్కువ దూరానికే టికెట్ బుక్ చేసుకున్నా ఈ ఛార్జీ చెల్లించాల్సి ఉంటుందన్నమాట. గరిష్ఠంగా 3,500 కిలోమీటర్లకు 1ఏసీ ఛార్జీ రూ.13,300గా నిర్ణయించారు. కిలోమీటర్ వారీగా చూసినప్పుడు (కనీస టికెట్ ధర).. 3 ఏసీకి కిలోమీటరుకు రూ.2.4; 2 ఏసీకి కిలోమీటరుకు రూ.3.1; 1 ఏసీకి కిలోమీటరుకు రూ.3.8 చొప్పున చెల్లించాల్సి ఉంటుంది. దూరాన్ని బట్టి టికెట్ ధరలు పెరుగుతాయి.

నో ఆర్ఏసీ

వందేభారత్ స్లీపర్ రైలులో టికెట్ కన్ఫామ్ అయిన వారికే ప్రయాణానికి అనుమతిస్తారు. అలాగే, ఆర్ఏసీ (ఖీంఅ)కి ఇందులో చోటులేదు. అంటే వెయిటింగ్ లిస్ట్, పాక్షికంగా కన్ఫామ్ అయిన ప్రయాణికులను ఈ రైలులో ప్రయాణానికి అనుమతించరు. అడ్వాన్స్ రిజర్వేషన్ పీరియడ్ నుంచే (60 రోజుల ముందు నుంచి) అన్ని బెర్తులూ అందుబాటులో ఉంటాయి. ఇందులో మహిళలు, దివ్యాంగులు, సీనియర్ సిటిజన్ కోటా ఉంటుంది. ఇతర కోటాలకు చోటు లేదు. డిజిటల్ రూపంలోనే టికెట్లు తీసుకోవాల్సి ఉంటుంది. తద్వారా టికెట్లను క్యాన్సిల్ చేసినప్పుడు 24 గంటల్లో రిఫండ్ చేస్తారు. 45 ఏళ్లు పైబడిన మహిళలకు, 60 ఏళ్లు పైబడిన పురుషులకు సీట్ల అందుబాటును బట్టి లోయర్ బెర్తులను సిస్టమ్ ఆటోమేటిక్‌గా కేటాయిస్తుంది.

ఫీచర్లు ఇవే..

పూర్తి ఎయిర్ కండీషన్‌తో కూడిన 3 ఏసీ, 2 ఏసీ, 1 ఏసీ బోగీలు

టాప్ స్పీడ్ గంటకు 180 కిలోమీటర్లు. ట్రాక్‌ల సామర్థ్యం ఆధారంగా గంటకు 130 కిలోమీటర్ల వేగంతో నడిపే అవకాశం

ఆటోమేటిక్ స్లయిడింగ్ డోర్స్

అధునాతన టాయిలెట్లు, రీడింగ్ లైట్స్, ఛార్జింగ్ పాయింట్లు

సీసీ టీవీ కెమెరాలు, ప్రమాదాల నివారణ వ్యవస్థలు

## కొన్ని షరతులపై మాత్రమే టికెట్ ధరలు పెంచుతామని చెప్పాం: మంత్రి కోమటిరెడ్డి

మా నిర్ణయాన్ని సవరించాం. ఒకవేళ టికెట్ ధరలు పెంచాల్సి వస్తే 20శాతం సినీ కార్మికుల సంక్షేమానికి ఇవ్వాలని షరతు పెట్టాం. అందుకు అనుగుణంగానే కొన్ని సినిమాలకు ఇచ్చాం. దీనిపై కోర్టు అభ్యంతరం వ్యక్తం చేసింది. ఆ సమయంలో నేను హైదరాబాద్‌లో లేను. మున్సిపల్ ఎన్నికల దృష్ట్యా నల్గొండ, భువనగిరి జిల్లాలను పర్యవేక్షిస్తున్నా. అప్పుడే జీవో ఇచ్చారు. మా ముఖ్యమంత్రి ఏ శాఖల విషయంలోనూ జోక్యం చేసుకోరు. అందరినీ కలుపుకొని వెళ్తారు" అని అన్నారు.ఇటీవల మంత్రి కోమటిరెడ్డి మాట్లాడుతూ.. గతంలోనూ, ప్రస్తుతం సినిమా టికెట్ ధరలు పెంచేందుకు తాను ఎప్పుడూ అనుమతి ఇవ్వలేదని అన్నారు. సినిమా ఇండస్ట్రీ గురించి పట్టించుకోవడం మానేశానని తెలిపారు. సంధ్య థియేటర్ ఘటన తర్వాత బెనిఫిట్ షోలు, సినిమా టికెట్ ధరలను పెంచమని తన వద్దకు రావొద్దని చెబుతూనే ఉన్నానన్నారు.

# నీటివాటా కోసం పోరు కొనసాగిస్తాం

నుంచి బనకచర్ల హెడ్ రెగ్యులేటర్ లేదా నల్లమల సాగర్ జలాశయానికి లింక్ చేసేలా గోదావరిపై ఏపీ ప్రాజెక్టు నిర్మిస్తోందంటూ రిట్ పిటిషన్‌లో తెలంగాణ పేర్కొంది. ఈ ప్రాజెక్టుకు ఎలాంటి అనుమతులు లేవని, ఆ పనులను తక్షణమే నిలిపివేసేలా పోలవరం ప్రాజెక్టు అథారిటీని ఆదేశించాలని అభ్యర్థించింది. కేంద్ర ప్రభుత్వం అనుమతించిన మేరకే పోలవరం ప్రాజెక్టు స్వరూపం ఉండాలని, విస్తరణ పనులు చేపట్టడం చట్టవిరుద్ధమని పిటీషన్‌లో పేర్కొంది. తమ అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోకుండా నల్లమల సాగర్ ప్రాజెక్టు ప్రీ ఫీజిబిలిటీ రిపోర్టును కేంద్ర ప్రభుత్వం పరిశీలించడం సమంజసం కాదని చెప్పింది. ఈ ప్రాజెక్టుపై తదుపరి చర్యలు చేపట్టరాదంటూ జలశక్తి మంత్రిత్వ శాఖ, కేంద్ర జలసంఘం, గోదావరి నదీ యాజమాన్య బోర్డులకు స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాలని రిట్ పిటిషన్‌లో పేర్కొంది తెలంగాణ. అయితే.. వరద జలాలను మాత్రమే తాము వాడుకుంటున్నామని ఆంధ్రప్రదేశ్ బదులిచ్చింది. బచావత్ ట్రిబ్యునల్ తీర్పునకు విరుద్ధంగా పోలవరం నుంచి గోదావరి జలాలు తరలించేందుకు ఉద్దేశించిన ప్రాజెక్టును నిలిపివేయాలని తెలంగాణా సర్కార్ పిటిషన్‌లో ప్రస్తావించింది. గోదావరిపై నిర్మిస్తున్న పోలవరం ప్రాజెక్టు నుంచి 200 టీఎంసీల నీటిని బొల్లాపల్లి రిజర్వాయర్ ద్వారా నల్లమల్ల సాగర్‌కు తరలించేందుకు ఏపీ ప్రభుత్వం ఈ కొత్త ప్రాజెక్టును ప్రతిపాదిం చిందని చెబుతోంది. ఈ ప్రాజెక్టును నిలిపివేయాలని ఇదివరకే కేంద్ర జలశక్తి శాఖకు, జల వనరుల సంఘానికి లేఖ రాసింది. పోలవరం నల్లమల్ల సాగర్ కోసం ఏపీ ప్రభుత్వం టెండర్ నోటిఫికేషన్ జారీ చేయడంపై అభ్యంతరం వ్యక్తం చేసింది తెలంగాణ. తమ ప్రయోజనాలకు నష్టం కలిగించే నిబంధనలు, విభజన చట్టానికి వ్యతిరేకంగా బనకచర్ల లింకు ప్రాజెక్టు చేపట్టకుండా చూడాలని కోరింది.కేటాయింపుల కంటే ఎక్కువ నీళ్లు వాడొద్దనేది ముఖ్యమైన అంశం అని మంత్రి ఉత్తమ్ అన్నారు. ఏపీ ప్రభుత్వం అనేకసార్లు ఉల్లంఘనలకు పాల్పడింది. వాటిని సుప్రీంకోర్టు దృష్టికి తీసుకొచ్చాం. స్టాప్ వర్క్ ఆర్డర్‌ను అమలు చేయడం లేదని తెలిపాం. ఏపీకి కేటాయించింది 484.5 టీఎంసీలు.. కానీ ఎక్కువగా ఉపయోగించుకునేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. గోదావరి, కృష్ణా బోర్డులు, అపెక్స్ కౌన్సిల్ అనుమతులు లేకుండా ఏపీ ప్రభుత్వం ముందుకెళ్తోందని కోర్టు దృష్టికి తీసుకెళ్లాం. ముందు డిజైన్ చేసినదానికంటే అదనంగా ఏమీ చేయడానికి వీల్లేదని వాదించాం. పోలవరం ప్రాజెక్టు ఒరిజినల్ ఫామ్‌కు అదనంగా మార్పులు చేయడానికి వీల్లేదని వాదనలు వినిపించాం అని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వెల్లడించారు.

సుప్రీంలో పిటిషన్ ఉపసంహరించుకున్న తెలంగాణ

నల్లమల సాగర్ లింక్ ప్రాజెక్టుకు సంబంధించి సుప్రీంకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌ను తెలంగాణ ప్రభుత్వం ఉపసంహరించుకుంది. ఈ మేరకు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ అధికారికంగా ప్రకటించారు. పిటిషన్ ఉపసంహరణ నేపథ్యంలో కేసును డిస్పోజ్ ఆఫ్ చేసినట్లుగా ధర్మాసనం వెల్లడించింది. ఈ నేపథ్యంలో తెలంగాణా ప్రభుత్వానికి సీజేఐ కీలక సూచనలు చేశారు. నల్లమల సాగర్ అంశంపై రిట్ పిటిషన్ ద్వారా ముందుకు వెళ్లడం ప్రయోజనకరం కాదని స్పష్టం చేశారు. అంతర్రాష్ట్ర జల వివాదాలకు రిట్ పిటిషన్ సరైన మార్గం కాదని అభిప్రాయం వ్యక్తం చేశారు. నల్లమల సాగర్ ప్రాజెక్టుకు సంబంధించి తమ వాదనలు, అభ్యంతరాలను వినిపించాలంటే ఆర్టికల్ 131 కింద సివిల్ సూట్ దాఖలు చేసుకోవాలని సూచించారు. అదే సరైన న్యాయపరమైన మార్గమని అభిప్రాయపడ్డారు. తెలంగాణా ప్రభుత్వం పిటిషన్ ఉపసంహరించుకోవడంతో ఈ కేసును సుప్రీంకోర్టు డిస్పోజ్ ఆఫ్ చేసినట్లు ఆయన ప్రకటించారు. దీంతో భవిష్యత్తులో సివిల్ సూట్ రూపంలో ఈ అంశం మరోసారి కోర్టు ముందుకు వచ్చే అవకాశాలున్నాయి. పోలవరం ప్రాజెక్టు నుంచి నల్లమల సాగర్‌కు నీటిని తరలించే లింక్ ప్రాజెక్టుపై తెలంగాణా ప్రభుత్వం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఈ ప్రాజెక్టుకు అవసరమైన అనుమతులు లేవని, బచావత్ ట్రిబ్యునల్ తీర్పునకు విరుద్ధంగా ఏపీ ప్రభుత్వం చర్యలు చేపడుతోందని తన పిటిషన్‌లో పేర్కొంది. చట్టపరంగా మరింత పటిష్ఠంగా వ్యవహరించాలనే సుప్రీంకోర్టు సూచనతో తెలంగాణా ప్రభుత్వం తన వ్యూహాన్ని మార్చుకుంది. కేవలం పాలనాపరమైన ఉత్తర్వుల కోసం కాకుండా, శాశ్వత పరిష్కారం కోసం సివిల్ సూట్ ద్వారా న్యాయపోరాటం చేయాలని నిర్ణయం తీసుకుంది. దీనివల్ల గోదావరి జలాల తరలింపుపై ఏపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా బలమైన వాదనలు వినిపించే అవకాశం ఉంటుందని సర్కార్ భావిస్తోంది.

## తెలంగాణ ప్రాజెక్టులకు నేనెప్పుడూ అడ్డు చెప్పలేదు

మంత్రులు, కార్యదర్శులతో సీఎం సమీక్ష నిర్వహించారు. జీఎస్‌డీపీ, ఆర్టీజీఎస్, పట్టాదారు పాస్ పుస్తకాలు తదితర అంశాలపై చర్చించారు. తల్లికి వందనం ద్వారా 67 లక్షల మంది విద్యార్థుల తల్లుల ఖాతాల్లో రూ.10,090 కోట్లు జమ చేశామని సీఎం అన్నారు. స్త్రీశక్తి పథకం ద్వారా 3.5కోట్ల మంది మహిళలు ప్రయాణాలు చేశారని.. దీనికోసం ఇప్పటి వరకు రూ.1,114 కోట్ల వ్యయం చేశామని చెప్పారు. అన్నదాత సుఖీభవ కింద 46లక్షల మంది రైతులకు రూ.6,310 కోట్లు ఖాతాల్లో వేశామని వివరించారు. ఏడాదిన్నరలో 50వేల కోట్ల మేర పింఛన్లు అందించడంతో సంక్షేమంలో కొత్త మైలురాయిని సాధించామని సీఎం పేర్కొన్నారు. అమరావతిని శ్మశానం, ఎడారి అని గతంలో హేళన చేశారని.. కానీ ఇదో స్ఫూర్తిదాయక ప్రాజెక్టు అని చంద్రబాబు చెప్పారు. అభివృద్ధిలో రైతులను భాగస్వాములను చేస్తున్నామన్నారు. పోలవరం అద్భుతమైన ప్రాజెక్టు అని.. అది పూర్తయితే దక్షిణ భారతంలో ఏ రాష్ట్రమూ మనతో పోటీ పడలేదని చెప్పారు. నల్లమలసాగర్ ద్వారా రాయలసీమ ప్రాంతంతో పాటు ప్రకాశం జిల్లాలోని పలు ప్రాంతాలకు నీరు ఇచ్చే అవకాశం ఉంటుందన్నారు. ఈ ప్రాజెక్టుతో ఎవరికీ నష్టం లేదన్నారు. ఎగువ నుంచి వదిలిన నీళ్లు పోలవరం నుంచి నల్లమల సాగర్‌కు తీసుకెళ్లి వాడుకుంటే తప్పేంటని ప్రశ్నించారు. పోలవరంలో మిగిలిన నీటిని తెలంగాణ కూడా వినియోగించుకునే అవకాశం ఉంటుందన్నారు. ఆ రాష్ట్రంలో ప్రాజెక్టులు కట్టినప్పుడు తానెప్పుడూ అడ్డు చెప్పలేదని సీఎం గుర్తుచేశారు. భోగాపురం ఎయిర్‌పోర్టును త్వరలోనే జాతికి అంకితం చేస్తామన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను కేంద్ర ప్రభుత్వ సహకారంతో కాపాడుకున్నామని వివరించారు. విశాఖ ఉక్కు ఆంధ్రుల సెంటిమెంట్ అని.. ఆ ప్లాంట్‌ను నిలబెట్టి తీరుతామన్నారు. దేశం లోకి వచ్చిన విదేశీ పెట్టుబడుల్లో 25 శాతం ఏపీకే వచ్చాయని తెలిపారు. పెట్టుబడులకు డెస్టినేషన్‌గా రాష్ట్రం మారిందన్నారు. ఎస్ఐపీబీ ద్వారా రూ.8.74లక్షల కోట్ల పెట్టుబడులకు ఆమోదం తెలిపామని.. వాటి ద్వారా కూడా పెద్దఎత్తున ఉద్యోగాలు వస్తాయన్నారు.

**పోలవరం - నల్లమల సాగర్ వల్ల తెలంగాణకూ మేలే:ఏపీ మంత్రి నిమ్మల**

అమరావతి: తెలుగు రాష్ట్రాలు సోదరభావంతో అభివృద్ధి చెందాలన్నది ఏపీ సీఎం చంద్రబాబు ఆకాంక్ష అని మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. పోలవరం - నల్లమల సాగర్‌కు ఎలాంటి అభ్యంతరాలు చెప్పొద్దని తెలంగాణ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ ఏడాది కూడా 4,600 టీఎంసీల నీరు సముద్రంలో కలిసిందని గుర్తు చేశారు. పోలవరం దగ్గర వరదనీరు వాడుకోకుంటే నీళ్లన్నీ సముద్రం పాలవుతాయని అన్నారు."గోదావరిలో పుష్కలంగా నీరుందనే కాళేశ్వరానికి మేం అభ్యంతరం చెప్పలేదు.

## తొక్కిసలాటతో టీవీకేకు సంబంధం లేదు

సీబీఐతో విజయ్

న్యూఢిల్లీ **(జనంసాక్షి):**కరూర్ తొక్కిసలాట ఘటనలో సీబీఐ ముందు హాజరైన తమిళ వెట్రి కళగం (టీవీకే) అధ్యక్షుడు, సినీ నటుడు విజయ్ తొలిరోజు విచారణ ముగిసింది. పొంగల్ తర్వాత ఆయన్ను మరోసారి ప్రశ్నించనున్నట్లు తెలుస్తోంది. తొలి రోజు సుమారు ఆరు గంటలకు పైగా అధికారులు ప్రశ్నలు వర్షం కురిపించారు. తొక్కిసలాట ఘటనకు టీవీకేకు సంబంధం లేదని విచారణ సందర్భంగా అధికారులతో విజయ్ చెప్పినట్లుగా తెలుస్తోంది."తొక్కిసలాట ఘటనకు టీవీకేకు ఎలాంటి సంబంధమూ లేదు. పరిస్థితి చేయి దాటిపోకూడదన్న ఉద్దేశంతో నేను వెళ్లిపోయా" అని విజయ్ సీబీఐతో చెప్పినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. ఇదే వ్యవహారంపై పార్టీ కార్యకర్తలను సీబీఐ ప్రశ్నించినప్పుడు.. వారు కూడా ఇదే తరహా సమాధానం ఇచ్చినట్లు తెలుస్తోంది. విజయ్ నుంచి మరికొన్ని ప్రశ్నలకు సమాధానాలు రాబట్టాల్సి ఉండగా.. పొంగల్ సందర్భంగా విరామం ఇవ్వాలని విజయ్ కోరినట్లు సమాచారం. దీంతో పండగ తర్వాత మరోసారి విచారించనున్నారు. విజయ్ రాక నేపథ్యంలో సీబీఐ కార్యాలయం ఎదుట నటుడి చిత్రపటాలతో అభిమానులు గుమిగూడడం కనిపించింది.గతేడాది సెప్టెంబరు 27న కరూర్‌లో విజయ్ నిర్వహించిన ప్రచార సభలో తొక్కిసలాట జరిగి 41 మంది మృతి చెందారు.

# నిర్మాణ పనులను వేగవంతం చేయాలి

- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**మంచిర్యాల, జనవరి 12 (జనంసాక్షి):** జిల్లా కేంద్రంలోని కాలేజ్ రోడ్డు లో నిర్మితమవుతున్న ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణ పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణం పనులను ఆకస్మికంగా సందర్శించి పనుల పురోగతిని పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందుబాటులో ఉంచేందుకు ప్రభుత్వం ఆసుపత్రి నిర్మాణ పనులను చేపట్టిందని, ఈ క్రమంలో పనులు వేగవంతం చేసి త్వరగా పూర్తి చేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. 129.25 కోట్ల రూపాయలతో ప్రభుత్వ ఆసుపత్రి, 23.75 కోట్ల రూపాయలతో క్రిటికల్ కేర్ విభాగం ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. వైద్య రంగాన్ని బలోపేతం చేస్తూ ప్రజలకు వేగవంతమైన, మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పాలమూరు పర్యటనలో కెటిఆర్‌కు ఘనస్వాగతం

- గులాబీ మయం అయిన పాలమూరు జిల్లా



**మహబూబ్‌నగర్, జనవరి12 (జనంసాక్షి) :** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పర్యటనతో మహబూబ్ నగర్ గులాబీ వనంలా మారింది. బీఆర్ఎస్ శ్రేణులు భారీ బైక్ ర్యాలీతో ఆయనకు ఘన స్వాగతం పలికాయి. కేసీఆర్ జిందాబాద్, కేటీఆర్ జిందాబాద్ నినాదాలతో పాలమూరు మారుమోగింది. షాద్‌నగర్‌లో పార్టీ శ్రేణుల నుంచి ఘన స్వాగతం స్వీకరించిన కేటీఆర్.. పార్టీ కార్యకర్తలకు అభివాదం చేస్తూ ర్యాలీగా ముందుకు కదిలారు. అనంతరం మహబూబ్ నగర్ గ్రౌండ్‌లో పార్టీ శ్రేణులు ఏర్పాటు చేసిన బహిరంగ సభావేదిక వద్దకు చేరుకున్నారు. ఈ సందర్భంగా ఇటీవల మహబూబ్‌నగర్ జిల్లాలో పంచాయతీ ఎన్నికల్లో గెలిచిన బీఆర్ఎస్ సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, వార్డు మెంబర్లను సన్మానించారు. కాంగ్రెస్ అణిచివేతను ఎదుర్కొని పోరాడి ఎన్నికల్లో గెలిచినందుకు వారికి అభినందనలు తెలియజేశారు. జిల్లాలోని జడ్చర్ల నియోజక వర్గంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు, మాజీ మంత్రి లక్ష్మారెడ్డికి బీఆర్ఎస్ శ్రేణులు, ఘనస్వాగతం పలికారు. అడుగడుగునా కేటీఆర్‌పై అభిమానాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా బాలానగర్ మండలం పెద్దాయిపల్లి చౌరస్తాలో కేటీఆర్ బీఆర్ఎస్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. జడ్చర్ల గులాబీ దండు చూపించిన ప్రేమకు కేటీఆర్ ధన్యవాదాలు తెలిపారు. కార్యకర్తలకు అభివాదం చేసుకుంటూ కేటీఆర్ , మాజీ మంత్రి లక్ష్మారెడ్డి ముందుకు సాగారు. హైద్రాబాద్ బెంగళూరు జాతీయ రహదారి పొడవునా జడ్చర్ల నియోజకవర్గ కార్యకర్తల ఉత్సాహాన్ని కేటీఆర్ ప్రత్యేకంగా అభినందించారు. ఇటీవల గ్రామ పంచాయతీ ఎన్నికల్లో అధికార పార్టీ కంటే ఎక్కువ సర్పంచ్ స్థానాలు కైవసం చేసుకొని సత్తా చాటినందుకు కేటీఆర్ ప్రశంసించారు. ప్రత్యేకంగా మాజీ మంత్రి లక్ష్మారెడ్డి నాయకత్వంలో మరింత బలంగా పోరాడాలని పార్టీశ్రేణులకు సూచించారు.

# బీఆర్ఎస్‌లోకి రవీందర్‌రావు



- కేటీఆర్ సమక్షంలో చేరిక
- మారుతున్నా రాజకీయ సమీకరణలు..
- అధికార కాంగ్రెస్ పార్టీని వీడుతున్నా కీలక నేతలు

**ఖానాపురం, జనవరి 12 (జనం సాక్షి):** కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి బిఆర్ఎస్ పార్టీలో వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి నర్సంపేట నియోజకవర్గ కన్వీనర్ తక్కలపల్లి రవీందర్ రావు బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామరావు సమక్షంలో చేరారు. సోమవారం నర్సంపేట నియోజకవర్గంలో మొదట పట్టణంలో కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి తక్కలపల్లి రవీందర్ ర్రావు మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డిని కలవడంతో రాజకీయంగా తీవ్ర చర్చనీయాశంగా మారింది. సోమవారం సాయంత్రం కేటీఆర్ హరీష్ రావు లను కలసి టిఆర్ఎస్ పార్టీ కండువా కప్పుకోవడంతో రవీందర్రావు బిఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి బిఆర్ఎస్ పార్టీలోకి ఆహ్వానించినారు. ఈ కార్యక్రమంలో ఒడిసిఎంఎస్ ఛైర్మెన్, గుగులోతు రామస్వామి నాయక్ రాష్ట్ర మాజీ డైరెక్టర్,జిల్లా నాయకులు,నియోజకవర్గ నాయకులు,మాజీ ఎంపీపీలు,మాజీ జడ్పీటీసీలు,మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్,మాజీ మున్సిపల్ ఛైర్మన్,వైస్ చైర్మెన్,మండల పార్టీ నాయకులు,క్లస్టర్ బాధ్యులు,పట్టణ పార్టీ బాధ్యులు,మాజీ కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు....

# కృష్ణా, గోదావరి జలాలు ఆంధ్రాకు తాకట్టు

- బీజేపీ కనుసన్నల్లో దుర్మార్గం అంతా సాగుతోంది
- మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి విమర్శలు



**హైదరాబాద్, జనవరి 12 (జనంసాక్షి) :** కాంగ్రెస్ ప్రభుత్వం కృష్ణా, గోదావరి జలాలను ఆంధ్రాకు తాకట్టు పెడుతున్నదని బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి విమర్శించారు. సోమవారం తెలంగాణ భవన్‌లో ప్రెస్‌మీట్‌లో మాట్లాడిన ఆయన.. కాంగ్రెస్ నాయకులు కేవలం పదవుల కోసం, రాజకీయ ప్రయోజనాల కోసమే కృష్ణా, గోదావరి జలాలను ఆంధ్రాకు తాకట్టు పెడుతున్నరని ఆరోపించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అక్రమంగా నిర్మిస్తున్న పోలవరం-నల్లమల సాగర్‌పై తెలంగాణ ప్రభుత్వం చంద్రబాబు నాయుడు డైరెక్షన్‌లో సుప్రీంకోర్టులో పిటిషన్ వేసిందని, ఆ బలహీనమైన పిటిషన్ చెల్లదని సుప్రీంకోర్టు మొట్టికాయలు వేసిందని జగదీష్‌రెడ్డి ఎద్దేవా చేశారు. ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు, కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ కనుసన్నల్లో ఈ దుర్మార్గం అంతా జరుగుతున్నదని తెలిపారు. హంగు ఆర్భాటంతో సుప్రీంకోర్టుకు వెళ్లిన తెలంగాణ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి.. బయటకు వచ్చిన తర్వాత మొహం చూపించకుండా వెళ్ళిపోయాడని అన్నారు. సుప్రీంకోర్టులో విచారణ అర్హత లేని పిటిషన్ వేసినప్పుడే వీళ్లకు తెలంగాణ ప్రయోజనాలపట్ల సోయి లేదనే విషయం తేలిపోయిందని విమర్శించారు. ముఖ్యమంత్రికి, మంత్రులకు వాటాల పంచాయతీ, ఢిల్లీకి మూటలు పంపించడమే సరిపోతుందని అన్నారు. రాష్ట్ర సర్కారులోని ఏ శాఖలో ఏం జరుగుతుందో మంత్రులకే తెలియడం లేదని, కాంగ్రెస్ ప్రభుత్వం దొంగల చేతిలో ఉన్నదని వ్యాఖ్యానించారు. సీఎం రేవంత్ రెడ్డికి ప్లాట్ల దందా తప్ప మరొకటి తెలియదని విమర్శించారు.

# ప్రజావాణి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలి

- వరంగల్ కలెక్టర్ డాక్టర్ సత్య శారదా దేవి



**వరంగల్ ప్రతినిధి, జనవరి 12 (జనంసాక్షి):** ప్రజావాణిలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన దరఖాస్తుదారుల సమస్యలను సంబంధిత శాఖ అధికారులు త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేయాలని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా దేవి అన్నారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, అదనపు కలెక్టర్ జి సంధ్యారాణి, డిఆర్ఓ విజయ లక్మి, వరంగల్, నర్సంపేట ఆర్డీవోలు సుమ, ఉమారాణి, డి డబ్ల్యు ఓ రాజమణి లు హాజరై ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలను వినతిపత్రాల రూపంలో కలెక్టర్‌కు అందజేశారు. ఈరోజు స్వీకరించిన మొత్తం దరఖాస్తులు 129 రాగా, అందులో రెవెన్యూ శాఖకు సంబంధించి 52 దరఖాస్తులు, వివిధ శాఖలకు సంబంధించిన దరఖాస్తులు 77 వచ్చాయని, స్వీకరించిన దరఖాస్తులను సంబంధిత శాఖకు ఎండార్ చేస్తూ పరిష్కార నిమిత్తం సంబంధిత శాఖల అధికారులతో నేరుగా దరఖాస్తుదారునితో మాట్లాడించి సమస్యను త్వరగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాల్సిందిగా అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా భూ సమస్యలు, పింఛన్లు, గృహాలు, ఉపాధి, సంక్షేమ పథకాలపై వచ్చిన వినతులను పరిశీలించి అర్హత మేరకు పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. ఈ ప్రజావాణిలో డిబిసిడిఓ పుష్పలత డిసిఓ నీరజ డిపిఓ కల్పన, జిల్లా అధికారులు తహశీల్దార్లు, ప్రజలు పాల్గొన్నారు.

# 14న నారీ నారీ నడుమ మురారి విడుదల

- టిక్కెట్ రేట్లు పెంపు లేకుండానే వస్తోన్న మూవీ

**హైదరాబాద్, జనవరి 12 (జనంసాక్షి) :** శర్వానంద్ నటిస్తోన్న తాజా చిత్రం 'నారీ నారీ నడుమ మురారి'. ఈ చిత్రానికి రామ్ అబ్బరాజు దర్శకత్వం వహిస్తున్నారు. సంయుక్తా మీనన్, సాక్షి వైద్య హీరోయిన్లుగా నటిస్తున్నారు. ఈ చిత్రం సంక్రాంతి కానుకగా జనవరి 14న థియేటర్లలో విడుదల కానుంది. రిలీజ్ డేట్ దగ్గర పడుతున్న నేపథ్యంలో చిత్రబృందం తాజా అప్డేట్ ఒకటి విడుదల చేసింది. సాధారణ టికెట్ ధరలకే ఈ మూవీని విడుదల చేస్తున్నట్టు ప్రకటించింది. ఈ సందర్భంగా 'ఈ సంక్రాంతికి అసలైన పండుగ ఆఫర్.. ఎంఆర్‌పీ ధరలకే టికెట్లు.. అదనపు ఛార్జీలు ఏం లేవు..' అంటూ శర్వానంద్ కోడిపుంజును పట్టుకున్న లుక్‌ను షేర్ చేశారు. ఈ సినిమాకి విశాల్ చంద్రశేఖర్ సంగీతం అందిస్తున్నారు. ఈ ప్రాజెక్ట్‌ను ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై అనిల్ సుంకర తెరకెక్కిస్తున్నారు.

# హనుమకొండలో ప్రణామ్ వయోవృద్ధుల డే కేర్ సెంటర్ ప్రారంభం

- వర్చువల్‌గా ప్రారంభించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- ప్రణామ్ కార్యక్రమం ద్వారా వృద్ధులను ఆదుకుంటాం : సీఎం రేవంత్ రెడ్డి



హనుమకొండలో ప్రతినిధి జనవరి 12 (జనం సాక్షి) :దివ్యాంగులు, వయోవృద్ధులు మరియు ట్రాన్స్‌జెండర్ వ్యక్తుల సాధికారత శాఖ, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ప్రారంభించిన ప్రణామ్ వయోవృద్ధుల డే కేర్ సెంటర్ ను సోమవారం తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి , ఉప ముఖ్యమంత్రి శ్రీ బట్టి విక్రమార్క, మంత్రులు, ఉన్నతాధికారులతో కలిసి హైదరాబాద్ ప్రజాభవన్ నుండి వర్చువల్ విధానంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో ఏర్పాటు చేసిన ప్రణామ్ డే కేర్ సెంటర్లను సీఎం వర్చువల్‌గా ప్రారంభించారు. ఇందులో భాగంగా హనుమకొండ జిల్లాలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, హనుమకొండ శాఖ ఆవరణలో ఏర్పాటు చేసిన వర్చువల్ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే మరియు రెడ్ క్రాస్ సొసైటీ ప్యాట్రన్ నాయిని రాజేందర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ మరియు రెడ్ క్రాస్ సొసైటీ అధ్యక్షురాలు స్నేహ శబరీష్ పాల్గొన్నారు. ముందుగా వారిని రెడ్ క్రాస్ చైర్మన్, పాలకవర్గ సభ్యులు ఘనంగా స్వాగతించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, ప్రణామ్ కార్యక్రమం ద్వారా వయోవృద్ధులను ఆదుకుంటామని తెలిపారు. తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేసే ప్రభుత్వ ఉద్యోగుల జీతాల్లో 10 నుండి 15 శాతం వరకు కోత విధించేలా బిల్లును బడ్జెట్ సమావేశాల్లో ప్రవేశపెట్ట నున్నట్లు వెల్లడించారు. తల్లిదండ్రుల పట్ల బాధ్యత లేని వారికి సమాజం పట్ల బాధ్యత ఎలా ఉంటుందంటూ ఆయన ప్రశ్నించారు. ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ, రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ప్రణామ్ వయోవృద్ధుల డే కేర్ సెంటర్లను సీఎం వర్చువల్‌గా ప్రారంభించడం అభినందనీయమన్నారు. రాష్ట్రంలో ఈ కేంద్రం హనుమకొండలో ప్రారంభం కావడం గర్వకారణమని తెలిపారు. జిల్లా కలెక్టర్, రెడ్ క్రాస్ సొసైటీ అధ్యక్షురాలు స్నేహ శబరీష్ మాట్లాడుతూ, 60 సంవత్సరాలు పైబడిన వయోవృద్ధులకు ఉచిత వైద్య సేవలు, చెస్, క్యారమ్ వంటి ఆటల సౌకర్యాలు కల్పించడం ద్వారా వారు తమ సమయాన్ని సార్థకంగా గడిపేలా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. రక్తదానం మరియు సేవా కార్యక్రమాల్లో రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలుస్తున్న హనుమకొండ రెడ్ క్రాస్ పాలకవర్గాన్ని ఆమె ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో డా. పి. విజయచందర్ రెడ్డి చైర్మన్, బొమ్మినేని పాపిరెడ్డి కోశాధికారి, ఇ.వి. శ్రీనివాస్ రావు రాష్ట్ర పాలకవర్గ సభ్యులు,జిల్లా పాలకవర్గ సభ్యులు పుల్లూరు వేణుగోపాల్, పొట్లపల్లి శ్రీనివాస్ రావు, బిల్ల రమణ రెడ్డి, బొద్దిరెడ్డి సతీష్ రెడ్డి, మహిళా, శిశు, దివ్యాంగుల మరియు వయోవృద్ధుల సంక్షేమ అధికారి జె. జయంతి, వృద్ధులు డి. సాంబమూర్తి, కుక్కల సమ్మయ్య, కె. వీరభద్ర రెడ్డి, డా. పి.వి. శ్రీనివాస్ రావు, సిద్ధోజు విద్యా సాగర్, శ్రీపాద సుధాకర్ రావు,పి. సరళ, టి. శోభా కుమారి, రెడ్ క్రాస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# తైక్వాండోలో విద్యార్థుల ప్రతిభ



**బెల్లంపల్లి, జనవరి 12, (జనంసాక్షి) :** తైక్వాండో నేషనల్ ఛాంపియన్ షిప్ పోటీల్లో బెల్లంపల్లి విద్యార్థులు ప్రతిభ చాటారు. మధ్యప్రదేశ్ లోని ఉజ్జయిని తలారి మాత్ స్టేడియంలో నిర్వహించిన మహంకాళి తైక్వాండో నేషనల్ ఛాంపియన్ షిప్ పోటీల్లో బెల్లంపల్లి రైల్వే ఇన్స్టిట్యూట్ విద్యార్థులు ప్రమోద్ కుమార్, శ్రేనిత్ సాయి సిల్వర్ మెడల్స్ సాధించారు. తైక్వాండో నేషనల్ ఛాంపియన్ షిప్ లో ప్రతిభ చాటి సిల్వర్ మెడల్స్ సాధించిన విద్యార్థులను సబ్ కలెక్టర్ మనోజ్, రైల్వే ఏడీఈఎన్ గోపి, తైక్వాండో రాష్ట్ర టెక్నికల్ కమిటీ చైర్మన్, మాస్టర్ జిల్లపెల్లి వెంకటస్వామి, అభినందించారు. మెడల్స్ సాధించిన విద్యార్థులకు శిక్షణ ఇచ్చిన జైఅజయ్ ని ప్రత్యేకంగా అభినందించారు.

# స్పందించారు.. అభివృద్ధికే ప్రాధాన్యతనిచ్చారు

- ప్రజాభిప్రాయ సేకరణకు విశేష స్పందన
- రోడ్డు వెడల్పు చేపట్టాల్సిందేనంటూ సామాన్యుల డిమాండ్



**చెన్నూర్ జనవరి 12 (జనం సాక్షి) :** చెన్నూరు ప్రెస్ క్లబ్ మరియు ఎస్సీ, ఎస్టీ, బీసీ జేఏసీ చెన్నూరు ఆధ్వర్యంలో సోమవారం రోజున నిర్వహించిన రోడ్డు వెడల్పుపై ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. పట్టణంలోని అంబేద్కర్ చౌక్ నుండి రావిచెట్టు ప్రాంగణం వరకు రోడ్డు వెడల్పు చేయాల్సిందిగా డిమాండ్ చేస్తూ గ్రామీణ ప్రాంతాల్లోని సామాన్య ప్రజలతో పట్టణ కేంద్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ జేఏసీ చెన్నూర్ నాయకుడు సిద్ధి రమేష్ అధ్యక్షతన ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ, ప్రజా సౌకర్యార్థం 80ఫీట్ల వరకు రోడ్డు వెడల్పు చేయాల్సి ఉండగా, వ్యాపారుల ఒత్తిడి మేరకు ఇటీవలే 66ఫీట్లకు రోడ్డు వెడల్పును స్థానిక మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి, అధికారులు కుదించారని, దానిని కూడా వ్యాపారులు వ్యతిరేకిస్తూ 40ఫీట్లకు రోడ్డును కుదించాలని కోరడం సమంజసం కాదని ఆయన అన్నారు. పలువురు బడా వ్యాపారులు ట్రాఫిక్ సమస్యలతో సామాన్య ప్రజలు పడుతున్న ఇబ్బందులను ఏమాత్రం పట్టించుకోకుండా రోడ్డుపైనే ఇష్టానుసారంగా లోడింగ్, అన్లోడింగ్ నిర్వహిస్తున్నారని, గోడౌన్లకు కూడా వ్యాపార సముదాయాల్లోనే నిర్వహిస్తూ కనీసం ఓ వాహనాన్ని నిలుపుకునే స్థలం కూడా లేకుండా చేస్తున్నారని, బడా వ్యాపారుల భాధ్యతా రహితంగా వ్యవరిస్తున్న తీరుతో నిత్యం రోడ్డు ప్రమాదాలు జరుగుతుండగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఇరుకైన రోడ్డుతో ఇబ్బంది పడుతున్న సామాన్య ప్రజలు రోడ్డు వెడల్పు జరగాల్సిందిగా ఆకాంక్షిస్తున్నారని, అవసరం అయితే ప్రజా శ్రేయస్సుకై పట్టణంలోని వాడ వాడలో తిరుగుతూ పట్టణ ప్రజలందరి నుండి రోడ్డు వెడల్పు విషయమై అభిప్రాయాలను సేకరించి మంత్రి దృష్టికి తీసుకువెళ్తామని సిద్ది రమేష్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చెన్నూరు, కోటపల్లి, వేమనపల్లి మండలాల ప్రజలు, సామాజిక కార్యకర్తలు పాల్గొన్నారు.

# బీచ్ గ్రాప్లింగ్, రెజ్లింగ్ పోటీల్లో మెరిసిన క్రీడా రత్నాలు










- విశాఖలో జరిగిన జాతీయ స్థాయి పోటీలో మెడల్స్ సాధించిన స్టూడెంట్స్
- థయిలాండ్ లో జరిగే అంతర్జాతీయ పోటీలకు ఎంపిక

**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** పేద కుటుంబంలో జన్మించినా గ్రాప్లింగ్, రెజ్లింగ్ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ చాటారు.. జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని అంతర్జాతీయ పోటీలకు ఎంపికయ్యారు.. జయశంకర్ భూపాలపల్లి జిల్లాకు చెందిన నలుగురు స్టూడెంట్స్ పేదరికంతో ఆర్థికంగా ఇబ్బందులు ఎదురవుతున్నా, ఆత్మవిశ్వాసంతో అంచెలంచెలుగా ముందుకు సాగుతూ వివిధ పథకాలను సొంతం చేసుకుంటున్నారు.. ఇందులో భాగంగా ఇటీవల ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని విశాఖ తీరంలో జరిగిన మూడవ జాతీయ సబ్ జూనియర్, జూనియర్ సీనియర్ బీచ్ గ్రాప్లింగ్ రెజ్లింగ్ పోటీల్లో ఈ జిల్లాకు చెందిన స్టూడెంట్స్ ప్రతిభ చాటి, తమ సత్తా చాటారు..

### నలుగురికి నాలుగు పథకాలు..

జయశంకర్ భూపాలపల్లి జిల్లాకు చెందిన నలుగురు స్టూడెంట్స్ వివిధ స్థాయిలో ప్రతిభ చాటినందుకు నాలుగు మెడల్స్ అందాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం లోని విశాఖపట్నంలో నేషనల్ బీచ్ గ్రాప్లింగ్ ఛాంపియన్‌షిప్ 2026 పోటీలు ఈ నెల 3నుండి 5వరకు నిర్వహించారు. ఇందులో దేశంలోని 16 రాష్ట్రాలకు చెందిన స్టూడెంట్స్ పాల్గొనగా, జయశంకర్ భూపాలపల్లి జిల్లాకు చెందిన నలుగురు స్టూడెంట్స్ ఈ నేషనల్ బీచ్ గ్రాప్లింగ్ రెజ్లింగ్ ఛాంపియన్‌షిప్‌లో పాల్గొని వివిధ మెడల్స్ సాధించారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాముత్తారం మండలం స్తంభంపల్లికి చెందిన ముకులోతు మౌనిక నల్గొండ జిల్లాలో శ్రీకృష్ణ బిపిఈడి కాలేజీలో ప్రథమ సంవత్సరం చదువుకుంటూ విశాఖపట్నంలో జరిగిన పోటీల్లో ప్రతిభ కనబరిచి రజత పథకం సాధించింది. అదేవిధంగా జిల్లాలోని గణపురం మండలం కొత్తపల్లికి చెందిన బొమ్మెల కుమార్ సంఘమిత్ర కాలేజీలో ద్వితీయ సంవత్సరం చదువుతూ విశాఖపట్నంలో జరిగిన పోటీల్లో ప్రతిభ కనబరిచి కాంస్య పథకం సాధించాడు. జిల్లాలోని కాటారం మండలం శంకరంపల్లికి చెందిన టేకు అనిల్ కుమార్ తెలంగాణ స్పోర్ట్స్ స్కూల్ లో 6వ తరగతి చదువుతూ విశాఖపట్నంలో జరిగిన పోటీల్లో ప్రతిభ కనబరిచి, బంగారు పథకం సాధించాడు. భూపాలపల్లి మండలం పందిపంపులకు చెందిన లావుడ్య చరణ్ తేజ తెలంగాణ స్పోర్ట్స్ స్కూల్ లో 6వ తరగతి చదువుతూ విశాఖపట్నంలో జరిగిన పోటీల్లో ప్రతిభ కనబరిచి, రజత పథకం అందుకున్నాడు. ఆణి ముత్యాల్లాంటి ఈ నలుగురు స్టూడెంట్స్ జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని వివిధ మెడల్స్ సాధించడం అభినందనీయమని స్థానికులు అభినందిస్తున్నారు.

### నలుగురిలో ఇద్దరు అంతర్జాతీయ పోటీలకు ఎంపిక..

విశాఖపట్నంలో జరిగిన నేషనల్ బీచ్ గ్రాప్లింగ్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొన్న జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని నలుగురు స్టూడెంట్స్ లలో ఇద్దరు స్టూడెంట్స్ అంతర్జాతీయ స్థాయి బీచ్ గ్రాప్లింగ్ ఛాంపియన్‌షిప్ పోటీలకు ఎంపికయ్యారు. ఎంపికైన జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాముత్తారం మండలం స్తంభంపల్లికి చెందిన ముకులోతు మౌనిక, కాటారం మండలం శంకరంపల్లికి చెందిన టేకు అనిల్ కుమార్ లు వచ్చే మార్చి నెలలో థయిలాండ్‌లో జరగనున్న అంతర్జాతీయ బీచ్ గ్రాప్లింగ్ పోటీల్లో పాల్గొననున్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాకు చెందిన ఇద్దరు స్టూడెంట్స్ థయిలాండ్ లో జరిగే అంతర్జాతీయ పోటీల్లో పాల్గొనడం అభినందనీయమని స్థానికులు కొనియాడుతూ, అంతర్జాతీయ స్థాయిలో కూడా రాణించాలని శుభాకాంక్షలు తెలుపుతున్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
మంగళవారం
13 జనవరి 2026

# సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనలో ప్రజా గ్రంథాలయాలు

**సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు (సస్టైనబుల్ డెవలప్మెంట్ గోల్స్ (ఎస్‌డీజీలు) అనేవి ఐక్యరాజ్యసమితి 2015లో ప్రపంచానికి సూచించిన 17 ప్రధాన లక్ష్యాలు.వాటిలో పేదరిక నిర్మూలన నుంచి నాణ్యమైన విద్య, లింగ సమానత్వం, ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణ, శాంతియుత సమాజం వరకు విస్తృతమైన అంశాలను కలిగి ఉన్నాయి. ప్రభుత్వాలు, అంతర్జాతీయ సంస్థలు, కార్పొరేట్ రంగం ఈ లక్ష్యాల పై ఎక్కువగా మాట్లాడుతూ ఉన్నప్పటికీ, ప్రజా గ్రంథలయాల పాత్రను చాలాసార్లు తక్కువగా చూస్తున్నారు. కానీ వాస్తవానికి ప్రజా గ్రంథలయాలు సుస్థిర అభివృద్ధి (ఎస్‌డీజీల) సాధనలో కీలకమైన, (మౌనంగా) ప్రభావవంతమైన పాత్రను పోషిస్తున్నాయి.**

ప్రజా గ్రంథలయాల ప్రధాన లక్ష్యం జ్ఞానాన్ని ప్రజలందరికీ అందుబాటులో ఉంచడం. ఈ ఒకే ఒక లక్ష్యం సుస్థిరాభివృద్ధి (ఎస్‌డీజీల)ఆత్మతో సరిగ్గా సరిపోతుంది. నాణ్యమైన విద్య (ఎస్‌డీజీ-4) సాధనలో గ్రంథలయాల పాత్ర అత్యంత స్పష్టమైనది. పాఠ్యపుస్తకాలు, సూచన గ్రంథలు, వార్తాపత్రికలు, పోటీ పరీక్షల సమాచారం, డిజిటల్ వనరులు ... ఇవన్నీ విద్యార్థులకు ఉచితంగా లేదా తక్కువ ఖర్చుతో అందుబాటులో ఉంటాయి. గ్రామీణ ప్రాంతాల్లో, పేద కుటుంబాల పిల్లలకు చదువు కొనసాగించడానికి గ్రంథలయాలు కీలక ఆధారంగా నిలుస్తున్నాయి. "ఎవరూ వెనుకబడకూడదు" అనే ఎస్‌డీజీల మౌలిక సిద్ధాంతానికి ఇది ప్రత్యక్ష ఉదాహరణ.

పేదరిక నిర్మూలన (ఎస్‌డీజీ-1), గౌరవప్రదమైన ఉపాధి (ఎస్‌డీజీ-8) అంశాల్లో కూడా ప్రజా గ్రంథలయాల పాత్ర గమనించదగినది. ఉద్యోగ సమాచారం, నైపుణ్యాభివృద్ధి పుస్తకాలు, స్వయం ఉపాధి మార్గదర్శకాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల వివరాలు గ్రంథలయాల ద్వారా ప్రజలకు చేరుతాయి. డిజిటల్ యుగంలో ఆన్‌లైన్ దరఖాస్తులు, ఈ-సేవలు అర్థం కాక ఇబ్బంది పడే వారికి గ్రంథలయ సిబ్బంది మార్గనిర్దేశం చేస్తారు. ఇది పేదరికం నుంచి బయటపడే మార్గాల్లో ఓ చిన్న కొడుకు.అయినప్పటికీ ఈ అడుగు అత్యంత కీలకమైనది.

లింగ సమానత్వం (ఎస్‌డీజీ-5) సాధనలో కూడా ప్రజా గ్రంథలయాలు సామాజిక మార్పుకు వేదికలుగా మారగలవు. మహిళల హక్కులు, ఆరోగ్యం, విద్య, ఉపాధి అవకాశాలపై అవగాహన కల్పించే పుస్తకాలు, చర్చా కార్యక్రమాలు, పఠన శిబిరాలు మహిళల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంచుతాయి. ముఖ్యంగా సంప్రదాయ పరిమితుల్లో ఉన్న ప్రాంతాల్లో, గ్రంథలయం మహిళలకు ఒక సురక్షితమైన జ్ఞాన ప్రపంచాన్ని అందిస్తుంది.

ఆరోగ్యం, సంక్షేమం (ఎస్‌డీజీ-3) విషయంలో కూడా గ్రంథలయాల పాత్ర నిర్లక్ష్యం చేయలేనిది. పోషణ, మాతృశిశు ఆరోగ్యం, మానసిక ఆరోగ్యం, అంటువ్యాధులపై అవగాహన పుస్తకాలు, పాంఫ్లెట్లు, ఆరోగ్య దినోత్సవాల సందర్భంగా నిర్వహించే కార్యక్రమాలు ప్రజల్లో సరైన సమాచారాన్ని వ్యాప్తి చేస్తాయి. అజ్ఞానం వల్ల వచ్చే ఆరోగ్య సమస్యలను తగ్గించడంలో సమాచారమే తొలి ఔషధం; ఆ సమాచారాన్ని అందించే వేదికగా గ్రంథలయాలు పనిచేస్తాయి.




డిజిటల్ విభజన తగ్గించడం ద్వారా అసమానతల నివారణ (ఎస్‌డీజీ-10)లో ప్రజా గ్రంథలయాల పాత్ర మరింత కీలకంగా మారింది. ఉచిత ఇంటర్నెట్, కంప్యూటర్ సదుపాయాలు, డిజిటల్ నైపుణ్యాలపై శిక్షణలు గ్రామీణ, వెనుకబడిన వర్గాలకు కొత్త అవకాశాలను తెస్తున్నాయి. సమాచారానికి ప్రాప్యత లేకపోవడమే ఒక పెద్ద అసమానత. ఆ గ్యాప్‌ను తగ్గించడంలో గ్రంథలయాలు తమ వంతు సేవను అందిస్తున్నాయి.

పర్యావరణ పరిరక్షణ, వాతావరణ మార్పు (ఎస్‌డీజీ-13) అంశాల్లో కూడా గ్రంథలయాలు అవగాహన కేంద్రాలుగా పనిచేయగలవు. పర్యావరణంపై పుస్తకాలు, స్థానిక సమస్యలపై చర్చలు, పాఠశాల పిల్లల కోసం ప్రకృతి పరిరక్షణ కార్యక్రమాలు ప్రజల్లో బాధ్యతాయుతమైన దృక్పథన్ని పెంచుతాయి. అభివృద్ధి అంటే కేవలం ఆర్థిక వృద్ధి కాదు, భవిష్యత్ తరాలకు భూమిని సురక్షితంగా ఉంచడం కూడా ప్రధానమైన అంశమే. ఈ భావనను గ్రంథలయాలు బలంగా ప్రచారం చేయగలవు.

శాంతియుత, సమగ్రమైన సమాజాల నిర్మాణం (ఎస్‌డీజీ-16)లో ప్రజా గ్రంథలయాల పాత్ర మౌలికమైనది. విభిన్న అభిప్రాయాలు, చరిత్ర, రాజ్యాంగ విలువలు, మానవ హక్కులపై సమాచారాన్ని అందించడం ద్వారా ప్రజల్లో విమర్శనాత్మక ఆలోచన పెరుగుతుంది. అజ్ఞానం, అపోహలు తగ్గితే హింసకు చోటు తగ్గుతుంది. ప్రజా గ్రంథలయం ఒక ప్రజాస్వామ్య వేదికగా, స్వేచ్ఛాయుత ఆలోచనల కేంద్రంగా మారుతుంది.

భారతదేశంలో ప్రజా గ్రంథలయ వ్యవస్థకు గొప్ప చరిత్ర ఉంది. అయితే నేటి పరిస్థితుల్లో అనేక గ్రంథలయాలు నిధుల కొరత, సిబ్బంది లోపం, ఆధునికీకరణ లేకపోవడం వంటి సమస్యలతో సతమతమవుతున్నాయి. ఎస్‌డీజీల సాధనలో గ్రంథలయాలను నిజంగా ఉపయోగించాలంటే, ప్రభుత్వ విధానాల్లో వాటికి స్పష్టమైన స్థానం ఇవ్వాలి. గ్రంథలయాలను కేవలం పుస్తక నిల్వలుగా కాక, జ్ఞాన కేంద్రాలు, కమ్యూనిటీ హబ్‌లుగా అభివృద్ధి చేయాలి. డిజిటల్ సదుపాయాలు, శిక్షణ పొందిన సిబ్బంది, స్థానిక అవసరాలకు అనుగుణమైన కార్యక్రమాలు అవసరం.

మొత్తానికి, సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు సాధించాలంటే భారీ ప్రాజెక్టులు, పెద్ద పెట్టుబడులు మాత్రమే కాదు; ప్రజల దైనందిన జీవితాలను తాకే మేధో సంపత్తిని పెంచే బలమైన సంస్థలు కూడా అవసరం. ప్రజా గ్రంథలయాలు కూడా అలాంటి సంస్థలే అనే విషయాన్ని ప్రజలూ, పాలకులు కూడా గురించాలి. అవి ప్రజలందరికీ ఏలాంటి వివక్షతలు లేకుండా జ్ఞానాన్ని సమానంగా పంచుతూ, అవగాహన పెంచుతూ, ప్రజలను సాధికారితం చేస్తూ, ఎస్‌డీజీల ఆత్మను నేలమీద అమలు చేస్తున్నాయి.ఇంత శక్తివంతమైన గ్రంథలయల పాత్రను గుర్తించి, బలోపేతం చేయడం సుస్థిర అభివృద్ధి దిశగా ఒక తెలివైన అడుగు వేయటమే అవుతుంది.



**డాక్టర్. కోలాహలం రామ్ కిశోర్**
**9849328496**

# మైనార్టీలను ఉన్నత విద్యకు దూరంచేసే కుట్ర

డాక్టర్లు కావాలని ఆ విద్యార్థులు రేయింబవళ్లు కష్టపడి చదివారు. జాతీయస్థాయిలో జరిగే నీట్ పరీక్షలో ఉత్తమ ర్యాంకులు సాధించారు. ప్రతిభ ఆధారంగా, కౌన్సెలింగ్ ద్వారా శ్రీ మాతా వైష్ణోదేవి ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ ఎక్సిలెన్స్ లో సీట్లు సంపాదించారు. అయితే అందులో మెజార్టీ సీట్లు జమ్మూ కశ్మీర్‌కు చెందిన ముస్లింలు దక్కించుకోవడం కొందరికి నచ్చలేదు. ఫలితం.. ఆ మెడికల్ కళాశాల గుర్తింపును రద్దుచేసే వరకు పరిస్థితి వెళ్లింది. అయితే ఆ విద్యార్థులకు ఇతర మెడికల్ కాలేజీల్లో సీట్లు సర్దుబాటు చేస్తామని అధికార యంత్రాంగం చెబుతున్నా.. ఇక్కడ మైనార్టీ విద్యార్థుల పట్ల వివక్ష అనేది స్పష్టంగా కనిపిస్తున్నది. గతంలోని అనేక ఘటనలను పరిశీలిస్తే.. మైనార్టీలను ఉన్నత విద్యకు దూరం చేసే కుట్రలో ఇది ఒక భాగం మాత్రమేననే అనుమానం వ్యక్తమవుతున్నది.



కర్ణాటక వంటి రాష్ట్రాల్లో హిజాబ్ పేరుతో ముస్లిం అమ్మాయిలను తరగతి గదులకు దూరం చేసే ప్రయత్నాలు జరిగాయి. ఇప్పటికే మైనార్టీల విద్యాస్థాయి జాతీయ సగటు కంటే చాలా తక్కువ. డ్రాపౌట్ రేట్లు ఎక్కువ.

**మతపరమైన విభజన రేఖలు :** వైష్ణోదేవీ మెడికల్ కాలేజీలో ప్రవేశాలు పూర్తి పారదర్శకంగా జరిగాయి. 'నీట్'లో వచ్చిన మెరిట్ ఆధారంగా, కౌన్సెలింగ్ చేపట్టాకే విద్యార్థులకు సీట్లు కేటాయించారు. అయితే ఎంపికైన వారిలో జమ్మూ ప్రాంతానికి చెందిన మైనార్టీ విద్యార్థులు ఎక్కువగా ఉన్నారన్న విషయం బయటకు రాగానే కొన్ని సంఘాలు ఆందోళనకు దిగాయి. వైష్ణోదేవీ ఆలయ విరాళాలతో నడిచే కాలేజీలో వేరే మతస్తులు ఎలా చదువుతారు అంటూ 'శ్రీ మాతా వైష్ణోదేవి పుణ్యక్షేత్ర సంఘర్ష్ సమితి' వంటి సంస్థలు నిరసనలు చేపట్టాయి. అయితే ఇక్కడ విద్యార్థుల ప్రతిభ, అర్హత కంటే మతపరమైన విభజన రేఖలు గీసి.. వివక్ష చూపడం ఎలా సమంజసమో వారికే తెలియాలి.

**అనుమతుల రద్దు వెనక అనేక అనుమానాలు :** కొన్ని సంఘాలు ఆందోళనలు చేయడం, ఆ వెంటనే ఎన్ఎంసీ వెంటనే ఆకస్మిక తనిఖీలు చేపట్టి అనుమతులు రద్దుచేయడం వెనక అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సాధారణంగా చిన్నచిన్న లోపాలుంటే సరిదిద్దుకోవడానికి సమయం ఇస్తారు. కానీ అప్పటికప్పుడు గుర్తింపును రద్దు చేయడమంటే ఆందోళనకారుల డిమాండ్లకు తలొగ్గినట్లే కనిపిస్తున్నది. అధ్యాపకుల కొరత, మౌలిక వసతుల లేమి వంటి సాంకేతిక కారణాలను చూపినప్పటికీ.. ఆ నిర్ణయం వెనక అనేక ఒత్తిళ్లు స్పష్టంగా కనిపిస్తున్నాయి. అనుమతుల రద్దు తర్వాత కొందరు స్వీట్లు పంచుకొని బహిరంగంగా సంబరాలు చేసుకున్నారు. అయితే ఇది కేవలం 50 మంది విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించిన విషయమే కాదు.. రాజ్యాంగం కల్పించిన విద్యాహక్కుకు ముప్పు వాటిల్లే పరిణామం. వైష్ణోదేవీ కళాశాల ఘటనలో చదువులో మెరిట్ కంటే మతమే ప్రభావం చూపగలిగిందా? అనే ప్రశ్న ఉత్పన్నమవుతున్నది. ఒక డాక్టర్ రోగి ప్రాణాలను కాపాడేటప్పుడు కులం, మతం చూడరు కదా. అలాంటి డాక్టర్ చదువులో అర్హత ఉండి, ర్యాంకు సాధించిన విద్యార్థులను అడ్డుకోవడమంటే దేశ ప్రగతిని అడ్డుకోవడమే.

**ఉన్నత విద్యకు దూరం చేసే కుట్రేనా.. :** మైనార్టీలను ఉన్నత విద్యకు దూరం చేసేలా గత దశాబ్దకాలంగా అనేక అంశాలను తెరపైకి తీసుకురావడమే కాకుండా.. వివిధ మార్గాల ద్వారా దాడులు జరుగుతూనే ఉన్నాయి. మైనార్టీ విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించడానికి అండగా ఉండే "మౌలానా ఆజాద్ నేషనల్ ఫెలోషిప్ (ఎంఏఎన్ఎఫ్)' అను కేంద్ర ప్రభుత్వం మూడేళ్ల క్రితమే రద్దు చేసింది. దీని వల్ల చాలా మంది మైనార్టీ విద్యార్థులు పీహెచ్ డీకి దూరమయ్యారు. కర్ణాటక వంటి రాష్ట్రాల్లో హిజాబ్ పేరుతో ముస్లిం అమ్మాయిలను తరగతి గదులకు దూరంచేసే ప్రయత్నాలు జరిగాయి. ఇప్పటికే మైనార్టీల విద్యాస్థాయి జాతీయ సగటు కంటే చాలా తక్కువ. డ్రాపౌట్ రేట్లు ఎక్కువ. ప్రొఫెషనల్ కోర్సుల్లో ప్రాతినిధ్యం పరిమితమే. జనాభాలో ముస్లింలు 15శాతం వరకు ఉన్నా.. ఉన్నత విద్యలో వారి ప్రాతినిధ్యం నాలుగు శాతం మాత్రమే. ఇలాంటి పరిస్థితుల్లోనూ మెరిట్ ద్వారా పైకి వస్తున్న వారిని అడ్డుకోవడమంటే.. మైనార్టీలను ఉన్నత విద్యకు దూరం చేసే కుట్రే. విద్యను మతంతో కొలవడం మొదలుపెడితే.. ఈ రోజు ఒకకాలేజీ, రేపు ఒక యూనివర్సిటీ.. ఎల్లుండి మొత్తం వ్యవస్థే ఇలా తయారయ్యే ప్రమాదముంది. భారత రాజ్యాంగం మైనార్టీలకూ సమాన హక్కులు కల్పిస్తుంది. కానీ, అమలు లోపం ఉంది. ప్రభుత్వాలు విద్యా వ్యవస్థను కమ్యూనల్ పాలిటిక్స్ నుంచి రక్షించాలి. మేధావులు ఇప్పటికైనా ఈ విషయంపై మౌనం వీడాలి.

**మహమ్మద్ ఆరిఫ్**
**7013147990**

## ఓ నవ క్రాంతి పర్వదినమా..!

ఏరులై పారే సంస్కృతివే నీవు,
ఏడాదికోసారి మన తెలుగులోగిళ్ళ దారి పట్టే
ఆప్యాయతల పండుగవే నీవు.మట్టి వాసనల మమకారం
మన జాతిలో నింపిన"గుండె-లయ"పేరే-సంక్రాంతి!.
భోగి మంటల దగ్గర"పోయినదంతా పోనీ"అని పాత
చింతలు,పగలు,
పగిలిన కలలు బూడిదలో కలిసి పోతుంటే- కొత్త
ఆశలకి,ఆశయాలకి మంట వేడి తోడవుతుంది.మకర
క్రాంతి పొద్దెక్కితూనే ఉత్తరాయణం పట్టినట్టు,మన
బతుకులు కూడా ప్రగతి పథమున నడవాలని అవని
మనకి ఆదేశిస్తోంది.బల్లున తెల్లారంగా కల్లాపు చల్లి
వాకిళ్ళలో వేసిన,అమ్మ చేతి ముగ్గుల్లో పూలరేఖలు
నవ్వుతుంటే!డ్రోన్ కెమెరాలు ఎగిరి,ఆ అందాన్ని ఆకాశం
నుంచే లైవ్‌లో చూపిస్తుంటాయి!
పూబంతుల పరిమళం
వాట్సాప్ స్టేటస్‌గా మారి,
"హ్యాపీ సంక్రాంతి" మెసేజ్‌లు
విశ్వమంతుట ఉన్న తెలుగు బిడ్డల ఫోన్లకు అమ్మ చేతి
ఆశీస్సుల్లా చేరుతాయి.గొబ్బిళ్ళు,నవధాన్యాలు
జీవవైవిధ్యానికి సిలబస్ అయితే,
ఈ తరం పిల్లలు గూగుల్‌లో వెతుక్కుంటూ "ఇదే మన
పండుగ రూటు అని తెలుసుకుంటారు.
హరిదాసుపాటలు ఇప్పుడు యూట్యూబ్‌లోనూ
వినిపిస్తాయి,
గంగిరెద్దుల విన్యాసాలు రీల్స్‌గా
తిరుగుతాయి.కానీ..పల్లెచౌరస్తాలో చూసిన
ఆనందం ఆ స్క్రీన్‌లకు అందదు సుమా..!

రైతన్న పొలంలో డ్రిప్ సిస్టమ్‌లతో నీళ్లు
పడ్డా!నింగి వైపు ఎదురు చూపులు తప్పవాయె?విత్తనాల
మీద ఆయన పెట్టే నమ్మకం మాత్రం తాతల కాలం
నాటిదే..
పశువుల కొమ్ములకి రంగులేసి"మనకే కాదు రా-మీకీ
పండుగ" అని తల నిమురుతాడు.ప్రభ బండ్ల జాడలో
ట్రాక్టర్ల దరువు,జాతరలో మేళతాళాల గోల ఇంకా
మారలేదు.పతంగులు ఎగిరే ఆకాశంలో డ్రోన్‌లు
తిరిగినా..దారం పట్టిన చేతికి ఇంకా మట్టే!"నా పతంగి
ఎత్తు"అని పిల్లల పోటీ ఆన్‌లైన్ గేమ్స్‌కీ సవాల్ గ
మారింది.

ఓ సంక్రాంతి తల్లీ! 5G వేగంలో జీవితం దరువు,
నీవొచ్చేసరికి మా మనసులు మాత్రం పండుగ వైపే
అడుగులేసి నడుస్తాయి..
సంప్రదాయం నీ వేరైతే,సాంకేతికత నీ కొమ్మ.రెండూ
కలిసి నప్పుడే మన సంస్కృతి చెట్టుకు
పచ్చదనం,భవిష్యత్తు.
అందుకే అమ్మా! మట్టివాసనతో,డిజిటల్
వెలుగులతో,మనుషుల మధ్య దూరం తగ్గించే స్నేహ
సిగ్నల్స్‌తో ప్రతి ఇంటి గడప దాటుతూ!,"నవ క్రాంతివై
చైతన్య స్రవంతులు
ప్రసరింపుమా!"...




**మేకిరి దామోదర్**
**జిల్లా: వరంగల్**
**ఫోన్:9573666650**

# అణచివేతను ప్రశ్నించడమే గోపిరాజన్నకు నివాళి

**(12 జనవరి 1985 గోపి రాజన్న వర్ధంతి)**

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో జగిత్యాల ప్రాంతం రైతాంగ పోరాటాలకు చాలా బలమైన ప్రాంతం. అక్కడ 1978లో భూస్వాముల అణచివేతకు వ్యతిరేకంగా విశాలమైన రైతాంగ పోరాటం కొనసాగి చరిత్రలోనే జగిత్యాల జైత్రయాత్రగా చిరస్థాయిగా నిలిచిపోయింది. అక్కడి నుంచి ప్రారంభమైన రైతాంగ ఉద్యమం కొనసాగుతూ వస్తూ అనేక రైతాంగ హక్కులను సాధించుకోగలిగింది. ప్రధానంగా దున్నేవానికే భూమి అనే నినాదాని సాకారం చేసుకునే క్రమంలో చాలా మంది రైతులు నిర్బంధాలకు గురయ్యారు. ఆ క్రమంలోనే ఆ ఉద్యమాల అణచివేతకు టాడా చట్టాన్ని ప్రభుత్వాలు తీసుకువచ్చాయి. ఆ క్రమంలో జగిత్యాల పట్టణంలో న్యాయవాదిగా గోపిరాజన్న తన న్యాయవాద వృత్తిని కొనసాగిస్తూ పీడిత ప్రజల పక్షాన ఉండి న్యాయం అందించడానికి సిద్ధపడినాడు. అటువంటి వ్యక్తి అప్పటికే రైతాంగ విప్లవోద్యమం బలంగా ఉన్న నేపథ్యంలో విప్లవానికి అవరోధంగా ఉన్న కొద్ది మందిని నిర్మూలించే క్రమంలో వారు చేసిన హత్యకు నిరసనగా గోపిరాజన్నను కిరాతంగా హత్య చేశారు. 12 జనవరి, 1985వ తేదీ రాత్రి తొమ్మిది గంటల ముప్పయి నిమిషాలకు జగిత్యాల పట్టణంలో ఆనాటి ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం కరీంనగర్ జిల్లా ఉపాధ్యక్షుడు, న్యాయవాది గోపిరాజన్నను మతోన్మాద శక్తులు తుపాకులతో కాల్చి చంపారు. ఆనాటి నుండి ఈ నాటి వరకు ప్రజాస్వామిక లౌకిక శక్తులపై ప్రభుత్వాలు హత్యలు చేస్తూ గుర్తు తెలియని మరణాలుగా ప్రకటిస్తున్నాయి. అందులో భాగంగానే గోపిరాజన్నతో మొదలైన పౌరహక్కుల సంఘం నేతల హత్యాకాండ 2001 ఆజాంఅలీతో ఆరుగురిని హత్య చేసింది. ఇప్పటికి 4 దశాబ్దాలు దాటుతున్నా ఏ ఒక్క హంతకుడు దొరకలేదు, శిక్ష పడలేదు. ఇది ప్రజాస్వామ్యానికున్న బలం. ఇదే స్థితి కేంద్ర ప్రభుత్వం నేడు కొనసాగిస్తున్నది. హిందూ మతోన్మాద దాడులన ప్రశ్నించారని గొడ్డు మాంసం తిన్నారని బిజెపి నాయకులు చేసిన అక్రమాలను వెలికి తీసారని ఇక నేడైతే మధ్య భారతంలో ఆపరేషన్ కగార్ పేరుతో జరుగుతున్నటువంటి ఆదివాసీ, మావోయిస్టుల హత్యాకాండలను ప్రశ్నిస్తున్నారని కార్పొరేట్ల దోపిడీలను ప్రశ్నిస్తున్నారని తీవ్రమైన రాజ్యహింస దేశంలో రాజ్యమేలుతున్నది. ఈ నేపథ్యంలో మనందరం హక్కుల అవగాహనను పెంచుకొని బాధ్యతగా రాజ్యాంగాన్ని ప్రజాస్వామ్యాన్ని రక్షించుకునే ప్రయత్నం చేద్దాం.

దేశంలో నేడు లౌకిక స్వభావం ఇతర మతాలపై ఉండాల్సిన స్వేచ్ఛ, గౌరవం స్థానంలో విద్వేశ రాజకీయాలు, దాడులు రాజ్యమే అమలు చేస్తున్నది. అందులో భాగంగానే చత్తీస్‌ఘడ్ రాయపూర్‌లో క్రిస్మస్ సందర్భంగా క్రైస్తవా ప్రార్థనాలంపై దాడిచేసి విధ్వంసాన్ని సృష్టించిన స్థితిని మనందరం చూస్తున్నాం. ఏ మతమైనా ప్రజాస్వామ్యాన్ని, ప్రేమను పంచడానికే ప్రయత్నం చేస్తాయి. కానీ మతం పేరుతో మానవీయతను అణచివేసేందుకు ప్రయత్నం చేస్తున్నాయి. ఏ మతమైనా అటువంటి విద్వేశ మత ఉన్మాదాన్ని కలిగి ఉండడమనేది సరైనది కాదు.



గోపిరాజన్న కరీంనగర్ జిల్లా జగిత్యాల తాలూకా కోల్వాయి గ్రామంలో భూమిలేని రైతుకూలీ కుటుంబంలో పుట్టాడు. ట్యూషన్లు చెప్పుకుని చదువుకున్నాడు. అక్కడి పరిస్థితులు తట్టుకోలేక బయటికి వచ్చి అనేక ఆర్థిక ఇబ్బందులకు గురి అయ్యాడు. ఆ తరువాత అనేక ఆర్థిక ఇబ్బందులకు గురి అవుతూ, న్యాయశాస్త్ర విద్య అభ్య సించాడు. న్యాయవాదిగా రిజిస్టరు చేసుకొని జగిత్యాలలో 1981లో ప్రాక్టీసు ప్రారంభించాడు. న్యాయవాద వృత్తి ప్రారంభించిన నాటినుంచే పౌరహక్కుల సంఘంలో పనిచేయడం మొదలు పెట్టాడు. గోపి రాజన్న కాలం తెలంగాణ ప్రాంతంలో కరీంనగర్ జిల్లాలో జగిత్యాల సిరిసిల్లా మహదేవ్‌పూర్ ప్రాంతాలు కల్లోలిత ప్రాంతాలుగా ప్రకటించబడి 125 సాయుధ పోలీసు క్యాంపులతో నిత్యనిర్బంధం కొనసాగుతూ ఉండేది. ముఖ్యంగా మహిళలపై అత్యాచారాలు ఎక్కువగా కొనసాగుతూ ఉండేవి. వాటిని నిలువరించడం కోసం రైతాంగానికి న్యాయం అందించడం కోసం ప్రజల పక్షాన న్యాయవాదిగా నిలబడడం నేరంగా ప్రభుత్వం పరిగణిస్తూ వచ్చింది. కానీ రాజ్యమే అన్యాయంగా మారినపుడు న్యాయవాది ప్రజాపక్షం వహించకుండా ఎలా ఉండగలడు.

1983-85 మధ్య కాలంలో నక్సలైట్ పోరాటాల పట్ల ముఖ్యమంత్రి ఉదాసీన భావం ఇకముందు కనిపించవద్దని, పోలీసుల ఆచాచక హింసకు ప్రభుత్వం కూడా తోడ్పడి 85 కాలం ఆది ఆట, పాట, మాట బంద్‌లో తెలంగాణ 'నిశ్శబ్దం' చేయడానికి ప్రతయ్నం తీవ్రతరం చేశారు. ఈ రెండు సంవత్సరాల కాలంలో కొందరు నక్సలైటు ముఖ్యకార్యకర్తలను నిర్బంధించడం ద్వారా నక్సలైట్ ఉద్యమాన్ని బలహీన పరచలేమని భావించిన ప్రభుత్వం నక్సల్ ఉద్యమాన్ని బలపరిచే అన్ని ప్రజాస్వామిక ఉద్యమాలన్నింటిని నిషేధించారు. సంస్థలను నిషేధించడంతోపాటు వ్యక్తులను అదృశ్యం చేసే స్థితికి ప్రభుత్వాలు చేరుకున్నాఇ.ఒకవైపు లాక్ హత్యలు, ఎన్‌కౌంటర్ హత్యలు, మరోవైపు మనుషుల్ని మాయం చేయడం లాంటి కొత్త నిర్బంధం ప్రారంభం అయ్యింది. ఇప్పటికే రాష్ట్రంలో 38 మంది మాయం కాబడ్డారు.

1973లో పౌరహక్కుల సంఘం ఏర్పాటుకు ముందే వివిధ రూపాల్లో కార్యక్రమాలను చేపట్టి పౌర హక్కుల ఉద్యమానికి పునాది వేసింది. ఈ ఉద్యమంలో కవులు, మేధావులు, ప్రజా స్వామిక వాదులు కలిసి కట్టుగా హక్కుల ఉద్యమాన్ని ముందుకు తీసుకుపోయారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో శ్రీకాకుళ సాయుధ రైతాంగ ఉద్యమంపై కొనసాగిన బూటకపు ఎన్‌కౌంటర్ హత్యల నిర్బంధాలను వ్యతిరేకిస్తూ పౌరహక్కుల సంఘం 1973లో ఆవిర్భవించింది. జలగం వెంగళ్‌రావు ప్రారంభించిన ఎన్‌కౌంటర్ హత్యలను వ్యతిరేకిస్తూనే ప్రభుత్వాలు అన్యాయంగా అమలు చేస్తున్న ఉరిశిక్షలకు వ్యతిరేకంగా కూడా తన కార్యాచరణను కొనసాగించింది. ప్రత్యామ్నాయ రాజకీయాలతో ముందుకు వచ్చిన రైతాంగ, గిరిజన ఉద్యమాల పై రాజ్యం తీవ్ర నిర్బంధాన్ని అమలుచేసి బూటకపు ఎన్ కౌంటర్ల పేరుతో ఉద్యమకారులను చంపింది. ఈ నిర్బంధాన్ని అణిచివేతను వ్యతిరేకిస్తూ రాష్ట్ర వ్యాపితంగా పౌరహక్కుల సంఘం ఇతర హక్కుల సంఘాలు ప్రచారం చేసాయి. 1975 లో ఇందిరా గాంధీ అత్యవసర పరిస్థితి ప్రకటించి, ప్రజాస్వామిక ఉద్యమాలను అణిచివేయడం జరిగింది. పౌరహక్కుల సంఘం నాయకుల్ని కూడా జైళ్ళలో నిర్బంధించింది. ఎమర్జెన్సీ తొలగించిన తర్వాత ప్రజాస్వామిక వాతావరణం కొంత మేరకు మెరుగుపడడంతో పౌరహక్కుల సంఘం మళ్ళీ తన కార్యాచరణ ప్రారంభించింది. తన కార్యచరణను అన్ని ఆధిపత్య వ్యవస్థలకు వ్యతిరేకంగా విస్తృత పరుచుకుంది. ఇవ్వాళ పోలీసులు చేస్తున్న ఎన్‌కౌంటర్లన్నీ పోలీసు హత్యలుగా భావించడానికి, లాకప్ హత్యలు జరిగినప్పుడు మేధావులు, ప్రజలు పోలీసులను నిలదీసే చైతన్యం పెరగడానికి పౌరహక్కుల సంఘం కృషి ఉంది. ఈ కృషి వెనుక మేధావుల ప్రజాస్వామిక వాదుల పాత్ర చాలా ఉంది.

గోపిరాజన్నను హత్య చేసినట్లుగానే బెంగుళూరుకు చెందిన గౌరిలంకేష్ అనే జర్నలిస్టును తన పనులు ముగించుకొని ఇంటికి వచ్చి గేటువేస్తున్న సమయంలో కాల్చిచంపారు. చత్తీస్‌ఘడ్ రాష్ట్రానికి చెందిన ముఖేష్ చంద్రాకర్ అనే ఫ్రీలాన్స్ జర్నలిస్టును ఒక అవినీతి ఘటనపై నిజాలు వెలికితీసినందుకు కాంట్రాక్టర్ హత్య చేశాడని ప్రచారం చేస్తున్నారు. డిసెంబర్ 25, 2024లో వచ్చిన ఈ ఘటన ప్రచారం నేపథ్యంలో ప్రభుత్వం రక్షణ కల్పించకపోవడం వలనే ఈ హత్య జరిగింది. ముఖేష్ చంద్రాకర్ చిన్నప్పుడే తల్లిదండ్రులను కోల్పోయి అన్న ఆలన పాలనలో పెరిగి సమాజంలో ఒక బాధ్యతాయుతమైన జర్నలిస్టు వృత్తిని చేపట్టాడు. బస్తర్ జంక్షన్ అనే యూట్యూబ్ ఛానెల్‌ను కొనసాగిస్తున్నాడు. ఎన్‌డి టివిజి ఫ్రీలాన్స్ జర్నలిస్టుగా పనిచేస్తున్నాడు. ఆ ఉద్యమ ప్రాంతంలో జరుగుతున్న ప్రతిఒక్క సంఘటనపై తను నివేదికలను తయారు చేసి ప్రజలకు అందిస్తున్నారు. ఆదివాసీ ప్రాంతాలు నేడు ఆదివాసీ గ్రామాలను మించిన భద్రతా బలగాల క్యాంపులను కలిగి ఉన్నాయి. ఆదివాసీలకు రెట్టింపు సాయుధ బలగాలు బస్తర్‌ను చుట్టుముట్టి ఉన్నాయి. ఈ స్థితిలో ఆదివాసీల ప్రాథమిక హక్కులు పూర్తి అణచివేతకు గురి అవుతున్న స్థితిలో బస్తర్ టాకీస్ అనే యూట్యూబ్ ఛానెల్‌గాని బస్తర్ జంక్షన్ యూట్యూబ్ ఛానెల్‌గాని జరిగిన ఘటనలపై నిజనిజాలను ప్రపంచానికి అందించే ప్రయత్నం చేస్తున్నాయి. అఖిల భారత స్థాయిలో ఉన్న హక్కుల సంఘాలక చత్తీస్‌ఘడ్ ప్రాంతం నిషేద ప్రాంతంగా మారి పోయింది. ప్రభుత్వం హక్కుల సంఘాలను అడుగు పెట్టనివ్వడం లేదు. ఇది గోపిరాజన్న ఎదుర్కొన్న నిర్బంధ కాలాన్ని మించిన కాలంగా మేము భావిస్తున్నాము. ప్రజాస్వామ్యంలో ఉద్యమాల పుట్టుకకైన వాటి అభివృద్ధికైనా ఆనాడు ఉన్న సామాజిక పరిస్థితుల పునాది ఎంతో ముఖ్యంగా ఉన్నది. దాన్ని దృష్టిలోపెట్టుకోకుండా ఉద్యమాల అణచివేతనే ప్రధానం చేసుకుంటే హత్యలే ఉంటాయి తప్ప ప్రజాస్వామ్య విలువలు ఎక్కడా ఉండవు. అందుకే 1985 నుండి కొనసాగిన హక్కుల సంఘాల హత్యలు జరిగి 40 ఏండ్లు దాటుతున్న ఇప్పటి వరకు ఏ నేరస్తుడు శిక్షించబడలేదు అంటే హంతకులు ప్రభుత్వము కలిసిపోయే పాలన చేస్తున్నాయనే విషయాన్ని ప్రజలందరూ గుర్తించాల్సిన అవసరం ఉంది. జనవరి 12 గోపి రాజన్న అమరత్వం సందర్భంగా ఆనాడు జరిగిన రైతాంగ పోరాటంపై జరిగిన నిర్బంధాన్ని దాని వ్యతిరేకంగా హక్కుల సంఘం కొనసాగించిన కార్యచరణను గుర్తు చేసుకుంటూ నేడు ప్రజా ఉద్యమాలపై రైతాంగ ఉద్యమాలపై ఆదివాసీ ఉద్యమాలపై కొనసాగుతున్న తీవ్రమైన అణచివేతను ప్రశ్నించడమే, నిలదీయడమే గోపిరాజన్నకు ఇస్తున్న నివాళిగా మనం గుర్తించాలి.

**ఎన్. నారాయణరావు**
**ప్రదాన కార్యదర్శి**
**పౌరహక్కుల సంఘం, తెలంగాణ**

# అక్షరయోధుడికి అక్షర నివాళులు

'నిఖార్సైన జర్నలిజమే తుదిశ్వాస'గా జీవించిన సీనియర్ జర్నలిస్ట్, 'ప్రతిపక్షం' దినపత్రిక వ్యవస్థాపకులు, సంపాదకులు మహమ్మద్ ఫజల్ రహమాన్ హైదరాబాద్ లోని నిమ్స్ ఆసుపత్రిలో క్యాన్సర్ వ్యాధికి చికిత్స పొందుతూ ఈ నెల 9 నాడు మరణించడం కడు విషాదకరం. ఆయన మరణంతో పత్రికారంగం ఒక సమర్థవంతమైన గొప్ప సంపాదకుడిని కోల్పోయింది. ఆయన మరణం పత్రికా రంగానికి నిలువెల్ల తీరనిలోటు.



మహమ్మద్ ఫజల్ రహమాన్ పోరాటాల పురిటిగడ్డ ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందినవారు. ఆయన ప్రస్తుత సిద్దిపేట జిల్లాలోని హుస్నాబాద్ నియోజకవర్గం అక్కన్నపేట మండల పరిధిలో గల 'అంతకపేట' గ్రామంలో 1960లో జన్మించారు. ఆయన చిన్ననాటి నుండి సమాజాన్ని సునిశితంగా పరిశీలించారు. ఆయన 1980 లో ఆంధ్రప్రభ దినపత్రికలో 'జర్నలిస్ట్ గాను ప్రజా అక్షర ప్రస్థానాన్ని' ప్రారంభించారు. ఆయన అనతి కాలంలోనే అనేక ప్రజా సమస్యలతో పాటు జర్నలిస్టుల సమస్యలను అక్షరీకరించి వెలుగులోకి తీసుకు వచ్చి వాటి పరిష్కారాల దిశగా కృషి చేశారు. సామాజిక వెలుగుల ప్రసరణలతో ఆ క్రమంలోనే ఆయన 1990 లో 'హుస్నాబాద్ పబ్లిక్ పాఠశాల'ని ప్రారంభించి ఎంతోమంది భావి పౌరులను తీర్చిదిద్దారు.

మహమ్మద్ ఫజల్ రహమాన్ క్రమానుగతంగా ప్రజాతంత్ర, జీవగడ్డ, ఆంధ్రజ్యోతి, దిశ, ముద్ర మొదలైన దినపత్రికలలో వివిధ హోదాలలో నాలుగున్నర దశాబ్దాలకు పైగా సమర్థవంతమైన పాత్రికేయులుగాను పనిచేశారు. ఆ రకంగా ఆయన అనేక పత్రికలలో పనిచేసి జర్నలిజంలో విశేష నైపుణ్యాన్ని పొందాడు. ఆ క్రమంలోనే ఆయన స్వంతంగా 'ప్రతిపక్షం' దినపత్రికని ప్రారంభించి 'సంపాదకులు' గా కొనసాగారు. జర్నలిజంపై ఉన్న మక్కువ మరియు అంకితభావం మూలంగా ఆయన గొప్ప సంపాదకులుగా రాణించారు.

తెలుగు నేలలో అనేక దినపత్రికలు ఉన్ననూ మరొక కొత్త దినపత్రిక అవసరమా ? అని కొందరు పనిగట్టుకొని కుస్తితప్ విమర్శలు చేసిననూ మహమ్మద్ ఫజల్ రహమాన్ వాటన్నింటిని ఏమాత్రం పట్టించుకోకుండా ముందుకుసాగి ప్రతిపక్షం దినపత్రికని సువిశాల ప్రజరాసులలోకి సమర్థవంతంగా తీసుకెళ్లారు. అనతి కాలంలోనే అశేష పాఠకుల ఆదరాభిమానాలు చూరగొని జర్నలిజంలో సరికొత్త పోకడలు అనుసరించిన ఘనత ఆయనకే చెందుతుంది. 'ప్రజలే కేంద్రంగా, ప్రజా సమస్యలే పరిష్కారంగా' ఆయన సమర్థవంతంగా సంపాదకీయాలు రాశారు. ఇంటర్నెట్ యుగంలోనూ ముఖ్యంగా ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (ఏ.ఐ) హవా కొనసాగుతున్న ప్రస్తుత తరుణంలో అందుకు అనుగుణంగా ప్రతిపక్షం దినపత్రికని నిత్యనూతనంగా తీర్చిదిద్దడంలో ఆయన విశేష కృషి చేశారు.


హుస్నాబాద్‌లో ప్రెస్‌క్లబ్ ఆవిర్భావంలోనూ, హుస్నాబాద్ జర్నలిస్టు సంఘం నిర్మాణంలోను మహమ్మద్ ఫజల్ రహమాన్ క్రియాశీల పాత్రని నిర్వహించారు. అలాగే హుస్నాబాద్ యూత్ అసోసియేషన్ నిర్మాణంలోనూ మరియు స్ఫూర్తి అసోసియేషన్‌లోనూ ఆయన క్రియాశీలంగా పాల్గొని ఎందరికో మార్గదర్శిగా నిలిచారు. ఎన్నో అవరోధాలు, కష్టాలు ఎదురైననూ మహమ్మద్ ఫజల్ రహమాన్ వాటన్నింటిని అధిగమించి, నిబద్ధతతో పురోగమించి నిజాయితీ గల జర్నలిస్ట్‌గాను పేరు ప్రఖ్యాతులు గడించారు. భావి జర్నలిస్టులు మహమ్మద్ ఫజల్ రహమాన్ పాత్రికేయ కృషిని ఆదర్శంగా తీసుకోవాల్సిన అవసరం తప్పకుండా ఉంది. అంతిమంగా ఆయన జీవితం 'నిజాయితీకి నిలువుటద్దం'గా నిలిచింది. ఉపాధ్యాయుడు గాను, రచయిత గాను, సంపాదకుడు గాను ఇలా విభిన్న రంగాలలో తనదైన శైలిలో విలక్షణ ప్రావీణ్యాన్ని కనబరచి అకాల మరణంతో మనందరి నుండి భౌతికంగా దూరమైన మహమ్మద్ ఫజల్ రహమాన్ గారికి నేను ఈ సందర్భంగా 'అక్షర నివాళులు' అర్పిస్తున్నాను.



**జె.జె.సి.పి. బాబూరావు**
**రీసెర్చ్ స్కాలర్, 94933 19690**

# తాండూర్ సబ్ రిజిస్టర్ ఆఫీస్‌లో ప్రైవేట్ వ్యక్తులదే హవా..

- ఏసీబీ అధికారులు దాడులు చేసిన తీరు మారని అధికారులు
- అధికారుల స్థానంలో ప్రైవేట్ వ్యక్తుల చలామణి
- ఒక డాక్యుమెంట్ కు వెయ్యి రూపాయలు వసూలు
- జీతం ఇక్కడ పని అక్కడ
- చేయాల్సింది నైట్ డ్యూటీ.. పగలు పని చేసి పైసా వసూల్
- ఈ ఆఫీస్ లో అధికారుల పనితీరు ఎట్లున్నదో సూడుర్రి



**వికారాబాద్ జిల్లా బ్యూరో, జనవరి 12 (జనం సాక్షి) :** ఎన్నో అవినీతి అక్రమాలకు నిలయమైన కార్యాలయంలో ప్రభుత్వ ఉద్యోగుల స్థానంలో ప్రైవేట్ వ్యక్తులు పార్ట్ టైం ఉద్యోగులుగా చలామణి అవుతున్నారు. అధికారులు చేయవలసిన పనులన్నీ వారే చక్క పెడుతున్నారు. అందిన కాడికి అర్జీదారులను దోచుకుంటున్నారు. అధికారులతో భాగస్వాములై వాటాలు పంచుకుంటున్నారు. ఇక్కడ పని చేయవలసిన ప్రభుత్వ అధికారులు డిప్యూటేషన్ పై ఇతర చోట పని చేయడంతో వీరు ఆడిందే ఆట పాడింది పాట గా సాగుతుంది. ఏసీబీ అధికారులు దాడులు చేసి మందలించినా.. ఇక్కడ పని చేసిన అధికారులు ఏసీబీ కేసులో జైలుకు వెళ్లిన. ఉన్నత అధికారుల దర్యాప్తుతో సస్పెండ్ గురైన నాకేంటి అంటూ దండుకుంటూ అధికారుల తీరులో మార్పే రాలేదు. రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న జిల్లాలో అధికారులు బాధ్యతయుతంగా పనిచేయకుండా బాధ్యత రహితంగా పనిచేస్తూ విచ్చలవిడిగా అవినీతి అక్రమాలకు పాల్పడుతున్నారు. సీఎం జిల్లాలో ఇదేమి సోద్యం అంటూ అందరూ ముక్కున వేలేసుకుంటున్నారు. వివరాల్లోకి వెళ్ళితే వికారాబాద్ జిల్లా తాండూర్ సబ్ రిజిస్టర్ కార్యాలయంలో ప్రైవేట్ వ్యక్తులదే హవా నడుస్తుంది. ఇక్కడ పనిచేస్తున్న జూనియర్ అసిస్టెంట్ అనిత అండదండలతో ప్రైవేట్ వ్యక్తులు పార్ట్ టైం ఉద్యోగులుగా చలామణి అవుతున్నారు. తాండూర్ సబ్ రిజిస్టర్ కార్యాలయంలో రెగ్యులర్ సబ్ రిజిస్టర్ లేని కారణంగా రోజు ఇతర అధికారులు ఒక రోజు కోసం సబ్ రిజిస్టర్ బాధ్యతలను చేపట్టి సాయంకాలనికి ఇంటికి వెళ్లి పోతారు. మరుసటి రోజు ఏ అధికారి వస్తారో తెలియని పరిస్థితి. ఈ నేపథ్యంలో అక్కడే జూనియర్ అసిస్టెంట్ గా పని చేస్తున్న అనిత బాధ్యతల బాగోగులు చూస్తున్నారు. సబ్ రిజిస్టర్లు కార్యాలయానికి రానప్పుడు సబ్ రిజిస్టర్‌గా ఆమెనే వ్యవహరిస్తున్నారు. దీంతో ప్రైవేట్ వ్యక్తుల సహకారంతో డాక్యుమెంటేషన్ తంతు పూర్తి చేసి అందినంత దండుకుంటున్నారు. స్థానికంగా ఉండే లింగం అనే ప్రైవేట్ వ్యక్తి ద్వారా పనులని చక్కబెట్టి లావాదేవీలు జోరుగా సాగిస్తున్నారు. సబ్ రిజిస్టర్ కార్యాలయంలో ఇద్దరు జూనియర్ అసిస్టెంట్లు ఒక ఔట్సోర్స్ ఉద్యోగి పని చేస్తున్నారు. ముగ్గురి సహాయంతో కార్యాలయంలో పనులు చక్కబెట్టలేక బయట వ్యక్తుల సహాయంతో పని చేయించుకుని వారి ద్వారానే బేరా సారాలు సాగిస్తున్నారు. ఇప్పటివరకు తాండూర్ సబ్ రిజిస్టర్ కార్యాలయం పై రెండుసార్లు ఏసీబీ దాడులు జరిగాయి. లంచం తీసుకుంటూ ఉండగా పట్టుబడి ఇరువురు అధికారులు జైలు పాలయ్యారు. అంతేకాకుండా అంచనాకు మించి రిజిస్ట్రేషన్ ల ప్రక్రియ పూర్తి చేసి అవినీతి అక్రమాలకు పాల్పడిన అధికారులపై ఉన్నతాధికారులు దర్యాప్తు జరిపి శాఖపరమైన చర్యలు తీసుకొని సస్పెండ్ చేశారు. ఇదంతా రెగ్యులర్ గా జరుగుతున్న అక్కడ పనిచేస్తున్న సిబ్బందిలో మార్పు రాలేదు. ప్రైవేట్ వ్యక్తుల సహకారంతో ప్రభుత్వ ఆఫీసులో పనులు చక్కబెట్టి యదేచ్ఛంగా అవినీతికి పాల్పడుతున్నారు. గతంలో ఏసీబీ దాడులు జరిగినప్పుడు ప్రైవేట్ వ్యక్తులు ప్రభుత్వ కార్యాలయంలో పనులు చేయడానికి వచ్చి పట్టుబడ్డారు. వీరిని గుర్తించి ఎసిబి అధికారులు వారిని గట్టిగా మందలించి వదిలివేశారు. ప్రభుత్వ ఆఫీసులో అనాధికారికంగా ప్రైవేట్ వ్యక్తులు పనిచేస్తున్న వారి ఫొటోస్ నోటీస్ బోర్డ్ పై వేయాలని ఏసీబీ అధికారులు ఆదేశించిన ఆచరణలో పెట్టలేదు. ఏసీబీలు అయితే మాకేంటి అన్నట్లు ఏసీబీ అధికారులు మందలించిన వారిని పనిలోకి రప్పించి ప్రభుత్వ ఫైళ్ళ పనులన్నీ చక్కబెట్టిస్తున్నారు. వారి సహకారంతో భయం భక్తి లేకుండా మూడు పువ్వులు ఆరుకాయలుగా అవినీతిని సాగిస్తున్నారు. ఇక్కడ పనిచేస్తున్న సబ్ రిజిస్టర్ పూర్య నాయక్ నాంపల్లిలోని ఐజి ఆఫీసులో పనిచేస్తున్నారు. నెల జీతం మాత్రం తాండూర్ సబ్ రిజిస్టర్ ఆఫీస్ నుంచి పొందుతున్నారు. ఈ అధికారిపై రాజకీయ ఒత్తిడి ఉన్న కారణంగా డిప్యూటేషన్ పై ఆయన అక్కడ పని చేయవలసిన పరిస్థితి నెలకొంది. దీంతో జూనియర్ అసిస్టెంట్ అనిత డాక్యుమెంట్ కు వెయ్యి రూపాయలు రిజిస్ట్రేషన్ మ్యారేజ్ నమోదుకు 500 ఈసీల కోసం 300 చొప్పున బయటి వ్యక్తుల ద్వారా వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అంతేకాకుండా జూనియర్ అసిస్టెంట్ల నుంచి అవుట్ సోర్స్ సిబ్బంది వరకు వసూళ్ల పర్వం సాగుతుంది. అవుట్ సోర్స్ సిబ్బందిగా పనిచేస్తున్న సుభాన్ అనే వ్యక్తి నైట్ డ్యూటీ చేయవలసి ఉండగా పగలు ఆఫీసులో పనికొచ్చి బేరస్సారాలు సాగించి అర్జీదారుల దగ్గర డాక్యుమెంటేషన్ పై వేలిముద్రలు వేయించుకొని 100 చొప్పున వసూలు చేస్తున్నాడు. డాక్యుమెంట్ పై వేలిముద్రలు వేసుకుని అధికారం అటెండర్ కు ఉంటుంది. కానీ ఔట్సోర్స్ సిబ్బందికి ఉండదు. ఇక్కడ అటెండర్ గా పనిచేయాల్సిన వాచ్ మెన్ శ్రీనివాస్ డిప్యూటేషన్ పై శంషాబాద్ సబ్ రిజిస్టర్ కార్యాలయంలో పనిచేస్తున్నారు జీవితం మాత్రం తాండూరు సబ్ రిజిస్టర్ ఆఫీస్ నుంచి పొందుతున్నారు. ఇక్కడ ఔట్సోర్స్ సిబ్బందిగా పనిచేయవలసిన వెంకటేష్ చేవెళ్లలో పనిచేస్తున్నారు. అక్కడ పని చేయవలసిన ఔట్సోర్స్ సిబ్బంది సుభాన్ అటెండర్ గా చలామణి అవుతూ వసూళ్లకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. తాండూర్ సబ్ రిజిస్టర్ కార్యాలయంలో అనధికారికంగా పనిచేస్తున్న వ్యక్తులు తాండూర్ కు చెందిన స్థానికులైనందున వారు ఇష్టారాజ్యంగా వ్యవహరించి వసూళ్లకు పాల్పడి అధికారులకు ఇచ్చే సొమ్ములో బాటలు పంచుకుంటున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. నిబంధనల ప్రకారం సబ్ రిజిస్టర్ కార్యాలయంలో పనిచేసే ముఖ్య అధికారులు తన దగ్గర ఉన్న క్యాష్ ప్రభుత్వ రిజిస్టర్లు నమోదు చేయవలసి ఉంటుంది. అది నిబంధనల ప్రకారం నమోదు చేసి కార్యాలయం వేళలు పూర్తయిన తర్వాత ప్రైవేట్ వ్యక్తుల ద్వారా వసూలు చేసిన సొమ్మును తీసుకొని ఇంటికి వెళుతున్నట్లు విశ్వనీయ సమాచారం ద్వారా తెలిసింది. ఇంత దర్జాగా వ్యవహారం జరుగుతున్న ఉన్నత అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారు. తరచు ఏసీబీ అధికారులు దాడులు చేస్తున్న స్థానికులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసిన అధికారుల్లో భయం లేదు. వారిపై చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. ఇప్పటికైనా ప్రభుత్వా సబ్ రిజిస్టర్ కార్యాలయంలో పనిచేసే బయటి వ్యక్తులను నియంత్రించి స్థానికంగా ఉన్న అవుట్ స్టోర్స్ సిబ్బందిని బదిలీ చేసి అవినీతి జరగకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు. ఈ దిశగా అధికారులు అడుగులు వేస్తారని ఆశిద్దాం..

## కేటీఆర్‌కు ఘన స్వాగతం



**షాద్‌నగర్, జనవరి 12 (జనంసాక్షి) :** రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ బైపాస్ రోడ్డులో మహబూబ్ నగర్ వెళ్తున్న బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కు మాజీ ఎమ్మెల్యే వై. అంజయ్య యాదవ్ వై.రవియాదవ్ వై.మురళియాదవ్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆరు మండలాల నుండి పట్టణం నుండి కార్యకర్తలు కేటీఆర్ కు ఘన స్వాగతం పలికారు ఆ ప్రాంతమంతా జనసంద్రోహంతో మారిపోవడంతో కాన్వాయ్ నుండే కేటీఆర్ అంజన్న ఎక్కడ అంటూ దగ్గరికి తీసుకున్నారు ఇంతలోనే కార్యకర్తలు పెద్ద ఎత్తున సీఎం సీఎం అంటూ నినాదాలు చేశారు ఈ సందర్భంగా కేశంపేట మాజీ ఎంపీపీ బిఆర్ఎస్ సీనియర్ నాయకులు వై.రవీందర్ యాదవ్ మాట్లాడుతూ కేవలం ఒక్క చిన్న పాటి మెసేజ్ తోనే కేటీఆర్ కు స్వాగతం పలికేందుకు కార్యకర్తలు ఇంత పెద్ద ఎత్తున వస్తున్నారంటే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన గ్యారెంటీలను ఎంత మేరకు మోసం చేస్తుందో అర్థమవుతుందన్నారు ఇది బహిరంగ సభ కాదన్నారు కేవలం కేటీఆర్ గారికి స్వాగతం పలికేందుకే ఒక్క మెసేజ్ ద్వారా ఇంత పెద్ద ఎత్తున జనసందోహంతో నిండిపోయిందన్నారు భవిష్యత్తులో బిఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి రావడం ఖాయమన్నారు.

# మున్సిపల్ ఎన్నికలను పారదర్శకంగా ప్రశాంతంగా నిర్వహించాలి



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, జనవరి 12 (జనంసాక్షి) :** మున్సిపల్ ఎన్నికలు,యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలల నిర్మాణంపై సోమవారం రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ఇతర ఉన్నతాధికారులు రాష్ట్ర వ్యాప్తంగా జిల్లాల కలెక్టర్లు, సంబంధిత శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు ఈ సందర్భంగా ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ మున్సిపల్ ఎన్నికల ఎలక్ట్రోరల్ వార్డుల వారీగా ఫైనల్ పబ్లికేషన్ ప్రకటించిన నేపథ్యంలో మిగిలిన ప్రక్రియ నిర్దేశిత సమయంలోగా పూర్తి చేయాలన్నారు. ఎన్నికలను పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ఆయా జిల్లాల ఎన్నికల యంత్రాంగం సమిష్టిగా పని చేయాలని ఆదేశించారు యంగ్ ఇండియా సమీకృత రెసిడెన్షియల్ పాఠశాలలను ప్రస్తుతం 79 నియోజకవర్గాల్లో ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తోందని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాల విద్యార్థులకు ఒకే చోట నాణ్యమైన విద్యను అందించాలనే సంకల్పంతో ఈ పాఠశాలలను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. విద్యార్థులకు చదువుతోపాటు వ్యక్తిత్వ వికాస నిర్మాణం, పోటీ పరీక్షలకు సన్నద్ధం చేసేలా, సైన్స్ ఫెయిర్స్ లో ప్రతిభ చాటేలా, క్రీడా, తదితర రంగాల్లో శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. వచ్చే విద్యా సంవత్సరంలోనే ఈ పాఠశాలలను ప్రారంభించేలా భవనాల నిర్మాణం వేగవంతం చేయాలన్నారు. ఆయా జిల్లాల కలెక్టర్లు ఈ పాఠశాలల నిర్మాణంపై ఎప్పటికప్పుడు మానిటరింగ్ చేస్తూ నిర్ణీత సమయంలోగా పూర్తి అయ్యేలా సంబంధిత శాఖల అధికారులకు దిశా నిర్దేశం చేస్తూ ఉండాలన్నారు వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి మాట్లాడుతూ రంగారెడ్డి జిల్లాకు 6 యంగ్ ఇండియా సమీకృత రెసిడెన్షియల్ పాఠశాలలు మంజూరు అయ్యాయని, అందులో మూడు పాఠశాలల నిర్మాణం చేపట్టడం జరిగినదని, ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో యంగ్ ఇండియా సమీకృత రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణానికి ఇప్పటికే టెండర్ పూర్తయిందని వివరించారు. మున్సిపల్ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించేందుకు వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించామన్నారు. జిల్లాలోని ఆరు మున్సిపాలిటీలలో వార్డుల వారీగా ఫైనల్ ఎలక్ట్రోరల్ జాబితా పబ్లికేషన్ పూర్తిచేసి, ఎన్నికల ప్రక్రియకు అవసరమైన ఏర్పాట్లన్నీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) కె.శ్రీనివాస్, డిపిఓ సురేష్ మోహన్, పిడి మెప్మా వెంకట సత్యనారాయణ, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## నక్షబాటను కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి



**మహేశ్వరం, జనవరి 12 (జనం సాక్షి) :** మహేశ్వరం మండలం అమీర్ పేట్ గ్రామంలో సర్వే నంబర్ 141,142,144,110,111 లలో ముస్లిం కబరస్తాన్ భూమి, చెరువు భూమి నక్ష బాటను కొంతమంది వ్యక్తులు కబ్జా చేస్తున్నరాన్ని మహేశ్వరం ముస్లిం వెల్ఫేర్ సొసైటీ మండల అధ్యక్షుడు షేక్ హాజీ బాబా,ముస్లిం వెల్ఫేర్ సొసైటీ సభ్యులు సోమవారం జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు.అమీర్ పేట్ గ్రామంలో చెరువుకు,రైతులు పొలాలకు వెళ్లే నక్ష బాట కబ్జాకు గురవుతుందన్నారు.కొంతమంది వ్యక్తులు ముస్లిం కబరస్తాన్ భూమిని కబ్జా చేస్తున్నారన్నారు.ఈ కార్యక్రమంలో ఇర్షద్,బస్వ యాదయ్య గౌడ్,ఆవుల యాదయ్య,మహమ్మద్ మిస్కిన్,సలావుద్దీన్,మహ్మద్ అలీ, హాబీబుద్దీన్,నురుద్దీన్, ఆరిఫ్,మురళి,జంగయ్య, యాదయ్య, కృష్ణయ్య ,అంజయ్య ,జగన్,రాఘవేందర్, అమీర్ పేట్ గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## టీజీవోస్ 2026 క్యాలెండర్‌ను ఆవిష్కరించిన కలెక్టర్



**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, జనవరి 12 (జనం సాక్షి) :** టీజీవోస్ అసోసియేషన్ మేడ్చల్–మల్కాజ్‌గిరి జిల్లా నాయకులు గురువారం జిల్లా కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా అసోసియేషన్ వీవీ డిస్ట్రిక్ట్ ఆధ్వర్యంలో రూపొందించిన 2026 గోడ క్యాలెండర్తో పాటు టేబుల్ క్యాలెండర్‌ను జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో టీజీఓస్ అసోసియేషన్ మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా అధ్యక్షులు జి. వినోద్ కుమార్, కార్యదర్శి ఎ. కురుమూర్తి, ఉపాధ్యక్షులు డి. రవీందర్, సభ్యులు విజయ కుమారి, సాంబశివరావు, కిషన్, ఝాన్సీ, రఘునందన్ గౌడ్, జాయింట్ సెక్రటరీ ఆర్ఎంఅబశ్రీశ్రీవీ. ఆనంద్ రావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ చె. రమేష్, ప్రచార కార్యదర్శి ఇ. సత్యనారాయణ, శంకరయ్య, డాలీతో పాటు ఇతర సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ టీజీఓస్ అసోసియేషన్ సభ్యులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఉద్యోగుల సంక్షేమం కోసం సంఘం చేపడుతున్న కార్యక్రమాలను అభినందించారు. ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాల అమలులో ఉద్యోగులు కీలక పాత్ర పోషిస్తూ ప్రజలకు నాణ్యమైన సేవలు అందించాలని సూచించారు.

## రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన వినతులపై త్వరితగతిన చర్యలు



**మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ప్రతినిధి, జనవరి 12 (జనం సాక్షి) :** భూభారతి కార్యక్రమం, రెవెన్యూ సదస్సుల్లో స్వీకరించిన దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచకుండా త్వరితగతిన పరిశీలించి దరఖాస్తుదారుల సమస్యలను పరిష్కరించాలని మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి అధికారులను ఆదేశించారు.సోమవారం దుండిగల్ తహాసీల్దార్ కార్యాలయాన్ని అదనపు కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా భూభారతి, రెవెన్యూ సదస్సులలో స్వీకరించిన దరఖాస్తుల పురోగతిని ఆయన సమీక్షించారు. ఇంకా పెండింగ్‌లో ఉన్న వినతులను వెంటనే పరిశీలించి, నిబంధనల ప్రకారం పరిష్కారం చూపాలని దుండిగల్ తహాసీల్దార్ రాజేశ్వర్ రెడ్డికి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.ప్రజలు తమ భూ సమస్యల పరిష్కారంపై ప్రభుత్వంపై నమ్మకంతో కార్యాలయాలకు వస్తారని, ఆ నమ్మకాన్ని నిలబెట్టేలా అధికారులు బాధ్యతగా పనిచేయాలని అదనపు కలెక్టర్ సూచించారు. దరఖాస్తుల పరిశీలనలో నిర్లక్ష్యం వహించరాదని, ప్రతి దరఖాస్తుపై సమయానుకూలంగా నిర్ణయం తీసుకోవాలని తెలిపారు. అనంతరం తహాసీల్దార్ కార్యాలయంలో సాధారణ తనిఖీ నిర్వహించిన అదనపు కలెక్టర్, రికార్డుల నిర్వహణ, కార్యాలయ పనితీరును పరిశీలించారు. ప్రజలకు అనవసర ఇబ్బందులు కలగకుండా పారదర్శకంగా, వేగంగా సేవలు అందించాలని అధికారులకు సూచించారు.

## అంతర్జాతీయ రెగట్టాలో హైదరాబాద్ సెయిలర్ల రికార్డు



**ఖైరతాబాద్, జనవరి 12 (జనం సాక్షి) :** చెన్నై వేదికగా జరిగిన అంతర్జాతీయ సెయిలింగ్ రెగట్టా లో హైదరాబాద్‌కు చెందిన యువ సెయిలర్లు అద్భుత విజయాలను నమోదు చేశారని 'ది యా చ్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ణ కోచ్ కోచ్ సుహీమ్ షేక్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ 7 దేశాల నుంచి 48 మంది అగ్రశ్రేణి సెయిలర్లు పాల్గొన్న ఈ పోటీలో నగర క్రీడాకారులు ఒక స్వర్ణం, రెండు రజతాలు, ఒక కాంస్య పతకాన్ని సాధించి అంతర్జాతీయ స్థాయిలో భారత్ గర్వపడే లా చేశారని తెలిపారు. ఒకే అంతర్జాతీయ పోటీలో హైదరాబాద్‌కు 4 పతకాలు రావడం ఇదే తొలిసారి అన్నారు. ఈ పోటీలో సికింద్రాబాద్ కు చెందిన 14 ఏళ్ల రవి కుమార్ బొన్నెలు స్వీడన్, ఐర్లాండ్, మలే షియా వంటి దేశాల సెయిలర్లతో పోటీపడుతూ చివరి రేసులో అండర్-15 బాలుర విభాగంలో కాం స్య పతకం కైవసం చేసుకున్నాడని తెలిపారు. రసూల్‌పురాకు చెందిన నిర్మాణ కార్మికుని కుమారు డైన మణిదీప్ పేర్కట్ల అండర్-18 బాలుర విభాగం లో స్వర్ణ పతకం సాధించినట్లు చెప్పారు. బాలికల విభాగంలో సికింద్రాబాద్ క్లబ్‌కు చెందిన సెయిలర్ శృంగారి రాయ్ ఐర్లాండ్ క్రీడాకారిణితో పోటీపడి రజత పతకం గెలుచుకున్నట్లు తెలిపారు. స్కిఫ్ క్లాస్ విభాగంలో యాచ్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్‌కు చెందిన గోవర్ధన్ పల్లారా రజత పతకం సాధించగా ఈ నలుగురు విజేతలు ఏప్రిల్‌లో చైనాలోని సాన్యాలో జరగబోయే ఆసియా బీచ్ గేమ్స్‌లో భారత్ తరపున పాల్గొననున్నట్లు తెలిపారు.

# రిజిస్ట్రేషన్ శాఖలో విప్లవాత్మక సంస్కరణలు

- అక్రమాలపై ఉక్కుపాదం
- పేదల భూముల పరిరక్షణకు కట్టుబాటు
- ప్రభుత్వంపై భారం లేకుండా సమీకృత సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలు
- రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం



**మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ప్రతినిధి, జనవరి 12 (జనం సాక్షి) :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా స్టాంపులు--రిజిస్ట్రేషఅబశ్రీశ్రీన్ శాఖను పూర్తిగా పారదర్శకంగా, అవినీతి రహితంగా మార్చే దిశగా రాష్ట్ర ప్రభుత్వం కీలక సంస్కరణలను అమలు చేస్తోందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార--పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. అక్రమాలకు పాల్పడే వారి భరతం పడతామని, ప్రభుత్వ, పేదల భూముల పరిరక్షణకు ఉక్కుపాదంతో చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కూకట్‌పల్లి మండలంలో ఎస్.ఎస్.ఆర్ బిల్డర్స్ నిర్మిస్తున్న సమీకృత సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి సోమవారం మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా అత్యాధునిక సౌకర్యాలతో కార్పొరేట్ స్థాయి ప్రమాణాల్లో సమీకృత సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలను దశల వారీగా నిర్మిస్తున్నట్లు తెలిపారు. మొదటి విడతలో ఔటర్ రింగ్ రోడ్ పరిధిలో, రెండో విడతలో జిల్లా కేంద్రాల్లో, మూడో విడతలో నియోజకవర్గ కేంద్రాల్లో ఈ భవనాలను నిర్మిస్తామని చెప్పారు. మొదటి దశలో హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, సంగారెడ్డి జిల్లాల్లోని 39 సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలను 12 క్లస్టర్లుగా విభజించి నిర్మాణాలు చేపడుతున్నట్లు వెల్లడించారు. ఇప్పటికే గచ్చిబౌలిలో తెలంగాణ అకాడమీ ఆఫ్ ల్యాండ్ ఇన్ఫర్మేషన్ అండ్ మేనేజ్‌మెంట్ భవనంలో సమీకృత కార్యాలయానికి ముఖ్యమంత్రి చేతుల మీదుగా శంకుస్థాపన జరిగిందని, జూన్ నాటికి భవనం ప్రారంభమవుతుందని తెలిపారు. ప్రభుత్వంపై ఆర్థిక భారం లేకుండా బిల్డర్ల ద్వారానే ఈ సమీకృత భవనాలు నిర్మిస్తున్నామని, నిర్మాణ సంస్థలే కనీసం ఐదేళ్ల పాటు నిర్వహణ బాధ్యతలు కూడా వహించాల్సి ఉంటుందని మంత్రి వివరించారు. పెళ్లి రిజిస్ట్రేషన్‌కు వచ్చే జంటలు, చిన్నపిల్లలతో వచ్చే తల్లులు, పేదలకు అన్ని సౌకర్యాలు కల్పించేలా భవనాలు రూపొందిస్తున్నామని చెప్పారు. ప్రభుత్వం రిజిస్ట్రేషన్ శాఖను ఆదాయ వనరుగా కాకుండా సేవా కేంద్రంగా చూస్తోందని స్పష్టం చేశారు. గతంలో పేదలకు కేటాయించిన భూములు, అసైన్డ్ భూములను పరిరక్షిస్తామని, అక్రమాలకు తావు లేకుండా చర్యలు తీసుకుంటామని మంత్రి పేర్కొన్నారు. అవసరమైతే భూములు తీసుకునే సందర్భంలో తగిన పరిహారం, ప్రత్యామ్నాయ స్థలాలు తప్పనిసరిగా కల్పిస్తామని హామీ ఇచ్చారు. త్వరలో జరగనున్న మేడారం జాతర కోసం భారీ అభివృద్ధి పనులు చేపట్టామని, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యుడు ఈటల రాజేందర్, కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, శాసనమండలి చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి, ఎమ్మెల్సీ నవీన్ రావు, జిహెచ్ఎంసీ డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డి, స్టాంపులు-రిజిస్ట్రేషన్ ఐజీ రాజీవ్ గాంధీ హనుమంత్, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి, జిల్లా మార్కెటింగ్ ఛైర్మన్ నర్సింహులు యాదవ్, జిల్లా గ్రంథలయ ఛైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, ఆర్టీఏ కమిటీ సభ్యుడు జైపాల్ రెడ్డి, డీఎస్ఆర్ నిర్మాణ సంస్థ అధినేత సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# నియోజకవర్గ ప్రజలకు 100శాతం వైద్యం ప్రభుత్వ ఆసుపత్రులలోనే అందించాలి

- పారిశుధ్య కార్మికుల ముగ్గుల పోటి విజేతలకు, నగదు బహుమతులు అందజేత
- నాగర్‌కర్నూల్ శాసనసభ్యులు కూచుకుళ్ళ రాజేష్ రెడ్డి



**నాగర్‌కర్నూల్, జనవరి 12 (జనంసాక్షి) :** నాగర్‌కర్నూలు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ సాధారణ ఆసుపత్రిలో సోమవారం నాడు నాగర్ కర్నూల్ శాసనసభ్యులు డాక్టర్ కూచుకుళ్ళ రాజేష్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై పారిశుద్ధ్య కార్మికులకు నిర్వహించిన ముగ్గుల పోటీ విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా పలు వార్డులలో పారిశుద్ధ్య సేవలను పరిశీలించారు. ప్రభుత్వ సాధారణ ఆసుపత్రిలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు నిర్వహించిన ముగ్గుల పోటీ కార్యక్రమాన్ని ప్రత్యేకంగా పరిశీలించారు. ఆస్పత్రి ఆవరణ చుట్టు శుభ్రత ఉంచుతూ నియోజకవర్గ ప్రజలకు ఈ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు వైద్యంతో పాటు పారిశుధ్యం 100శాతం శుభ్రత ఉండే విధంగా చూడాల్సిన బాధ్యత కార్మికులపై ఉందని ఆయన సూచించారు. ఈ నియోజకవర్గంలోని ప్రతి ఒక్కరికి వైద్య ఆరోగ్య సేవలు ప్రభుత్వ ఆసుపత్రులలోనే అందించే విధంగా చర్యలు తీసుకోవాలని వైద్యులను కోరారు. ప్రభుత్వ ఆసుపత్రుల నెట్ వర్క్ సేవలను వైద్యులు మెరుగ్గా ఉపయోగించుకొని ఈ ప్రాంత ప్రజలకు ఆరోగ్య సేవలు అధిక మొత్తంలో అందించాలని సూచించారు. ఒకవైపు ఆరోగ్యం మరొకవైపు పారిశుధ్యం, శుభ్రత పాటింపులో నిర్లక్ష్యం వహించరాదని సూచించారు. త్వరలో మెడికల్ కళాశాల వద్ద 550 పడకల ఆసుపత్రి పనులు ప్రారంభం చేస్తామని అన్నారు. డిప్యూటీ మెడికల్ సూపరింటెంట్ డాక్టర్ వి.శేఖర్ పారిశుద్ధ్య కార్మికులకు నిర్వహించిన ముగ్గుల పోటీలలో విజేతలకు ప్రథమ స్థాయిలో నిలిచిన వారికి 8వేల నగదు,ద్వితీయ స్థానంలో నిలిచిన వారికి 6వేల నగదు మూడో స్థానంలో నిలిచిన వారికి 4వేల స్థానంలో నిలిచిన వారికి 2వేల నగదు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ రమణారావు, మాజీ కౌన్సిలర్లు కొత్త శ్రీనివాసులు, జక్కరాజ్ కుమార్, డిప్యూటీ మెడికల్ సూపర్డెంట్ డాక్టర్ వి.శేఖర్, రేసిడెంట్ మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ రవిశంకర్, డాక్టర్ హనుమంతరావు, డాక్టర్ రోహిత్, డాక్టర్ అజీమ్, డాక్టర్ సూర్యనారాయణ, డాక్టర్ కోటేశ్వర్, నర్సింగ్ సూపర్డెంట్ మంజుల, హెడ్ నర్సులు పద్మ, నర్సింగ్ అధికారి ఎం.ఆనంద్, రూపా, రాణి, జానకి దేవి, జ్ఞానేశ్వరి, హెల్ప్ డెస్క్ ఇంచార్జ్ యాదగిరి, ఆసుపత్రి వైద్యులు, సానిటరీ పర్యవేక్షకులు, ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కేటీఆర్ కు ఘనస్వగతం పలికిన బీఆర్ఎస్ శ్రేణులు



**రాజాపూర్, జనవరి 12 (జనంసాక్షి) :** మహబూబ్ నగర్ జిల్లాలో నూతనంగా ఎన్నికైన బీఆర్ఎస్ పార్టీ సర్పంచ్ ల, సన్మానకార్యక్రమనికి విచ్చేసిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కు రాజాపూర్ మండల బీఆర్ఎస్ శ్రేణులు ఘనంగా స్వాగతం పలికారు. మండల కేంద్రంలో గల అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివవాలు అర్పించారు. అనంతరం బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ను మాజీ మంత్రి లక్ష్మారెడ్డి , బిఆర్ఎస్ పార్టీ యువనేత చించోడ్ అభిమన్యు రెడ్డి, మరియు బిఆర్ఎస్ పార్టీ మండల నాయకులు, కార్యకర్తలు, యువకులు శాలువలతో సన్మానించి స్వాగతం పలికారు.

## జీవాల ఆరోగ్యమే లక్ష్యం

- పశు వైద్యాధికారి జే. సంధ్యారాణి



**శివ్వంపేట, జనవరి 12 (జనంసాక్షి) :** జీవాల యొక్క ఆరోగ్యమే పశుసంవర్ధక శాఖ లక్ష్యమని మండల పశువైద్యాధికారి డాక్టర్ జె. సంధ్యారాణి పేర్కొన్నారు. శివ్వంపేట మండలం తిమ్మాపూర్ గ్రామంలో పశువైద్య,పశు సంవర్ధక శాఖ, పశు గానాభివృద్ధి సంస్థల ఆధ్వర్యంలో సోమవారం ఉచిత గర్భకోశ వ్యాధుల వైద్య చికిత్స శిభిరాన్ని నిర్వహించారు. ఈ పశు మెడికల్ క్యాంపు లో 60 గేదేలకు, 20 దూడలు, 70 గొర్రెలకు చికిత్స చేయడం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ సంధ్యారాణి మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న పశు సేవా కార్యక్రమాలను రైతులు, లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె పేర్కొన్నారు. అంతకుముందు రైతులకు ఉచితంగా పశువుల యొక్క మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తిమ్మాపూర్ సర్పంచ్ గుణంగారి రాజు, పంచాయతీ సభ్యులు, గోపాల మిత్ర సూపర్ వైజర్ సత్యనారాయణ, గోపాల మిత్ర గణేష్, శ్రీనివాస్ లతో లబ్దిదారులు, రైతులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

# చేర్యాల రెవెన్యూ డివిజన్ ఏజెండాతోనే ఎన్నికల బరిలోకి రావాలి

- చేర్యాల డివిజన్ జేఏసీ చైర్మన్ డా.పరమేశ్వర్



**చేర్యాల, జనవరి 12 (జనంసాక్షి) :** చేర్యాలను రెవెన్యూ డివిజన్ కేంద్రంగా ప్రకటించాలని కోరుతూ సోమవారం చేర్యాల పట్టణానికి వచ్చిన భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి లకు చేర్యాల రెవెన్యూ డివిజన్ జేఏసీ నాయకులు వినతిపత్రం అందజేసి చేర్యాల ప్రాంత అస్తిత్వం,ఉనికి, ఆత్మగౌరవం ఈ ప్రాంత ఔనత్యం చేర్యాల రెవెన్యూ డివిజన్ ఏర్పాటు పైనే ఉన్నదని జేఏసీ చైర్మన్ డాక్టర్ రామగల్ల పరమేశ్వర్ వివరించారు. దీనిపై ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి సానుకూలంగా స్పందించి ఈ ప్రాంత ప్రజల చిరకాల కోరికను ఆకాంక్షను నెరవేర్చే బాధ్యత తాను తీసుకొని సీఎం రేవంత్ రెడ్డి రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి రెవెన్యూ డివిజన్ ఏర్పాటుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే పల్లా స్పందించి అవకాశం వచ్చిన ప్రతీ సందర్భంలోనూ అసెంబ్లీ సమావేశాల్లో లెవనెత్తుతూ ప్రభుత్వం దృష్టికి తీవ్రంగా తీసుకెళు న్నానని, ఎంపీ సహకారంతో రెవెన్యూ డివిజన్ సాధించి తీరుతామని హామీ ఇచ్చారు. వారి వెంట మాజీ జడ్పీటీసీ లు గిరి కొండల్ రెడ్డి, కొమ్ము నర్సింగ రావు, ఆకునూరు సర్పంచ్ కొమ్ము రవి, జేఏసీ నాయకులు అందే అశోక్, అందే బీరయ్య, బుట్టి సత్యనారాయణ, జంగిలి యాదగిరి, వలబోజు నర్సింహా చారి, చంద శ్రీకాంత్, నంగి కనకయ్య, సుంకోజు రజిత, గోమారపు నర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.

## ప్రణామ్ వయోవృద్ధుల డేకేర్ సెంటర్ ప్రారంభోత్సవం



**నారాయణపేట, జనవరి 12 (జనం సాక్షి) :** ప్రణామ్ వయోవృద్ధుల డే కేర్ సెంటర్ ను ప్రభుత్వ ఆదేశాల మేరకు సోమవారం ఆర్డిఓ రాంచందర్ ప్రారంబించా రు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత కాలం లో వయో వయోవృద్ధులు ఒంటరి తనంతో బాధపడు తున్నారని,మానసికంగా ఎన్నో ఇబ్బందులను ఎదు ర్కొంటున్నారని అన్నారు.అలాంటి వారికి కాలక్షేపం కొరకు డే కేర్ సెంటర్ నిర్వ హించడం హర్షించదగ్గ విష యమని తెలిపారు. క్షేత్ర స్థాయి అధికారి సాయి మాట్లాడుతూ డే కేర్ సెంటర్ ప్రతి రోజు ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు నడుస్తుందని, సీని యర్ సిటిజన్స్ కొరకు డే కేర్ సెంటర్ నందు టీవీ, ఇండోర్ గేమ్స్, లైబ్రెరీ, విశ్రాంతి తీసు కొనుటకు సౌకర్యాలు కల్పిం చామని, స్నాక్స్, పండ్లు అందించబడునని తెలిపారు.వయో వృద్దులు ఈ సదు పాయాన్ని వినియోగించుకోవాలని కోరారు. ప్రణామ్ వయో వృద్ధుల డే కేర్ సెంటర్ గుడ్ యూనివర్స్ స్వచ్ఛంద సంస్థ, జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సంయుక్తంగా నడపబడుతుందని తెలి పారు.ఈ కార్యక్రమంలో గుడ్ యూనివర్స్ స్వచ్ఛంద సంస్థ సభ్యులు అనుష్క, సిడిపిఓ పార్వతి , ఎఫ్ఆర్ఓ సాయి, ఉమెన్ హబ్ కోఆర్డినేటర్ నరసింహులు , జిల్లా సంక్షేమ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ చాటాలి

- అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ



**గద్వాల నడిగడ్డ, జనవ 12 (జనం సాక్షి) :** ఔత్సాహిక క్రీడాకారులకు సీఎం కప్ గొప్ప అవకాశమని,జిల్లా క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ చాటాలని రెవిన్యూ అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ అన్నారు.జిల్లా యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో సోమవారం గద్వాల ఇండోర్ మైదానంలో సీఎం కప్ క్రీడా పోటీల టార్చ్ ర్యాలీ ప్రారంభోత్సవ కార్యక్రమానికి అదనపు ఎస్పి శంకర్,స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ నర్సింగరావు తో కలిసి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. స్వామి వివేకానంద జయంతి సందర్భంగా జాతీయ యువజన దినోత్సవాన్ని పురస్కరించుకొని ముందుగా ఆయన చిత్రపటానికి ముఖ్య అతిథులు పూలమాల వేసి పూజలు చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ సీఎం కప్ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా టార్చ్ ర్యాలీ నిర్వహించడం జరుగుతుందన్నారు. చీకట్లో ఏదైనా వస్తువును వెతికేందుకు టార్చ్ లైట్లు ఎలా వినియోగిస్తామో అలాగే ప్రతిభగల క్రీడాకారులను వెలికి తీసేందుకు ఈ టార్చ్ ర్యాలీ దోహదపడుతుందన్నారు. యువతకు తన సందేశాలతో జాగృతం చేసిన స్వామి వివేకానంద జయంతి రోజునే ఈ సీఎం కప్ కార్యక్రమం ప్రారంభించుకోవడం శుభసూచకమని పేర్కొన్నారు.స్వామీజీ భారతదేశ ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటిచెప్పిన మహనీయుడని ప్రశంసించారు. ఆయన స్ఫూర్తితో యువత క్రీడల్లో రాణించి దేశానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. సమాజంలో వ్యసనాలను రూపుమాపి, నవ సమాజ నిర్మాణానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. అదనపు కలెక్టర్ నర్సింగరావు మాట్లాడుతూ క్రీడలకు వయసుతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో కొంత సమయాన్ని ఆటలు ఆడేందుకు కేటాయిస్తే ఆనందంగా ఉండవచ్చన్నారు. ప్రస్తుతం తల్లిదండ్రుల వైఖరిలోనూ మార్పు వచ్చిందని పిల్లలను చదువుతోపాటు క్రీడల్లోనూ చాలామంది ప్రోత్సహిస్తున్నట్లు చెప్పారు. ప్రతిభ గల క్రీడాకారులను వెలికి తీసేందుకు సీఎం కప్ దోహదపడుతుందని పేర్కొన్నారు. క్రీడాకారులు జిల్లా స్థాయిలోనే కాక రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ చాటి జోగులాంబ గద్వాల ఖ్యాతిని ఇనుమడింపజేయాలని ఆకాంక్షించారు. ఉక్కు కండరాలు, దృఢమైన శరీరం కలిగిన యువత దేశాభివృద్ధికి అవసరమని పేర్కొన్న స్వామి వివేకానంద సూక్తులను ప్రతి ఒక్కరూ పాటించాలన్నారు. అదనపు ఎస్పీ శంకర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ శారీరకంగా దృఢంగా ఉండడమే కాక మానసికంగానూ ఉల్లాసంగా ఉండేందుకు క్రీడలు ఉపయోగపడతాయన్నారు.ఈ సందర్భంగా ముఖ్య అతిథులు క్రీడాకారులకు సీఎం కప్ టీ షర్టులను అందజేశారు. అనంతరం టార్చ్ ను వెలిగించి ర్యాలీ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డిఈఓ విజయలక్ష్మి, గద్వాల మున్సిపల్ కమిషనర్ జానకి రామ్ సాగర్, డివైఎస్ఓ కృష్ణయ్య, ఎస్ జిఎఫ్ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, వ్యాయామ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు,కార్యదర్శి బీసన్న,పలువురు పిఈటిలు,పీడీలు, విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయులు, వివిధ క్రీడా సంఘాల ప్రతినిధులు, క్రీడాకారులు,తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణికి 72 ఫిర్యాదులు



**గద్వాల నడిగడ్డ, జనవరి 12 (జనం సాక్షి) :** ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ అధికారులకు ఆదేశించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 72 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను జిల్లా అదనపు కలెక్టర్లకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా, ఇట్టి ఫిర్యాదులను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను సత్వరమే పరిష్కరించాలని అయన అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నర్సింగరావు, భూసేకరణ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శ్రీనివాసరావు లతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# చెలిమెలకుంట కబ్జాకు గురైందని గ్రామస్తుల వినతి



**హత్నూర, జనవరి 12 (జనం సాక్షి) :** భూ ఆక్రమణ దారులకు అడ్డూ అదుపూ లేకుండా పోతుంది. చట్టాన్ని చుట్టంగా మార్చుకుంటున్నారు. అధికారుల కళ్ళుగప్పి తాము ఇష్టానుసారంగా కబ్జాలకు పాల్పడుతున్నారు. కబ్జా చేసేందుకు ఏది అనర్హం కాదన్నట్లు కుంట కట్టలు,శిఖం భూములను కొల్లగొడుతున్నారు. రాత్రికి రాత్రే జెసిబి లతో తవ్వి సదరు భూమి రూపు రేఖలను మార్చేస్తున్నారు. తాజాగా సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం దౌల్తాబాద్ గ్రామ సమీపంలోని చెలిమెల కుంట శిఖం భూమి కబ్జాకు గురైందని ఆరోపిస్తూ గ్రామస్తులు సోమవారం మండల డిప్యూటీ తహశీల్దార్ కరుణాకర్ రావుకు ఫిర్యాదు చేశారు.కుంట శిఖానికి ఆనుకుని ఉన్న ఓ భూ యజమాని ఆక్రమణకు దిగాడని,జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా శిఖం మీదుగా వేసిన రోడ్డున ధ్వంసం చేశాడని వారు ఆరోపించారు.కుంట కట్టను చీల్చి దాని గుండా రోడ్డును సృష్టించమే గాకుండా,శిఖానికి ఆనుకుని ఉన్న భూమిలో ఎన్నో యేళ్ళ క్రితం నుండి ఇప్పటివరకు ఉన్న సమాధులను కూల్చివేశాడని వారు ఫిర్యాదులో పేర్కొన్నారు.ధ్వంసమైన రోడ్డును,చీల్చబడిన కుంట కట్టను యధావిధిగా పునర్నిర్మించాలని వారు అధికారులను కోరారు.భూ ఆక్రమణ దారుడిపై చట్టరిత్యా తగు చర్యలు తీసుకుని కఠినంగా శిక్షించాలని వారు డిమాండ్ చేశారు.

# వివేకానందుని ఆశయాలు యువతకు స్ఫూర్తిదాయకం



**వనపర్తి బ్యూరో, జనవరి 12 (జనంసాక్షి) :** వివేకానందుని ఆశయాలు యువతకు స్ఫూర్తిదాయకమని,మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి అన్నారు. సోమవారం మాజీ మంత్రివర్యులు సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి, వివేకానందుని జయంతి సందర్భంగా వారి విగ్రహానికి పూలమాలలు సమర్పించి నివాళు లు అర్పించారు.ఈ సందర్భంగా మాజీ మంత్రి సింగిరెడ్డి ,నిరంజన్ రెడ్డి, మాట్లాడుతూ పిన్న వయస్సులో తన సందేశాల ద్వారా స్ఫూర్తి నింపిన మహనీయుడు వివేకానందుడు అని అన్నారు.భారత దేశంలో సంస్కృతి, సాంప్రదాయాలను యువత అనుసరించాల్సిన మార్గాలను ఉపదేశించి చైతన్యం చేశారని పిన్న వయసులో మరణించిన వారి చరిత్ర సూర్యచంద్రులు ఉన్నంతవరకు నిలుస్తుందని కొనియాడారు.యువత వివేకానందుని ఆశయాలు కొనసాగించాలని పిలుపునిచ్చారు. నిరంజన్ రెడ్డి వెంట గట్టు యాదవ్, వాకిటి శ్రీధర్, పలుస.రమేష్ గౌడ్,నందిమల్ల.అశోక్,పలుస.శంకర్ గౌడ్,కే మాణిక్యం,నాగన్న యాదవ్,ప్రేమ్ నాథ్ రెడ్డి, దేగ మహేష్ రెడ్డి,చిట్యాల.రాము, నందిమల్ల.సుబ్బు, గిరి, శిరీవాటి.శంకర్,తదితరులు ఉన్నారు.

### కుల వృత్తులు సమాజ మనుగడకు జీవనాడులు

కులవృత్తులు సమాజ మనుగడకు జీవనాడులుగా వర్ధిల్లాయని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి అన్నారు. వనపర్తి పట్టణంలో ఏర్పాటు చేసిన "మెట్న"పుస్తకావిష్కరణ సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాజీమంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ కుల వృత్తులు మానవ మనుగడకు జీవనాడులు ఉంటూ సమాజ అభ్యున్నతికి ప్రాణం పోశాయనీ అన్నారు. సగర(ఉప్పరి) కులస్తుల జీవితాల్ని వస్తువుగా తీసుకుని కవి ఉప్పరి తిరుమలేశ్ శ్రామిక సౌందర్యాన్ని తన దీర్ఘ కవితలో చక్కగా వివరించాడని పేర్కొన్నారు.ఇందులో భవన నిర్మాణ కార్మికుల జీవితాన్ని,సగర వంశస్తుల పుట్టుపూర్వోత్తరాలను వివరిస్తూ కులవృత్తిలోనే జీవితమంతా గడపటం కాదు అటు జీవన విధానంలో, చేసే పనిలో మార్పురావాలని సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకొని సామాజికంగా వివిధ రంగాలలో ఎదగాలని సూచించారు.విద్యావంతుడిగా విద్యార్థులకు పాఠ్యబోధన చేస్తూ కవిగా తన కలానికి పదును పెట్టీ సమాజ మార్పుకోసం కృషి చేస్తున్న ఉప్పరి తిరుమలేశ్ అభినందనీయుడని, కొనియాడారు. సభాధ్యక్షులు పలుస శంకర్ గౌడ్,అతిథులు వాకిటి శ్రీధర్, నందిమల్ల అశోక్, ప్రేమ్ నాథ్ రెడ్డి,చీర్ల జనార్ధన్, కవులు వనపట్ల సుబ్బయ్య,నాగవరం బాల్ రామ్, డా. తూర్పింటి నరేష్ కుమార్,కిరణ్ కుమార్,వహీద్ ఖాన్, మెట్న కవితా సంపుటంలోని పలు అంశాలపై ప్రసంగించారు.

ఈనాటి కార్యక్రమంలో సాహితీ వేత్తలు బైరోజు చంద్ర శేఖర్, రాంరెడ్డి,మందాపురం సుజాతమ్మ,సందాపురం బిచ్చయ్య, కాశన్న, రామకృష్ణారెడ్డి, నరసింహ గౌడ్,గంధం నాగరాజు, బి.శ్రీనివాసులు, కొత్తకాపు నారాయణ రెడ్డి,శంకరయ్య,రచయిత కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

### నూతన లేడీస్ బట్టల షాపును ప్రారంభించిన మాజీ మంత్రి

వనపర్తి పట్టణం, గాంధీచౌక్ లో నూతనంగా ఏర్పాటు చేసిన ప్రొప్రైటర్ ఎం డి. నజీర్ ప్రిన్స్ లేడీస్ బట్టల కలెక్షన్స్ షాపును మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ప్రారంభించారు. వారితో వాటి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి వెంట పలస రమేష్ గౌడ్ జోహెబ్ హుస్సేన్ ఖాయ్యూమ్మ కలిం, ఖాదర్, ఖలీద్, హాలీం, షకీల్ తదితరులు పాల్గొన్నారు.

## ఖిల్లాలో మండల రెవిన్యూ అదనపు గర్ధవారీగా బాధ్యతలు చేపట్టిన జి. పుష్పలత



**ఖిల్లా ఘనపురం, జనవరి 12 (జనం సాక్షి) :** ఖిల్లా ఘనపురం వనపర్తి జిల్లా కలెక్టర్ కార్యాలయం లో టైపిస్టుగా విధులు నిర్వహిస్తున్న జి. పుష్పలత సోమవారం స్థానిక తహశిల్దర్ బి. సుగుణ సమక్షంలో గర్ధవారీగా విధులలో చేరి బాధ్యతలు చేపట్టారు. ఇదివరకు తహసిల్దార్ కార్యాలయముల కంప్యూటర్ టైపిస్టుగా విధులలో ఉన్న పవన్ కుమార్ రేవల్లి మండల తహశిల్దర్ కార్యాలయనికి రెవిన్యూ గర్ధవారీగా పదోన్నతి తో వెళన్న పవన్‌కు తహశిల్దర్ బి. సుగుణ ఘనంగా ఘనంగా సన్మానించారు, అనంతరం తహశిల్దర్ మాట్లాడుతూ పదోన్నతి పొందిన పవన్, పుష్పలత లు అంకిత భావంతో పని చెయ్యాలని ఆకాక్షించారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ శ్రీమతి బి.సుగుణ నాయబ్ తహసిల్దార్ శ్రీ. కే.లక్ష్మి కాంత్, సీనియర్ సహాయకులు కురుమూర్తి, మండల రెవెన్యూ గిర్దావరి తిరుపతయ్య, జిపివో లు, కంప్యూటర్ ఆపరేటర్లు, ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

# గ్రామీణ వైద్యులకు ప్రభుత్వ గుర్తింపు!

- పాలకుర్తి నియోజకవర్గం శాసన సభ్యురాలు యశస్విని రెడ్డి
- తొర్రూరు మండల ఆర్ఎంపి, పిఎంపి వెల్ఫేర్ అసోసియేషన్ నూతన క్యాలెండర్ ఆవిష్కరణ



**తొర్రూరు, జనవరి 12(జనంసాక్షి) :** గ్రామీణ వైద్యులకు ప్రభుత్వ గుర్తింపు కార్డులు ఇచ్చేందుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేస్తుందని పాలకుర్తి నియోజకవర్గ శాసన సభ్యురాలు యశస్విని రెడ్డి అన్నారు. సోమవారం తొర్రూరు మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆర్ఎంపి, పిఎంపి వెల్ఫేర్ అసోసియేషన్ 2026 సంవత్సర నూతన క్యాలెండర్ ను తొర్రూరు మండల అధ్యక్షులు ధర్మారపు హనుమంతు, ఆర్ఎంపి, పీఎంపీలతో కలిసి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాలలో పేద బడుగు బలహీన వర్గాల ప్రజలకు ప్రథమ చికిత్సను అందిస్తూ ఎనలేని సేవ చేస్తున్న వారిలో ముందు వరుసలో గ్రామీణ వైద్యులు ఉంటారని అన్నారు. ఈ క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమంలో ఆర్ఎంపీ, పీఎంపీ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి అనపురపు వెంకన్న, నియోజకవర్గ వర్కింగ్ ప్రెసిడెంట్ సింగారపు భీమయ్య, నియోజకవర్గ ఉపాధ్యక్షులు గడ్డం రాజమౌళి, ఆర్ఎంపి, పీఎంపీ వెల్ఫేర్ అసోసియేషన్ తొర్రూరు మండల కార్యదర్శి మన్నెం వెంకన్న, కోశాధికారి గద్దల వెంకటేష్, వర్కింగ్ ప్రెసిడెంట్ కొమ్మనబోయిన యాకయ్య, సలహాదారులు జంజీరాల శంకర్, బిక్షపతి, సభ్యులు విద్యాసాగర్, నిమ్మల శ్రీనివాస్, యనమాల రవి, మంగళపల్లి యాకయ్య, క్రాంతి కుమార్, విశ్వనాథం, నితీష్, గణేష్, సాగర్, దామోదర్, మురళి, రవీందర్, గడ్డం రమేష్, యాకమల్లు, మల్లేష్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# ఇచ్చిన మాట ప్రకారం ఘనపూర్‌ను మున్సిపాలిటీ చేశా

- స్టేషన్ ఘన్పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి
- హాజరైన ఎంపీ డాక్టర్ కడియం కావ్య, జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్



**స్టేషన్ ఘన్ పూర్, జనవరి 12 (జనంసాక్షి) :** నియోజకవర్గ అభివృద్దే ఏకైక లక్ష్యంగా పని చేస్తు న్నానని నా లక్ష్యం నెరవేరాలంటే నియోజకవర్గ ప్రజల సహకారంకావాలని మాజీఉప ముఖ్యమం త్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి గారు తెలిపారు. స్టేషన్ ఘనపూర్ పట్టణ కేంద్రం లో 7 కోట్ల రూపాయలతో పలు కాలనీలలో చేపట్టనున్న సిసి రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య , జనగామ జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్ భాషా తో కలిసి ఎమ్మెల్యే కడియం శ్రీహరి శంకుస్థాపన చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లా డుతూ ఎన్నికల సమయంలో ఎమ్మెల్యేగా అవకా శం కల్పిస్తే స్టేషన్ ఘనపూర్ ను మున్సిపాలిటీ చేస్తానని ప్రజలకు హామీ ఇచ్చానని, ఇచ్చిన మాట ప్రకారం ఘనపూర్, శివునిపల్లి, చాగల్ గ్రామాలనుకలిపి స్టేషన్ ఘనపూర్ మున్సిపాలిటీ ఏర్పాటు చేసినట్లు అందుకు సంబందించి 25 జన వరి 2025 రోజున ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసిందని తెలిపారు. గత 15ఏళ్లుగా ఘనపూర్ లో ఎలాంటి అభివృద్ధి జరగలేదని అంతర్గత సిసి రోడ్లు, డ్రైనేజిలు, విద్యుత్, త్రాగు నీరు సమస్యల పరిష్కారానికి 50కోట్లతో అభివృ ద్ధి పనుల ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపిస్తే 29 సెప్టెంబర్ 2025 నాడు స్టేషన్ ఘనపూర్ మున్సి పాలిటీ అభివృద్ధికి 50 కోట్లు మంజూరు చేస్తూ జీవో జారీ చేసిందని ఇంతపెద్ద మొత్తంలో రాష్ట్రం లోని ఏ మున్సిపాలిటీకి నిధులు ఇవ్వలేదని అన్నారు. అందులో భాగంగానే ఈ రోజు 7కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసుకున్నామ ని, మరో 11కోట్ల పనులకు వారం రోజుల్లో శంకు స్థాపన చేసుకుంటామని తెలిపారు. ఈ 11కోట్ల పనులలో లైబ్రరీ, మున్సిపాలిటీ కార్యాలయం, ఇంటిగ్రెటెడ్ మార్కెట్ వంటి పనులు ఉన్నాయని వివరించారు. మున్సిపాలిటీకి మంజూరు అయిన 50 కోట్ల పనులను సంవత్సరంలో పూర్తి చేసి ప్రజ లకు అందుబాటులోకి తీసుకువస్తానని హామీ ఇచ్చారు. వచ్చే ఆర్థిక సంవత్సరంలో కూడా ముఖ్యమంత్రిని ప్రత్యేకంగా విజ్ఞప్తి చేసి మరో 50 కోట్లు మంజూరు తీసుకువస్తానని వెల్లడించారు. నియోజకవర్గానికి మరో 3,500 ఇందిరమ్మ ఇల్లు రానున్నాయని అందులో మున్సిపాలిటీలోని 18 వార్డులకు వార్డుకు 25చొప్పున మొత్తం 450 ఇందిరమ్మ ఇళ్లను స్టేషన్ ఘనపూర్ మున్సిపాలి టీకి మంజూరు చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీ డాక్టర్ కడియం కావ్య, జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్, మార్కెట్ కమిటీ చైర్మన్ జూలుకుంట్ల లావణ్య శిరీష్ రెడ్డి, ఆర్డీవో వెంకన్న,మున్సిపల్ కమిషనర్ రాధాకృష్ణ, కాంగ్రెస్ పార్టీ మండల యూత్ అధ్యక్షుడు రాపోలు శివ చరణ్ రెడ్డి, నాయకులు చింతకుంట్ల నరేందర్ రెడ్డి,బెలిదే వెంకన్న,నీల గట్టయ్య, బూర్ల శంకర్, పోగుల సారంగపాణి, గోనెల ఉపేందర్, కిషన్ రాజ్, ఇల్లందుల ప్రతాప్, రాజయ్య, కొలిపా క సతీష్, సింగపురం వెంకటయ్య, సత్యం, శ్రీధర్, నరసింహులు, రమేష్, మున్సిపల్ అధికారులు, స్థానిక నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి అర్జీల పరిష్కారానికి అధికారులు ప్రాధాన్యతనివ్వాలి

- హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్



**హనుమకొండ ప్రతినిధి, జనవరి 12 (జనంసాక్షి):** ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు అందించిన అర్జీలను పరిష్కరించేందుకు అధికారులు పఅత్యంత ప్రాధాన్యతను ఇవ్వాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ అన్నారు. సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలులో వివిధ శాఖల జిల్లా అధికారులు, అధికారుల తో కలిసి ప్రజావాణి కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా సమస్యలను పరిష్కరించాలని జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ను నేరుగా కలిసి విన్నవిస్తూ అర్జీలను అందజేశారు. ప్రజల నుండి అర్జీలను స్వీకరిస్తూ వారు చెప్పిన అంశాలను కలెక్టర్ ఓపికగా విన్నారు. అక్కడే ఉన్న సంబంధిత శాఖల అధికారులను అర్జీల పరిష్కారానికి వెంటనే చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పలు మండలాల తహసిల్దార్లతోనూ ప్రజావాణి అర్జీల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని తెలిపారు. ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు వివిధ సమస్యల పరిష్కారం కోసం 110 అర్జీలను అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన ప్రతి దరఖాస్తును సంబంధిత శాఖల అధికారులు పరిశీలించి వాటి పరిష్కారానికి వెంటనే చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి వై.వి. గణేష్, ట్రైనీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రోహిత్ నేత, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# సబ్సిడీ ఎత్తివేసేందుకే యూరియా కృత్రిమ కొరత

- రైతుల ప్రయోజనాలకు అనుగుణంగా నూతన విత్తన చట్టాన్ని మార్చాలి
- ఈనెల 20న జిల్లా వ్యవసాయ ఆఫీసుల వద్ద ఆందోళనలు
- ఏఐకెఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపు




**వరంగల్ ప్రతినిధి, జనవరి 12(జనంసాక్షి):** రైతాంగం ఆరుగాలం కష్టించి ప్రకృతి వైపరీత్యాలను తట్టుకొని వ్యవసాయం చేసి పంటలను పండించడానికి అనేక అవస్థలు పడుతున్న మౌలిక సదుపాయాలు కల్పించాల్సిన కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అది విస్మరించి కార్పొరేట్ వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకు కృషి చేస్తున్నాయని అందులో భాగంగానే యూరియా కృత్రిమ కొరతను సృష్టించి పంటల దిగుబడి తగ్గేందుకు కారకులు అవుతున్నారని అఖిల భారత రైతు సమాఖ్య (ఏ ఐ కె ఎఫ్) రాష్ట్ర అధ్యక్షులు వస్కుల మట్టయ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెద్దారపు రమేష్ ఆందోళన వ్యక్తం చేశారు. అఖిల భారత రైతు సమాఖ్య (ఏఐకేఎఫ్) రాష్ట్ర కమిటీ సమావేశం రాష్ట్ర అధ్యక్షులు వస్కుల మట్టయ్య అధ్యక్షతన వరంగల్ అండర్ బ్రిడ్జి ప్రాంతంలోని ఓంకార్ భవన్ లో జరిగింది. ఈ సమావేశంలో వస్కుల మట్టయ్య, పెద్దారపు రమేష్ లు మాట్లాడుతూ కేంద్ర బిజెపి మోడీ ప్రభుత్వం స్వదేశీ నినాదంతో అధికారంలోకి వచ్చి దేశీయ వ్యవసాయాన్ని రైతులను దివాలా తీయించేందుకు శతవిధాల ప్రయత్నిస్తుందని ఈ క్రమంలో నూతన విత్తన చట్టం పేరుతో రైతులకు వ్యతిరేకంగా విత్తన ఉత్పత్తిదారులకు పెట్టుబడుదారులకు అనుకూలంగా విధానాలను రూపొందించిందని తద్వారా సన్నా చిన్నకారు రైతులను వ్యవసాయానికి దూరం చేసి కార్పొరేట్ వ్యవసాయాన్ని పెంపొందించేందుకు కృషి చేస్తున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. అలాగే రైతాంగానికి నిత్యవసరమైన యూరియాను సరిపడా అందించకుండా ఆన్లైన్ యాప్ ల పేరుతో రైతులకు యూరియా అందకుండా చేసి సబ్సిడీని ఎత్తివేసే కుట్ర చేస్తున్నదని ఆరోపించారు. ఈనెల 20న రాష్ట్రవ్యాప్తంగా జిల్లా వ్యవసాయ అధికారుల (జేడీఏ) ఆఫీసుల వద్ద ఆందోళనలు ధర్నాలు చేపట్టి వినతి పత్రాలు ఇవ్వాలని ఏఐకేఎఫ్ రాష్ట్ర కమిటీ నిర్ణయించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఏఐకేఎఫ్ రాష్ట్ర నాయకులు వి తుకారాం నాయక్ కుసుంబా బాబురావు వక్కల కిషన్ ఎండి ఇస్మాయిల్ సింగతి మల్లికార్జున్ మాదాసు ఆదిరెడ్డి ఇట్టమల్ల గురవయ్య తదితరులు పాల్గొన్నారు.

## దోస్త్ మేరా దోస్త్...!

- కుక్క, కోతి స్నేహం...



**చెన్నారావుపేట, జనవరి 12 ( జనం సాక్షి) :** కుక్క, కోతి స్నేహం చేసుకొని చట్టా పట్టాలు వేసుకొని తిరిగిన సంఘటన మండలంలోని లింగగిరి గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. కుక్కపై కోతి ఏం చక్కా పడుకొని అరగంట పాటు దోస్త్ మేరా దోస్త్... తూహై మేరీ జాన్... అన్నట్లుగా గ్రామ ప్రధాన కూడలిలో తిరిగాయి. ఈ సంఘటనను చూసిన గ్రామస్తులు కొందరు తమ సెల్ ఫోన్లలో ఫోటోలను తీసుకొని సోషల్ మీడియాలో వైరల్ చేశారు.

# భూపాలపల్లి మున్సిపాలిటీని అభివృద్ధి చేస్తా



- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు

**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** భూపాలపల్లి మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శంగా తీర్చి దిద్దుతానని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని సెగ్గంపల్లిలో శ్రీ రామాంజనేయ స్వామి వారి ఆలయ నిర్మాణ పనులకు, జంగేడు లో మదేలయ్య ఆలయ నిర్మాణ పనులకు, శ్రీ రామాలయ నిర్మాణ పనులకు రాంనగర్ లో దర్గా వద్ద ప్రహరీ గోడ నిర్మాణ పనులకు, ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు శంకుస్థాపన చేశారు. రాంనగర్ లో రూ.150 లక్షలతో నూతనంగా నిర్మించిన అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ భవనాన్ని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బట్టు కరుణాకర్ ఇతర ముఖ్య నేతలతో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఆయా కార్యక్రమాల్లో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు మాట్లాడుతూ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నా కొంతమంది ఓర్వలేక విమర్శించడం వారి అవివేకమని, జరుగుతున్న అభివృద్ధి పనులు వారికి కనిపించడం లేదని, వారికి కండ్లు లేవని చెప్పారు. మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపడతామని పేర్కొన్నారు. రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో 30 వార్డుల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు ఓట్లేసి గెలిపించాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోరారు. ఈ కార్యక్రమాల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు బుర్ర కొమురయ్య, చల్లూరి మధు, ముంజాల రవీందర్, స్థానిక ప్రజా ప్రతినిధులు, ఆయా శాఖల అధికారులు, పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి

- జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అన్ని శాఖల జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం ఐడీఓసి కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుండి మొత్తం 46 దరఖాస్తులు స్వీకరించినట్లు తెలిపారు. ఈ దరఖాస్తులను వెంటనే పరిశీలించి పరిష్కరించేందుకు సంబంధిత శాఖల అధికారులకు ఎండార్స్‌మెంట్ చేసినట్లు పేర్కొన్నారు. ఈ ప్రజావాణిలో వచ్చిన అన్ని దరఖాస్తులు రానున్న ప్రజావాణి నాటికి పూర్తిగా పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. సమస్యల పరిష్కారం కోసం ప్రజలు సుదూర ప్రాంతాల నుంచి కార్యాలయానికి వస్తున్నారని, అందువల్ల అధికారులు మరింత బాధ్యతాయుతంగా పనిచేయాలని తెలిపారు. దరఖాస్తుల పరిష్కారంలో పర్యవేక్షణ లోపిస్తే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, ఆర్డీఓ హరికృష్ణ, శిక్షణా డిప్యూటీ కలెక్టర్ నవీన్ రెడ్డి, ఆయా శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## కోతులను నివారించేందుకు తగిన చర్యలు చేపడతాం..



**చెన్నారావుపేట, జనవరి 12 ( జనం సాక్షి):** గ్రామాలలో కోతులను నివారించేందుకు తగిన చర్యలు చేపడతామని చెన్నారావుపేట గ్రామ సర్పంచ్ కంది శ్వేత కృష్ణ చైతన్య రెడ్డి, పాత ముగ్దుపురం సర్పంచ్ నను మాస కరుణాకర్, అక్కల్ చెడ గ్రామ సర్పంచ్ భూక్య బుజ్జి సురేష్, ముగ్దుపురం ప్రజా ప్రతినిధులు చీకటి ఓదేలు అన్నారు. సోమవారం పాత ముగ్దుపురం గ్రామపంచాయతీ కార్యాలయంలో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నాలుగు గ్రామాలలో కోతుల నివారణకు ఏ విధమైన చర్యలు తీసుకోవాలని చర్చించారు. త్వరలో కోతులను నివారించేందుకు తగిన చర్యలు చేపడతామని తెలిపారు. అనంతరం నూతనంగా ఎన్నికైన సర్పంచ్, ఉపసర్పంచ్ లను శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శంషుద్దీన్, ఉప సర్పంచులు దొంతి శ్రీనివాస్, అలవాల శ్రీనివాస్, వార్డు సభ్యులు మాదాసి అనిత రమేష్, జన్ను రమేష్, లక్ష్మణ చారి, ఫీల్డ్ అసిస్టెంట్ సుంకరి రాజు, కారోబార్ కల్వచర్ల సాంబయ్య, సిబ్బంది మేకల రాజు, నాంపల్లి అయిలుమల్లు, తదితరులు పాల్గొన్నారు.

# 3 కిలోల గంజాయి పట్టివేత!

- ఒకరి అరెస్ట్..

**చెన్నారావుపేట, జనవరి 12 (జనంసాక్షి) :** మూడు కిలోల గంజాయిని అక్రమంగా తీసుకు వస్తుండగా పట్టుకొని ఒకరిని అరెస్టు చేసి రిమాండ్ కు తరలించినట్లు చెన్నారావుపేట ఎస్సై రాజేష్ రెడ్డి సోమవారం తెలిపారు. మండలంలోని అక్కల్ చెడ గ్రామానికి చెందిన పడిదం ప్రదీప్ అనే యువకుడు భద్రాచలం నుండి 3 కిలోల గంజాయిని అక్రమంగా బ్యాగులో పెట్టుకుని తీసుకువస్తుండగా అక్కల్ చెడ గ్రామ క్రాస్ రోడ్డు వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. పట్టుకున్న 3 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకొని పడిదం ప్రదీప్ ను అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించినట్లు తెలిపారు.

# రామప్ప హుండీ ఆదాయం రూ.6,71,954



**ములుగు/వెంకటాపూర్, జనవరి 12 (జనం సాక్షి):** ములుగు జిల్లా వెంకటాపూర్ మండలం పాలంపేట గ్రామం లో శ్రీ రామలింగేశ్వర స్వామి దేవస్థానం హుండీలను సోమవారం రోజున ఉదయం దేవాలయం లో సహాయక కమిషనర్ కార్యాలయం సూపరిండెంట్ కె.కుమారస్వామి సమక్షంలో విప్పి లెక్కించగా నోట్లు 6,10,530 రూ.లు,నాణెములు 61,424 రూ.లు, మొత్తం 6,71,954 రూ.లు వచ్చినవి. ఈ కార్యక్రమంలో కార్యనిర్వాహ ణాధికారి బిళ్ళ శ్రీనివాస్, వెంకటాపూర్ మండల తహసీల్దార్ గిరిబాబు, పాలంపేట గ్రామ సర్పంచ్ చల్ల కొండ రాజు,ముఖ్య అర్చక కె.హరీష్ శర్మ,అర్చకులు ఉమశంకర్,పోలీస్ సిబ్బంది, శ్రీవల్లి సేవ సమితి సభ్యులు,ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేయాలి

- కుచాడీ శ్రీహరి రావ్



**నిర్మల్ బ్యూరో, జనవరి12,(జనంసాక్షి) :** రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ నెల 16న శుక్రవారం నిర్మల్, ఆదిలాబాద్ జిల్లాలో పర్యటిస్తారని కాంగ్రెస్ పార్టీ జిల్లా ఇన్చార్జి తాహెర్ బిన్ ఆమ్దాని అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో సీఎం సభ కోసం స్థలాన్ని నిర్మల్ నియోజకవర్గ ఇన్చార్జి కూచాడి శ్రీహరి రావుతో కలిసి సోమవారం పరిశీలించారు. మామడ మండలం పొన్కల్ గ్రామంలో గోదావరి నదిపై నిర్మించిన సదర్మట్ బ్యారేజ్ ను ప్రారంభిస్తారని పేర్కొన్నారు. అనంతరం భారీ బహిరంగ సభలో ముఖ్యమంత్రి పాల్గొంటారని వివరించారు. ఇందులో జిల్లా ఇన్చార్జులు చంద్రశేఖర్ గౌడ్, రామ్ భూపాల్, మాజీమంత్రి ఇంద్రకరణ్ రెడ్డి, పీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎంబడి రాజేశ్వర్, జిల్లా గ్రంథలయ సంస్థ చైర్మన్ అర్జుమన్ అలీ, మార్కెట్ కమిటీ చైర్మన్ భీమ్ రెడ్డి తదితరులున్నారు.

## అచ్చ సుదర్శన్ కు జాతీయ పురస్కారం

**నడికూడ, జనవరి 12 (జనం సాక్షి):** హనుమకొండ జిల్లా నడికూడ మండలం చర్లపల్లి ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయులుగా పని చేస్తున్న అచ్చ సుదర్శన్ కు స్వామి వివేకానంద జాతీయ పురస్కారం 2026 లభించింది. భారత్ మాత అభినందన సంఘటన్ వ్యవస్థాపక జాతీయ అధ్యక్షులు డాక్టర్ పురుషోత్తం దాస్ మిట్టల్, కర్ణాటక అధ్యక్షుడు డాక్టర్ మలకప్ప ఆన్లైన్ ద్వారా అందజేశారు. స్వామి వివేకానంద జాతీయ పురస్కారం మానవత్వంతో మానవాళికి నిస్వార్థ సేవ, విశిష్ట సేవలను గుర్తించి,స్వామి వివేకానంద ప్రతిపాదించిన సూత్రాలు ఆదర్శాలను ఆచరణలో చూపినందుకు,శాంతి, విశ్వ సౌభ్రాతృత్వం, మానవత్వం యొక్క అభివృద్ధికి అంకితభావం నిరంతరం దోహదపడిన వారికి ఈ అవార్డును దేశ వ్యాప్తంగా అందజేస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా అచ్చ సుదర్శన్ మాట్లాడుతూ అవార్డు రావడం ఎంతో గర్వకారణమని, తన బాధ్యతను మరింత పెంచిందని అన్నారు.

# ఇద్దరు గంజాయి రవాణాదారుల అరెస్టు

**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** అక్రమంగా గంజాయి రవాణా చేస్తున్న ఇద్దరు నిందితులను సోమవారం అరెస్టు చేసి, రిమాండ్ కు పంపినట్లు భూపాలపల్లి సిఐ నరేష్ కుమార్ తెలిపారు. మల్హర్ మండలం తాడిచర్లకు చెందిన కుంట శివ(31), భూపాలపల్లి పట్టణంలోని హనుమా న్ నగర్ కు చెందిన ఉర్సు దిలీప్ కుమార్(27)లు భూపాలపల్లి బస్టాండ్ సమీపంలోని కూరగా యల మార్కెట్ వద్ద నిషేధిత గంజాయిని అక్రమ రవాణా చేస్తుం డగా, అనుమానం వచ్చి భూపాలపల్లి పోలీ సులు అదుపులోకి తీసుకున్నారు. అనం తరం తనిఖీ చేయగా వారి వద్ద నుండి ఒక కిలో 650గ్రాముల నిషేధిత గంజాయి లభ్యమైంది. ఈ మేరకు మాదక ద్రవ్యాల నియంత్రణ చట్టం ప్రకారం కేసు నమోదు చేసి నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

# విద్యారంగ అభివృద్ధికి పెద్దపీట

- రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేకానంద



**మంచిర్యాల, జనవరి 12 (జనంసాక్షి):** రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగ అభివృద్ధి కి పెద్దపీట వేస్తుందని రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద అన్నారు. సోమవారం జిల్లాలోని చెన్నూర్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ప్రభుత్వ వెనుకబడిన తరగతుల కళాశాల బాలికల వసతి గృహ భవనాన్ని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి భాగ్యవతి లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి మాట్లాడుతూ అన్ని ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులు, త్రాగునీరు, విద్యుత్, విద్యార్థినీ విద్యార్థులకు వేరువేరుగా మూత్రశాలలు, ప్రహరీ గోడ, అదనపు గదుల నిర్మాణం ఇతర అభివృద్ధి పనులు చేపట్టి విద్యార్థుల ఆరోగ్య దృష్ట్యా పోషక విలువలతో కూడిన మెనూ అమలు చేస్తుందని, నిష్ణాతులైన ఉపాధ్యాయులను నియమించి నాణ్యమైన విద్యా బోధన అందిస్తుందని తెలిపారు. విద్యార్థులు ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. అనంతరం కోటపల్లి మండలం కొల్లూరు గ్రామంలో ఏర్పాటు చేసిన ఇసుక రీచ్ ను జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, మైనింగ్ ఎ.డి. జగన్మోహన్ రావు, కోటపల్లి మండల తహసిల్దార్ రాఘవేంద్ర, మండల పరిషత్ అభివృద్ధి అధికారి నాగేశ్వర్ రెడ్డి లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో ఇసుక అక్రమ రవాణాపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని, ఈ క్రమంలో ఆన్ లైన్ లో మన ఇసుక వాహనం వెబ్ సైట్ ద్వారా ఇసుకను బుక్ చేసుకున్న వినియోగదారులకు తక్కువ ధరకు అధికారికంగా ఇసుకను పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు.

## ఉర్దూ యూనివర్సిటీ భూమి కబ్జాకు ప్రభుత్వం కుట్ర



**దేవరకొండ, జనవరి 12 (జనం సాక్షి) :** హైదరాబాద్ లోని మౌలానా అబుల్ కలాం ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ భూమిని కబ్జా చేసేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెనుక ఉన్న రియల్ ఎస్టేట్ మాఫియా కుట్ర చేస్తుందని బిఆర్ఎస్ దేవరకొండ నగర ఉపాధ్యక్షుడు యండి ఇలియాస్ పటేల్ పేర్కొన్నారు. 1998లో పార్లమెంట్ చట్టం ద్వారా స్థాపించిన యూనివర్సిటీ ఇది. తెలంగాణలోని హైదరాబాద్‌లో ఉన్న ఒక కేంద్ర విశ్వవిద్యాలయం. దీనికి స్వాతంత్ర్య సమరయోధుడు, విద్యావేత్త మరియు స్వతంత్ర భారతదేశపు మొదటి విద్యా మంత్రి అయిన మౌలానా అబుల్ కలాం ఆజాద్ పేరు పెట్టారు. ఈ యొక్క యూనివర్సిటీకి దాదాపు 200 ఎకరాలు కేటాయించారని. ఇందులో నుంచి 50 ఎకరాల భూమిని రియల్ ఎస్టేట్ మాఫియా వైపు మళ్లించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర చేస్తుందని దీన్ని పూర్తిగా అడ్డుకుంటామని తెలిపారు. మౌలానా అబుల్ కలాం ఆజాద్ యూనివర్సిటీలో 28 డిపార్ట్మెంట్స్ కలిగి ఉన్నాయని, అదేవిధంగా 7 వేల మంది విద్యార్థులు చదువుతున్నారని విశాలంగా ఉండాలని, భవిష్యత్తులో ఇబ్బంది ఉండకూడదని పార్లమెంట్ లో తీర్మానం చేసి రెండు వందల ఎకరాలు కేటాయించారని, ఇందులో విద్యార్థులకు హాస్టల్స్ సదుపాయం ఉందని, ఇప్పుడు ఆ యూనివర్సిటీ పై ప్రభుత్వ కన్ను పడిందని రియల్ ఎస్టేట్ వైపు ఆ భూమిని మళ్లించి అమ్ముకునేందుకు కుట్ర చేస్తున్నారని దుయ్యబట్టారు. ముస్లింలు కాంగ్రెస్ వైపే ఉన్నారని ముస్లింల ఓట్లు కాంగ్రెస్కు కావాలని ఊదర ఉపన్యాసాలు చేసే ముఖ్యమంత్రి ఉర్దూ యూనివర్సిటీ భూములను లాక్కునేందుకు ప్రయత్నిస్తున్నారని, దీనిని ముస్లిం సమాజం తరుపున తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని అన్నారు. ఉర్దూ యూనివర్సిటీ జోలికి వస్తే పరిణామాలు చాలా తీవ్రంగా ఉంటాయని ఈ సందర్భంగా హెచ్చరించారు.

## ప్రజావాణి ఫిర్యాదులపై సత్వరమే చర్యలు తీసుకొని పరిష్కరించాలి

- కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్



**సూర్యాపేట ప్రతినిధి, జనవరి 12 (జనంసాక్షి) :** ప్రజావాణి ఫిర్యాదులపై అధికారులు సత్వరమే చర్యలు తీసుకొని పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ఆదేశించారు.సోమవారం కలెక్టరేట్ లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు.ప్రజావాణి కార్యక్రమానికి అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని,వివిధ శాఖలలో చాలా కాలం పెండింగ్ లో ఉన్న ఫిర్యాదులపై శాఖల వారీగా ప్రత్యేక శ్రద్ధ పెట్టి పరిష్కరించాలని అన్నారు.ప్రజావాణి దరఖాస్తులపై పర్యవేక్షణ ఉంటుందని,కొన్ని శాఖలలో పెండింగ్ దరఖాస్తులు ఎక్కువగా ఉన్నాయని, వాటిని తగ్గించుకోవాలని, రాష్ట్ర స్థాయి ప్రజావాణి పెండింగ్ దరఖాస్తులపై కూడా దృష్టి పెట్టాలని అన్నారు.కలెక్టరేట్ లోని ప్రతి కార్యాలయం పరిశుభ్రంగా ఉంచుకోవాలని, అలాగే ఫైల్స్, ఫర్నీచర్ క్రమ పద్ధతిలో పెట్టుకోవాలని అన్నారు.త్వరలో ప్రతి కార్యాలయాన్ని తనిఖీ చేస్తానని, అపరిశుభ్రంగా, ఫైల్స్ సరిగా లేని కార్యాలయాలపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.కలెక్టరేట్ కు వచ్చే ప్రతి ఉద్యోగి, సందర్శకులు తప్పనిసరిగా హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించాలని,వీటిని అతిక్రమించిన వారికి త్వరలో జరిమానాలను కూడ వసూలు చేయటం జరుగుతుందని తెలిపారు.అనంతరం జరిగిన జిల్లా స్థాయి ఆహార భద్రతా సలహా కమిటీ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలకు సురక్షితమైన ఆహారం అందేలా చూడటానికి హోటళ్లు, దాబాలు, ఫుడ్ స్టాల్స్, తయారీ కేంద్రాలపై విస్తృతంగా తనిఖీలు, దాడులు నిర్వహించాలని అన్నారు. అన్ని ప్రభుత్వ ఆసుపత్రులు, హాస్టళ్లు, అంగన్వాడీ కేంద్రాల నుండి ప్రతి నెల ఆహార నమూనాలను సేకరించాలని, కల్తీ ఆహారం విక్రయించే వారిపై కేసులు నమోదు చేయాలని సూచించారు.సంక్రాంతి సెలవులకు ముందు సంబంధిత ఫుడ్ సేఫ్టీ కమిటీ అధికారులు మండల విద్యాధికారులు అన్ని పాఠశాలలు, గురుకుల పాఠశాలలు, హాస్టళ్లు మరియు అంగన్వాడీ కేంద్రాలు తనిఖీ చేసి ఆహార పదార్థాలు సరిగా ఉన్నాయో లేవో చూడాలని అన్నారు.ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథరిటీ ఆఫ్ ఇండియా లైసెన్సులను పొందేలా చూడాలని ఆదేశించారు.జిల్లాలో ఉన్న హోటళ్లు, దాబాలపై ఆకస్మిక తనిఖీలు, దాడులు నిర్వహించాలని సూచించారు. ఆహార కల్తీకి సంబంధించి ఏవైనా ఫిర్యాదులు వస్తే కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో ఆర్డీఓ వేణుమాదవ్, ఇంచార్జ్ డిఆర్డిఏ పిడి శిరీష, మహిళా సంక్షేమ అధికారి కె.నర్సింహారావు, హౌజింగ్ పిడి సిద్ధార్థ, జిల్లా వెటర్నరీ అధికారి శ్రీనివాస్, సిపిఓ కిషన్ నాయక్, జిల్లా మార్కెటింగ్ అధికారి నాగేశ్వర్ శర్మ, కలెక్టరేట్ పరిపాలన అధికారి సుదర్శన్ రెడ్డి,అధికారులు,సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## సర్వర్ మొర.. అన్నదాత బేజారు..!

- స్లాట్ బుక్ చేసుకున్నా దొరకని యూరియా..
- ఉదయం నుంచి సాయంత్రం వరకు వేచిచూసి వెనుదిరిగిన వైనం



**చండూరు, జనవరి 12 (జనంసాక్షి) :** యాసంగి సీజన్ ప్రారంభంలోనే అన్నదాతలకు కష్టాలు మొదలయ్యాయి. ఒకవైపు గజగజ వణికించే చలి, మరోవైపు పంటలకు అత్యవసరమైన యూరియా కోసం పడిగాపులు కాయాల్సిన దుస్థితి నెలకొంది. నల్లగొండ జిల్లా చండూరు మండల కేంద్రంలోని రైతు సేవా సహకార సంఘం వద్ద సోమవారం యూరియా కోసం వచ్చిన రైతులు తీవ్ర నిరాశతో వెనుదిరగాల్సి వచ్చింది. చలిని లెక్కచేయకుండా క్యూలైన్లలో యూరియా కోసం రైతులు ముందుగానే స్లాట్ బుక్ చేసుకున్నారు. సోమవారం కావడంతో తమకు ఎరువులు అందుతాయని ఆశతో, తెల్లవారుజాము నుంచే సొసైటీ కార్యాలయానికి చేరుకున్నారు. చలి తీవ్రత అధికంగా ఉన్నప్పటికీ, బస్తాలు దొరకవేమోనన్న భయంతో రైతులు గంటల తరబడి క్యూలైన్లలో నిలబడ్డారు. అడ్డుపడ్డ సాంకేతిక సమస్యలు ఉదయం కార్యాలయం తెరిచిన తర్వాత కొంతమంది రైతులకు మాత్రమే యూరియా బస్తాలను పంపిణీ చేశారు. ఆ వెంటనే సర్వర్ పనిచేయడం లేదని (సర్వర్ డౌన్) నిర్వాహకులు పంపిణీని నిలిపివేశారు. దీంతో పొద్దంతా క్యూలో నిల్చున్న రైతులు సాయంత్రం వరకు వేచి చూసినా సర్వర్ రాకపోవడంతో తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. స్లాట్ బుక్ చేసుకున్నప్పటికీ ప్రయోజనం లేకుండా పోయిందని ఆవేదన చెందారు. సర్వర్ సాకులతో తమను ఇబ్బంది పెట్టవద్దని రైతులు అధికారులను డిమాండ్ చేస్తున్నారు. స్లాట్ బుకింగ్‌తో సంబంధం లేకుండా, ఆధార్ కార్డు లేదా పట్టాదారు పాస్ పుస్తకం ఆధారంగా అవసరమైన రైతులందరికీ వెంటనే యూరియా అందించాలని కోరుతున్నారు.
ప్రస్తుత పరిస్థితులను చూస్తుంటే "రైతుకు అమ్మబోతే అడివి.. కొనబోతే కొరివి"లా తయారైందని రైతులు వాపోతున్నారు. అధికారులు స్పందించి వెంటనే యూరియా కొరత లేకుండా చూడాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

## గ్రామ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

- ఆరోగ్య ఉప కేంద్రాన్ని ప్రారంభించిన శాసనసభ్యులు, మందుల సామేలు



**తుంగతుర్తి, జనవరి 12 (జనం సాక్షి) :** గ్రామ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు డాక్టర్లు సిబ్బంది కృషి చేయాలని స్థానిక శాసనసభ్యులు మందుల సామేలు అన్నారు, సోమవారం మండల పరిధిలోని అన్నారం గ్రామంలో నూతనంగా నిర్మించిన అంగన్వాడి భవనం, ఆరోగ్య ఉప కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యా వైద్యం రంగాలకు అధిక ప్రాధాన్యత ఇస్తుందని అన్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్యం, పిల్లలకు మెరుగైన విద్యా వసతులు కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని చెప్పారు. అంగన్వాడి భవనంతో చిన్నారులకు సురక్షిత వాతావరణంలో పోషణ, విద్య అందుతుందని, ఆరోగ్య ఉప కేంద్రం ద్వారా గ్రామస్థులకు దగ్గర్లోనే వైద్య సేవలు లభిస్తాయని పేర్కొన్నారు. అభివృద్ధి పనుల్లో ఎలాంటి నిర్లక్ష్యం ఉండదని, ప్రజల అవసరాలకు అనుగుణంగా మరిన్ని మౌలిక వసతులు తీసుకువస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కుంచాల శ్రీనివాస్ రెడ్డి, తుంగతుర్తి సింగిల్ విండో మాజీ చైర్మన్ గుడిపాటి సైదులు, వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చింతకుంట్ల వెంకన్న, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దొంగరి గోవర్ధన్,కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు దాసరి శ్రీను,దాయం ఝాన్సీ రాజిరెడ్డి, ప్రవీణ్ రెడ్డి, వివిధ గ్రామాల సర్పంచులు,ఎంపీడీవో శేష్ కుమార్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ, డాక్టర్ లింగమూర్తి, సిడిపిఓ శ్రీజ, జై పంచాయతీ రాజ్ డిఈ లింగా నాయక్, ఏ ఈ మహేష్, గ్రామ కార్యదర్శి రమేష్,సంబంధిత అధికారులు, అంగన్వాడి టీచర్లు, ఆశా కార్యకర్తలు, గ్రామ వార్డు సభ్యులు,గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణిలో వచ్చే ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించండి

- అధికారులకు జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి సూచన..



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, జనవరి 12 (జనంసాక్షి) :** ప్రజావాణికి వచ్చే ఫిర్యాదులను అధికారులు పరిశీలించి తక్షణమే సత్వర పరిష్కారం చూపించేలా చర్యలు తీసుకోవాలన్నారు రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి సోమవారం నాడు ప్రజావాణికి (54) ఫిర్యాదులు అందాయనీ జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డికి విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు అందించే వినతులను సంబంధిత శాఖల జిల్లా అధికారులు తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. రెవెన్యూ శాఖ27 ఇతర శాఖలు27 మొత్తం54 దరాఖస్తులు అందాయ అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## సీఎం కప్ పోటీలను విజయవంతం చేయాలి

- కలెక్టర్ విజయేందిర బోయి



**మహబూబ్‌నగర్ బ్యూరో, జనవరి 12 (జనం సాక్షి) :** సి.యం కప్ క్రీడా పోటీలను విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయం సమావేశ మందిరంలో ప్రజావాణి కార్యక్రమం అనంతరం నిర్వహించిన జిల్లా అధికారుల సమన్వయ సమావేశంలో సి ఎం.కప్ పోటీల నిర్వహణ,వివిధ అభివృద్ధి కార్యక్రమాలపై అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు (ఎంపీడీవోలు), మండల విద్యాధికారులు (ఎంఈవోలు), ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్ (పీఈటీ)ల సమన్వయంతో గ్రామ, మండల, నియోజకవర్గ,జిల్లా స్థాయిలలో పోటీలు నిర్వహించాలని ఆదేశించారు.ఈ పోటీల నిర్వహణకు గ్రామ,మండల, నియోజకవర్గ జిల్లా, రాష్ట్ర స్థాయిలో కమిటీలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు .ఈ పోటీలను ఈ నెల 17 నుండి ఫిబ్రవరి 23 వరకు గ్రామ నుండి రాష్ట్ర స్థాయి వరకు సి.ఎం.కప్ క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. సీఎం కప్ క్రీడా పోటీలు ప్రారంభానికి ముందు పాల్గొనే ప్రతి ఒక్క జట్లు సబ్ జూనియర్, జూనియర్, సీనియర్, వారి సంబంధిత విభాగాలలో తప్పనిసరిగా ఆన్‌లైన్ వెబ్సైట్‌లో రిజిస్టర్ చేసుకోవాలని అన్నారు.పి.ఈ.టి.లు,క్రీడా సంఘాలు, ఈ క్రీడల్లో పాల్గొనే విద్యార్థిని, విద్యార్థులను,యువత ను వెబ్ సైట్ లో నమోదు చేసుకునేలా తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే పోటీలు నిర్వహించే ప్రతి క్రీడా స్థలంలో వైద్య ఆరోగ్య శాఖ అధికారులు వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి ఫస్ట్ ఎయిడ్ కిట్ ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. గ్రామ మహిళా సమాఖ్య సంఘాలు అవసరం ఉన్న చోట స్థలం గుర్తించి గ్రామ పంచాయతీ తీర్మానం చేసి రేపటి లోగా ఎం.పి.డి. ఓ ల ద్వారా ప్రతిపాదనలు పంపాలనీ ఏ.పి.ఎం.లను ఆదేశించారు.ఇందుకు ప్రభుత్వం భవనం నిర్మాణంలో ఈ.జి.ఎస్ ద్వారా 10 లక్షలు మంజూరు చేయనున్నట్లు తెలిపారు.వీటిని మార్చి 31 లోగా పూర్తి చేయాలని సూచించారు.మండల సమాఖ్య భవనాలు లేని చోట కూడా భవనం నిర్మాణానికి 10 లక్షలు మంజూరు చేయనున్నట్లు,వెంటనే ప్రతిపాదనలు పంపాలని సూచించారు..ప్రతి మండలం లో ఒక 100 మెట్రిక్ టన్నుల గోదాం నిర్మాణం కు కూడా ఉపాధి హామీ పథకం ద్వారా 30 లక్షలు రూ.లు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. ఎం.పి.డి.ఓ ద్వారా గోదాం నిర్మాణానికి ప్రతిపాదనలు పంపాలని మండల ప్రత్యేక అధికారులకు సూచించారు. జిల్లాలో 139 పాఠశాలల్లో ఒక్కొక్క టాయిలెట్ కు 2 లక్షల రూ ల చొప్పున మంజూరు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. మండల విద్యాధికారులు, ఎం .పి.డి.ఓ లు, సంబంధిత పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ అధికారులతో మాట్లాడి ఫిబ్రవరి నెలాఖరు లోగా పూర్తి చేయాలని సూచించారు. జిల్లాలో 233 అంగన్వాడి కేంద్రాల్లో టాయిలెట్ లు కావాలని జిల్లా సంక్షేమ అధికారి కోరారని, ఒక్కొక్క టాయిలెట్ కు 52 వేల రూ.లు వారం లోగా మంజూరు చేయనున్నట్లు తెలిపారు.వీటిని సి. డి.పి.ఓ.లు,సూపర్వైజర్ లు,ఎం.పి.డి.ఓ లు సమన్వయం తో ఫిబ్రవరి లోగా పూర్తి చేయాలని సూచించారు. సంక్రాంతి పండుగ సందర్భంగా నేడు,రేపు అన్ని గ్రామాల్లో పారిశుధ్య డ్రైవ్ చేపట్టి డ్రైన్ లు పూడిక తీయడం,పరిశుభ్రం చేయడం,చెత్త కుప్పలు,పిచ్చి మొక్కలు తొలగించాలని సూచించారు.సమావేశం లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, రెవెన్యూ అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్,జడ్.పి.సి. ఈ.ఓ వెంకట రెడ్డి,డి ఆర్.డి.ఓ నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

# మాజీ ఎమ్మెల్యే బొల్లం వ్యాఖ్యలు అర్థరహితం



**కోదాడ, జనవరి 12 (జనం సాక్షి) :** గ్రీన్ ట్రిబ్యునల్ బాధితులకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని టిపిసిసి ప్రతినిధి చింతకుంట్ల లక్ష్మీనారాయణ రెడ్డి, జిల్లా గ్రంథాలయ చైర్మన్ వంగవీటి రామారావు అన్నారు. సోమవారం కోదాడ పట్టణంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పార్టీ ముఖ్య నాయకులతో కలిసి వారు పాల్గొని మాట్లాడారు. మంత్రి ఉత్తమ్, ఎమ్మెల్యే పద్మావతి నిరంతరం బాధితులకు అండగా ఉంటున్నారని అటువంటి వారిపై మాజీ ఎమ్మెల్యే బొల్లం చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. అసెంబ్లీ సమావేశాలు అనంతరం స్థానిక శాసన సభ్యురాలు పద్మావతి బాధితుల దగ్గరికి వెళ్లి వారికి భరోసా కల్పించారాని అన్నారు. ఒక్క రూపాయి ఖర్చు లేకుండా 375 మంది బాధితుల పక్షాన కోర్టులో పోరాటం చేస్తామని తెలిపారు. మల్లయ్య ను ఎవరు నమ్మే పరిస్థితిలో లేరని ఆయన పాలనలో ఎంత అవినీతి జరిగిందో ప్రజలందరికీ తెలుసు అన్నారు. మంత్రి ఉత్తమ్, ఎమ్మెల్యే పద్మావతి చొరవతో కోదాడ, హుజూర్ నగర్ నియోజకవర్గంలో వేలకోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని 100 పడకల ఆసుపత్రి, విశ్వవిద్యాలయాలు, రైతులకు లిఫ్టులు వంటి అభివృద్ధి పనులతో రాష్ట్రంలోనే కోదాడ అభివృద్ధిలో అగ్రస్థానంలో నిలిచిందన్నారు. రానున్న మున్సిపాలిటీ ఎన్నికల్లో అన్ని వార్డులో కాంగ్రెస్ పార్టీ విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో మాజీ డిసిసిబి చైర్మన్ ముత్తవరపు పాండురంగారావు, మాజీ సర్పంచ్ పారా సీతయ్య, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ కందుల కోటేశ్వరరావు, యడవల్లి బాల్ రెడ్డి, చింతలపాటి శ్రీనివాసరావు, ఈదుల కృష్ణయ్య, కాంపాటి శ్రీను, పాలూరి సత్యనారాయణ, అంబడికర్ర శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపాల్టీ తుది ఓటర్ జాబితా విడుదల

- మొత్తం ఓటర్లు 13746 మంది



**నేరేడుచర్ల, జనవరి 12 (జనంసాక్షి) :** పురపాలక కార్యాలయంలో నేరేడుచర్ల 2వ సాధారణ మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా పురపాలక సంఘం పరిధిలో ఉన్న 01 నుండి 15 వార్డుల తుది ఓటర్ జాబితాను మున్సిపల్ కమిషనర్ అశోక్ రెడ్డి విడుదల చేశారు. వార్డుల వారిగా ఓటర్ల వివరాలు ఇలా ఉన్నాయి. ఒకటవ వార్డు పురుషులు 400, మహిళలు 435, రెండవ వార్డు, పురుషులు,415 ,మహిళలు 474, మూడవ వార్డు పురుషులు 441, మహిళలు 495, నాలుగో వార్డు పురుషులు 398, మహిళలు 489,ఐదవ వార్డు, పురుషులు,495, మహిళలు 495, ఆరవ,వార్డు పురుషులు 479, మహిళలు 503 , ఏడవ వార్డు పురుషులు 413, మహిళలు 454 , ఎనిమిదవ వార్డు, పురుషులు 468,మహిళలు 487, తొమ్మిదో వార్డు పురుషులు 436, మహిళలు 472, పదో వార్డు పురుషులు 461, మహిళలు 475,పదకొండవ వార్డు పురుషులు 466,మహిళలు 523,.పన్నెండో వార్డు, పురుషులు 463, మహిళలు 425, పదమూడోవ వార్డు పురుషులు 374, మహిళలు 425, పద్నాలుగు వార్డు,పురుషులు 464,మహిళలు 511, పదిహేనోవ వార్డు పురుషులు 456,మహిళలు 453, ఉన్నారు. పురుషులు 6629 మంది ,మహిళలు 7116 మంది,ఇతరులు 01 మంది,మొత్తం 13746 మంది ఓటర్లు ఉన్నారని మున్సిపల్ కమిషనర్ అశోక్ రెడ్డి తెలిపారు.

## ఉమ్మడి జిల్లా అండర్ 19 కబడ్డీ పోటీలు ప్రారంభం

**గరిడేపల్లి, జనవరి 12 (జనంసాక్షి) :** మండలంలో సర్వారం గ్రామంలో అంబేద్కర్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉమ్మడి నల్లగొండ జిల్లా అండర్ -19 కబడ్డీ పోటీలను సూర్యాపేట జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి నామా నరసింహ రావు ప్రారంభించారు. వారు మాట్లాడుతూ ఇటువంటి క్రీడాలను నిర్వహించడం నిజంగా అభినందించదగ్గ విషయమని అంబెడ్కర్ యువజన సంఘం వారిని అభినందించారు.సర్వారం క్రీడాకారులు రాష్ట్ర జాతీయ స్థాయిలో రానిచ్చి గ్రామానికి పేరు ప్రతిష్టలు తీస్కొని రావాలి అన్నారు. క్రీడాకారులు జిల్లా అసోసియేషన్ తరుపున ఎల్లప్పుడు సాయ సహకారాలు ఉంటాయని వారు అన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చింతకాయల నాగేశ్వర్ రావు,నాగిరెడ్డి, అంబేద్కర్ యువజన సంఘం సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



# కోదాడ "పుర" చైర్మన్ పదవి ఎవరికి దక్కేనో..

- గెలుపుకై వ్యూహాత్మకంగా అడుగులు..
- యువత, కొత్త ఓటర్లపై దృష్టి సారిస్తున్న పార్టీలు

**కోదాడ, జనవరి 12 (జనం సాక్షి) :** మున్సిపాలిటీ ఎన్నికలకు ఈనెల చివరి వారంలో నోటిఫికేషన్ వెలువడే అవకాశాలు ఉన్నాయి. కోదాడ మున్సిపాలిటీ చైర్మన్ పదవి కైవసం చేసుకోవడానికి ప్రధాన రాజకీయ పార్టీలు వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నాయి. 35 వార్డులలో ప్రజలతో మమేకమై, ఆదరాభిమానాలు ఉన్న వారిని బరిలో దించే యోచనలో ఉన్నారు. వార్డులలో గెలిచే అభ్యర్థుల వేటలో నిమగ్నమై అన్వేషణ ప్రారంభించారు. అధికార పార్టీ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల ఎజెండాగా ప్రజలలోకి తీసుకువెళ్లి మెజార్టీ వార్డుల్లో విజయం సాధించి చైర్మన్ పదవి దక్కించుకునే పనిలో ఉంది. ప్రతిపక్ష పార్టీలు అధికార పార్టీ వైఫల్యాలను ఎండగడుతూ ప్రజలలోకి తీసుకెళ్లి విజయం సాధించే దిశగా అడుగులు వేస్తున్నాయి.

### రిజర్వేషన్లపై ఉత్కంఠ

మున్సిపాలిటీ చైర్మన్ పదవి, వార్డులలో రిజర్వేషన్ల కేటాయింపు ఎలా ఉంటుందో ఆశావాహులలో ఉత్కంఠ గలుగుతుంది. ప్రధానంగా చైర్మన్ పదవి రిజర్వేషన్ పై ప్రజలలో చర్చ జరుగుతుంది. బీసీ లేదా ఎస్సీ అని ,గత మహిళా జనరల్ కేటగిరి ఉంటుంది అని చర్చ జరుగుతుంది.


### యువత ఓటు కీలకం

యువత, కొత్త ఓటర్లు గెలుపు ఓటములపై నిర్ణయక శక్తిగా మారారు. ఈ మధ్య జరిగిన గ్రామపంచాయతీ ఎన్నికలలో యువత, విద్యార్థుల ఓటు గెలుపు ఓటములను నిర్ణయించింది. గెలుపు అవకాశము లేని చోట తమ ఓటింగ్ సరళితో గెలిపించి తమ సత్తా చాటుకున్నారు. మున్సిపాలిటీ వార్డులలో కొత్త ఓటర్లు ఎవరిని ప్రభావితం చేస్తారో చూడాలి.



# విపణి

# బేర్ పట్టు..



## ఐఫోన్ యూజర్లకు యాపిల్ అత్యవసర హెచ్చరిక

**న్యూఢిల్లీ:** ప్రముఖ టెక్ దిగ్గజం యాపిల్ తన ఐఫోన్ వినియోగదారులకు ఒక అరుదైన, ముఖ్యమైన భద్రతా హెచ్చరికను జారీ చేసింది. కొంతమంది వినియోగదా రులను లక్ష్యంగా చేసుకుని అధునాతనమైన 'స్పైవేర్' దాడులు జరుగుతున్నట్లు కంపెనీ గుర్తించింది. ఈ దాడులు ఎంత శక్తివంతమైనవంటే, సాధారణ సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ల ద్వారా కూడా వీటిని పూర్తిగా నిరోధించడం యాపిల్‌కు సవాలుగా మారింది. ఇవి సాధారణంగా మనం చూసే వైరస్‌లు లేదా ఫిషింగ్ లింక్‌ల వంటివి కావు. ఇవి 'జీరో-క్లిక్' సాంకేతికతను ఉపయోగిస్తాయి. అంటే, వినియోగదారు ఎటువంటి లింక్‌ను క్లిక్ చేయకపోయినా, ఏ అటాచ్‌మెంట్‌ను ఓపెన్ చేయకపోయినా.. కేవలం ఒక మెసేజ్ రావడం ద్వారా లేదా బ్యాక్‌గ్రౌండ్ ప్రాసెస్ ద్వారా ఫోన్ హ్యాక్ అయ్యే ప్రమాదం ఉంది. సాధారణంగా ఇవి జర్నలిస్టులు, రాజకీయ నాయకులు, దౌత్యవేత్తలు, కార్యకర్తలు, ఉన్నత స్థాయి అధికారులను లక్ష్యంగా చేసుకుని జరుగుతుంటాయి. ఈ దాడులకు సంబంధించిన విషయాలు యాపిల్ సంస్థకు కూడా తెలిసే అవకాశం ఉండకపోవచ్చు. అందుకే వీటిని ప్యాచ్ చేసేలోపే జరగాల్సిన నష్టం జరిగిపోవచ్చు. ప్రస్తుతం యాపిల్ తన అత్యంత సురక్షితమైన ఐఓఎస్ 26 వెర్షన్‌ను అందుబాటులోకి తెచ్చింది. అయితే, ఇది ఐఫోన్ 11, ఆపై మోడళ్లలో మాత్రమే అనుకూలంగా ఉంటుందని కొందరు చెబుతున్నారు. కీలకమైన సెక్యూరిటీ ప్యాచ్‌లు కేవలం ఐఓఎస్ 26లో మాత్రమే అందుబాటులో ఉంటాయి.

## నష్టాల్లో కొనసాగుతోన్న మార్కెట్లు

**ముంబయి:** దేశీయ స్టాక్ మార్కెట్లపై బేర్ పట్టు కొనసాగుతోంది. రష్యా చమురును దిగుమతి చేసుకునే దేశాలపై అమెరికా టారిఫ్‌లు ఎలా ఉంటాయన్న దానిపై అనిశ్చితి సూచీల సెంటిమెంట్‌ను దెబ్బతీస్తోంది. అటు కంపెనీల త్రైమాసిక ఫలితాల నేపథ్యంలో మదుపర్ల అప్రమత్తత మార్కెట్‌ను ఒత్తిడికి గురిచేస్తోంది. దీంతో సోమవారం నాటి సెషన్‌లో సూచీలు నష్టాల్లో కొనసాగుతున్నాయి. ఒక దశలో సెన్సెక్స్ 500 పాయింట్లకు పైగా పతనమవగా.. నిఫ్టీ 25,600 మార్క్‌ను కోల్పోయింది. ఉదయం 9.40 గంటల సమయంలో సెన్సెక్స్ (రావనిబవలీ) 419 పాయింట్లు దిగజారి 83,156 వద్ద, నిఫ్టీ 124 పాయింట్ల నష్టంతో 25,559 వద్ద ట్రేడ్ అవుతున్నాయి. డాలర్‌తో రూపాయి మారకం విలువ 5 పైసలు తగ్గి 90.23గా కొనసాగుతోంది. నిఫ్టీలో హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్, ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్, హిందాల్కో, ఏషియన్ పెయింట్స్, శ్రీరామ్ ఫైనాన్స్ రాణిస్తున్నాయి. మ్యాక్స్ హెల్త్‌కేర్, భారత్ ఎలక్ట్రానిక్స్, అపోలో హాస్పిటల్స్, ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్, బజాజ్ ఫైనాన్షియల్ సర్వీసెస్ షేర్లు ఒత్తిడికి గురవుతున్నాయి. లోహ రంగం మినహా అన్నిరంగాల షేర్లు నష్టాల్లో ఉన్నాయి.

## టీసీఎస్ లాభం రూ.10657 కోట్లు

**• డబుల్ డివిడెండ్ ప్రకటించిన కంపెనీ**

ఐటీ దిగ్గజం టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ సోమవారం త్రైమాసిక ఫలితాలను ప్రకటించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం అక్టోబర్- డిసెంబర్ త్రైమాసికానికి గానూ రూ.10,657 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది. గతేడాది ఇదే త్రైమాసికంలో రూ.12,380 కోట్లతో పోలిస్తే నికరలాభం 14 శాతం క్షీణించింది. సమీక్షా త్రైమాసికంలో ఆదాయం మాత్రం గతేడాది నమోదైన రూ.63,973 కోట్లతో పోలిస్తే 5 శాతం వృద్ధితో రూ.66,087 కోట్లకు చేరింది. అంతకు ముందు త్రైమాసికంలో రూ.12,075 కోట్లతో పోల్చినప్పుడు కూడా నికర లాభంలో 12 శాతం క్షీణత నమోదు కాగా.. ఆదాయం 2 శాతం మేర పెరిగింది. ఫలితాల సందర్భంగా కంపెనీ రెండు డివిడెండ్లు ప్రకటించింది. మూడో మధ్యంతర డివిడెండ్ కింద ఒక్కో షేరుకు రూ.11 చొప్పున చెల్లిస్తామని కంపెనీ వెల్లడించింది. అలాగే, స్పెషల్ డివిడెండ్ కింద ఒక్కో ఈక్విటీ షేరుకు రూ.46 చొప్పున చెల్లించేందుకు టీసీఎస్ బోర్డు ఆమోదం తెలిపింది. జనవరి 17వ తేదీని రికార్డు తేదీగా ప్రకటించగా.. ఫిబ్రవరి 3వ తేదీన చెల్లింపులు చేస్తామని పేర్కొంది. రాబోయే రోజుల్లోనూ వృద్ధి కొనసాగుతుందని టీసీఎస్ సీఈఓ, మేనేజింగ్ డైరెక్టర్ కె కృతివాసన్ పేర్కొన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ నుంచి వచ్చే ఆదాయం 17 శాతం వృద్ధి చెంది 1.8 బిలియన్ డాలర్లకు చేరిందని తెలిపారు. సమీక్షా త్రైమాసికంలో 9.3 బిలియన్ డాలర్ల విలువైన కొత్త ఆర్డర్లను గెలుచుకున్నట్లు చెప్పారు. టీసీఎస్‌లో ఉద్యోగుల సంఖ్య క్షీణించింది. డిసెంబర్ నాటికి గడిచిన మూడు నెలల్లో ఉద్యోగుల సంఖ్య 11,151 మేర తగ్గినట్లు కంపెనీ తన రెగ్యులేటరీ ఫైలింగ్‌లో పేర్కొంది. దీంతో మొత్తం ఉద్యోగుల సంఖ్య 5,82,163కు చేరింది. కొత్త లేబర్ కోడ్ వల్ల తమ ఆదాయంపై రూ.2128 కోట్ల మేర ప్రభావం పడిందని కంపెనీ పేర్కొంది. ఫలితాల నేపథ్యంలో టీసీఎస్ షేరు విలువ బీఎస్ఈలో 0.86 శాతం లాభంతో రూ.3235.70 వద్ద ముగిసింది.

## కొత్త డీమ్యాట్ ఖాతాల కళ తగ్గింది

హైదరాబాద్: కరోనా తర్వాత స్టాక్ మార్కెట్‌ను ముంచెత్తిన కొత్త డీమ్యాట్ ఖాతాల ప్రవాహానికి 2025లో అడ్డుకట్ట పడింది. గత కొన్నేళ్లుగా రికార్డు స్థాయిలో నమోదైన ఖాతాల వృద్ధి రేటు ఇప్పుడు నెమ్మదించింది. గతేడాది కొత్త డీమ్యాట్ ఖాతాల వృద్ధి రేటు గత ఆరేళ్లలో ఎన్నడూ లేనంత కనిష్ఠానికి పడిపోయింది. మార్కెట్లో చురుగ్గా లావాదేవీలు జరిపే వారి సంఖ్య కూడా క్రమంగా తగ్గుముఖం పడుతున్నట్లు గణాంకాలు పేర్కొంటున్నాయి. పసిడి, వెండి వైపు..: భారత ఈక్విటీ మార్కెట్లలో నెలకొన్ని అనిశ్చితి, కొత్త మదుపరులపై ప్రభావం చూపుతోంది. మరోవైపు బంగారం, వెండి మిలమిలా మెరుస్తూ లాభాలను పంచాయి. దీంతో మదుపరులు గోల్డ్ ఈటీఎఫ్‌లలో మదుపు చేసేందుకు ప్రాధాన్యం ఇచ్చారని యాంఫీ తాజా నివేదిక స్పష్టం చేసింది. వీటిన్నింటి ప్రభావంతో కొత్తగా ప్రారంభమయ్యే డీమ్యాట్ ఖాతాల వృద్ధి రేటు 2024తో పోలిస్తే 2025లో సగానికి పైగా పడిపోయింది. డిపాజిటరీల గణాంకాల ప్రకారం 2024లో దేశ వ్యాప్తంగా 4.60 కోట్ల కొత్త డీమ్యాట్ ఖాతాలు ప్రారంభం అయ్యాయి. 2025లో ఈ సంఖ్య కేవలం 3.06 కోట్లకు పరిమితమైంది. డిసెంబరు 31 నాటికి మొత్తం డీమ్యాట్ ఖాతాల సంఖ్య 21.6 కోట్లకు చేరుకుంది. వాస్తవానికి కరోనా తర్వాత స్మార్ట్‌ఫోన్ వినియోగం పెరగడం, ఖాతా ప్రారంభ ప్రక్రియ సులభతరం కావడంతో గడిచిన అయిదేళ్లలో డీమ్యాట్ ఖాతాలు నాలుగు రెట్లు పెరిగాయి. 2020లో డీమ్యాట్ ఖాతాల సంఖ్య సుమారు 5 కోట్లే కావడం గమనార్హం. గతేడాది భారత ఈక్విటీ మార్కెట్లు తీవ్ర హెచ్చుతగ్గులను చూశాయి. ముఖ్యంగా భారత్‌పై అమెరికా సుంకాలను విధించడంతో వాణిజ్య పరంగా ప్రతికూల పరిస్థితులు ఏర్పడ్డాయి.

### గుడ్ల ధరలు

| హైదరాబాద్ | వరంగల్ |
|---|---|
| ₹ 5.40 | ₹ 5.42 |

### బంగారం ధరలు (10 గ్రాములు)

హైదరాబాద్

| ₹ 1,30,300 (22 క్యారెట్లు) | ₹ 1,42,150 (24 క్యారెట్లు) |
|---|---|

### వెండి ధరలు (కేజీ)

హైదరాబాద్

₹ 2,87,000

## అమెజాన్ రిపబ్లిక్ డే సేల్..
### ఐకూ 15, వన్‌ప్లస్ 15పై డిస్కౌంట్స్



అమెజాన్ గ్రేట్ రిపబ్లిక్ డే సేల్ త్వరలో ప్రారంభం కానుంది. జనవరి 16న అందుబాటులోకి రానుంది. ఈ సేల్‌లో భాగంగా మొబైల్ ఫోన్లు, ట్యాబ్‌లు, టీవీలు, టీడబ్ల్యూఎస్ హెడ్‌సెట్స్‌పై ఆఫర్లు లభించనున్నాయి. తాజాగా మొబైళ్లపై ఆఫర్ వివరాలను అమెజాన్ రివీల్ చేసింది. వన్‌ప్లస్ 15, వన్‌ప్లస్ నార్డ్ 5, శాంసంగ్ గెలాక్సీ ఏ55, ఐకూ 15 ఫోన్లు ఈ జాబితాలో ఉన్నాయి. వన్‌ప్లస్ 15.. 12జీబీ+256జీబీ వేరియంట్ గతేడాది నవంబర్‌లో రూ.72,999కు లాంచ్ అయ్యింది. ఈ సేల్‌లో కార్డ్ ఆఫర్‌తో కలుపుకొని రూ.68,999కే విక్రయిస్తున్నట్లు కంపెనీ తెలిపింది. వన్‌ప్లస్ 15ఆర్‌ను రూ.44,999కు కొనుగోలు చేయొచ్చని తెలిపింది. వన్‌ప్లస్ నార్డ్ 5 రూ.30,999కు లభిస్తుంది. ఐకూ బ్రాండ్ నుంచి ఫ్లాగ్‌షిప్ ఫోన్ అయిన ఐకూ 15.. ఈ సేల్‌లో రూ.65,999కి లభిస్తుంది. దీన్ని గతేడాది నవంబర్‌లో రూ.72,999కి కంపెనీ లాంచ్ చేసింది. ఐకూ నియో 10 మోడల్‌ను రూ.33,999కి కొనుగోలు చేయొచ్చు. వీటితో పాటు ఐకూ నియో 10ఆర్ (రూ.24,999), ఐకూ జడ్ 10 (రూ.20,499), ఐకూ జడ్10ఆర్ (రూ.18,499), ఐకూ జడ్10 ఎక్స్ (రూ.13,499), ఐకూ జడ్ 10 లైట్ (రూ.9,999)ను తక్కువ ధరకే దక్కించుకోవచ్చని ఐకూ 'ఎక్స్'లో పేర్కొంది. అమెజాన్ సేల్‌లో శాంసంగ్ ఏ55 మోడల్ రూ.23,999కి లభించనుంది. శాంసంగ్ ఎం17 5జీ రూ.12,999కి ఆఫర్‌లో కొనుగోలు చేయొచ్చు. రియల్‌మీ నార్జో లైట్ 5జీ, రెడ్‌మీ ఏ4 5జీ, లావా బోల్డ్ ఎన్1 5జీ ఫోన్లపై ఆఫర్లు ఉన్నాయి. మరిన్ని ఆఫర్ల వివరాలు త్వరలో వెల్లడి కానున్నాయి. ఈ సేల్‌లో ఎస్‌బీఐ క్రెడిట్ కార్డు వినియోగదారులకు 10 శాతం డిస్కౌంట్ లభిస్తుంది.

## గూగుల్ సెర్చ్‌లో కొత్త సదుపాయం..
### వెతికిన చోటే షాపింగ్!

ఏదైనా వస్తువు కొనాలంటే దాని గురించి ఆరా తీసి, అది ఏ ఇ-కామర్స్ వెబ్‌సైట్‌లో దొరుకుతుందో వెతికి కొనుగోలు చేయడం చాలామందికి ఉన్న అలవాటు. మళ్లీ అక్కడ అడ్రస్ వివరాలు ఇచ్చి, చెల్లింపులు పూర్తి చేయాల్సి ఉంటుంది. ఇకపై వెతికిన చోటే కొనుగోలు చేసే విధంగా ప్రముఖ టెక్ దిగ్గజం గూగుల్.. కొత్త ఏఐషాపింగ్ టూల్‌ను లాంచ్ చేసింది. గూగుల్ సెర్చ్‌లోనే నేరుగా వస్తువులను కొనుగోలు చేసేందుకు ఈ టూల్ ఉపయోగపడుతుంది. వస్తువు ఎంపిక నుంచి కొనుగోలు వరకు అన్నీ అక్కడే పూర్తి చేయొచ్చన్నమాట. ఏఐ మోడ్‌లో గూగుల్ సెర్చ్, జెమినై యాప్‌లో బ్రౌజింగ్ సమయంలో యూజర్లు తమకు నచ్చిన వస్తువులను కొనుగోలు చేయొచ్చు. దీనికి యూనివర్సల్ కామర్స్ ప్రోటోకాల్ అని నామకరణం చేసింది. ఇందుకోసం షాపిఫై, వేఫెయిర్, టార్గెట్, వాల్‌మార్ట్ వంటి ఇ-కామర్స్ సంస్థలతో పాటు వీసా, మాస్టర్‌కార్డ్ వంటి సంస్థలతో గూగుల్ జట్టుకట్టింది. తొలుత అమెరికాలో ఈ సదుపాయాన్ని గూగుల్ తీసుకొచ్చింది. ఏదైనా ప్రొడక్ట్‌ను ఏఐ సెర్చ్ లేదా జెమినై యాప్‌లో సెర్చ్ చేసి.. అక్కడే గూగుల్ పే ద్వారా చెల్లింపులు చేయొచ్చు. గూగుల్ వాలెట్‌లో సేవ్ అయిన షిప్పింగ్ వివరాలు ఉపయోగించుకోవచ్చు. పేపాల్ వంటి ఇతర చెల్లింపు వ్యవస్థలను త్వరలో యాడ్ చేసే అవకాశం ఉంది. ఈ సదుపాయాన్ని ఇతర దేశాల్లోనూ గూగుల్ అందుబాటులోకి తీసుకురానుంది.

# ఇరాన్ ఆందోళనల్లో భారతీయుల అరెస్ట్?!



టెహ్రాన్(జనంసాక్షి):రాన్ అమెరికా మధ్య మాటల యుద్ధం జరుగుతోంది. ఆందోళనకారులను అణచివేస్తే చూస్తూ ఊరుకోబోమని, అవసరమైతే సైనిక చర్యకు దిగుతామని ట్రంప్.. తమ దేశ వ్యవహారంలో జోక్యం చేసుకుంటే అంతు చూస్తామంటూ ఖమేనీ సవాల్-ప్రతిసవాల్ విసురుకుంటున్నారు. అయితే ఆందోళనలతో ఇరాన్ నెత్తురోడుతున్న వేళ.. ఆ దేశంలోని ఇతర దేశాల పౌరుల భద్రతపై ఆందోళన నెలకొంది. ఇరాన్ సంక్షోభంలో మరణాలను అక్కడి ప్రభుత్వం తక్కువగా చూపెడుతోందంటూ మానవ హక్కుల సంఘాలు విమర్శిస్తున్నాయి. ఇప్పటిదాకా 548 మరణించారని.. అందులో 48 భద్రతా సిబ్బంది ఉన్నారని తెలుస్తోంది(హెచ్‌ఆర్‌ఏఎన్‌ఏ అనే అమెరికా మానవ హక్కుల సంఘం లెక్కల ప్రకారం). అలాగే 10 వేల మంది ఆందోళనకారుల్ని అరెస్ట్ చేశారని సమాచారం. అయితే.. అరెస్ట్ అయిన వాళ్లలో ఇతర దేశా పౌరులు ఉన్నట్లు పలు కథనాలు వైరల్ అవుతున్నాయి. నిరసనల్లో పాల్గొనకపోయినా.. కొందరి చేతులకు బేడీలు వేసి తీసుకెళ్తున్నట్లుగా దృశ్యాలు అందులో ఉన్నాయి. అందులో భారతీయులు, అఫ్గనిస్థాన్ జాతీయులు ఎక్కువగా ఉన్నట్లు ఆ ప్రచార సారాంశం. పైగా విదేశీ వ్యవహారాల శాఖ సంబంధిత పేర్లతో ఉన్న అకౌంట్లలో ఆ వీడియోలు పోస్టు కావడం గమనార్హం. దీంతో.. ఆ దేశంలో పనుల నిమిత్తం వెళ్లిన భారత పౌరులు.. విద్యార్థుల భద్రతపై ఢిల్లీ వర్గాలు ఆందోళన వ్యక్తం చేశాయి. అయితే.. భారత్‌లో ఇరాన్ రాయబారి మహ్మద్ ఫతాలి ఆ కథనాలను ఖండించారు. అలాంటిదేమీ.. ఇరాన్‌లోని భారతీయులతో సహా ఇతర దేశాల పౌరుల భద్రతకు వచ్చిన ముప్పేమీ లేదని స్పష్టత ఇచ్చారు. సోషల్ మీడియాలో జరిగిన ఫేక్ ప్రచారం ఆధారంగానే ఆ కథనాలు పుట్టుకొచ్చాయని అంటున్నారు. పుకార్లను నమ్మొద్దంటూ విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ మేరకు తన ఎక్స్ ఖాతాలో ఆయన క్లారిటీగా ఓ పోస్ట్ చేశారు. అయితే.. అటు ఇరాన్ ఈ తరహా కథనాలు మొదటి నుంచే ఖండిస్తోంది. ఇదంతా ఉద్దేశపూర్వకంగానే జరుగుతున్న కుట్ర అని ఆరోపించింది. ఇరాన్ నిరసనలను కొందరు విదేశీ నటులు.. మీడియా వక్రీకరిస్తున్నాయని.. తప్పుడు కథనాలు ప్రచారం చేస్తున్నాయని ఆరోపిస్తోంది.

**మన పిల్లలు సేఫ్!**

భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ లెక్కల ప్రకారం.. ఇరాన్‌లో 10,000 నుంచి 12,000 మంది భారతీయులు ఉన్నారు. ఇందులో పనుల నిమిత్తం వెళ్లేవాళ్లు, భారతీయ మూలాలు ఉన్నవాళ్లు కూడా ఉన్నారు. అయితే అక్కడికి భారత్ నుంచి అత్యధికంగా వెళ్లేది వైద్య విద్య అభ్యసించేందుకు వెళ్లే విద్యార్థులే. ఈ నేపథ్యంలో.. వాళ్ల భద్రతపై కుటుంబాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. అయితే.. వాళ్లు సురక్షితంగా ఉన్నారని ఆల్ ఇండియా మెడికల్ స్టూడెంట్స్ అసోసియేషన్ (ఎఐఎంఎస్ఏ), ఫెడరేషన్ ఆఫ్ ఆల్ ఇండియా మెడికల్ అసోసియేషన్స్ (ఈంఎఓం) ఒక ప్రకటన విడుదల చేసింది. ఈ విషయంలో భారత రాయబార కార్యాలయం, సీనియర్ అధికారులు పరిస్థితిని నిశితంగా గమనిస్తున్నారని.. విద్యార్థులతో, అక్కడి అధికారులతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నారని పేర్కొంది.




## ఔషధ కంపెనీలకు ఊరట

దిల్లీ: 'కొన్ని చిన్న ఉల్లంఘనల' విషయంలో ఫార్మాస్యూటికల్ కంపెనీలు ఇకపై కోర్టులకు హాజరు కానవసరం లేదని తాజాగా సవరించిన మార్గదర్శకాలను ఉటంకిస్తూ విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. దీనికి బదులు వారు షరతులకు లోబడి నగదు జరిమానా చెల్లించవచ్చు. అలాగే స్వీయ దిద్దుబాటు చర్యలు తీసుకోవచ్చు. 1940 నాటి డ్రగ్స్ అండ్ కాస్మటిక్స్ చట్టంతో పాటు వివిధ చట్టాల్లోని చిన్న నేరాలను డీక్రిమినలైజ్ చేశారు. వ్యాపారాన్ని సులభతరం చేయడం లక్ష్యంగా పెట్టుకున్న జన్ విశ్వాస్ చట్టం కింద ప్రవేశపెట్టిన డ్రగ్స్ అండ్ కాస్మటిక్స్ (కాంపౌండింగ్ ఆఫ్ అఫెన్సెస్) 2025 ద్వారా మార్గదర్శకాల్లో మార్పులు తెచ్చారు. ఈ చట్టం దేశంలో మందులు, కాస్మటిక్స్, వైద్య పరికరాల భద్రత, సామర్థ్యం, నాణ్యతను నిర్ధారిస్తుంది. ఈ చట్టాన్ని సక్రమంగా పాటించకపోతే విచారణకు దారి తీయవచ్చు. అయితే న్యాయ వ్యవస్థపై ఎక్కువ భారం పడకుండా చిన్న, సాంకేతిక ఉల్లంఘనలను పరిష్కరించాల్సిన అవసరాన్ని గుర్తించి, నేరాలను సమ్మిళితం చేయడానికి సెక్షన్ 32బి ప్రవేశపెట్టారు. కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ కింద పని చేస్తున్న సెంట్రల్ డ్రగ్స్ స్టాండర్డ్ కంట్రోల్ ఆర్గనైజేషన్ (సీడీఎస్‌సీఓ) 'నేరాల సమ్మేళనం' అనే కొత్త ప్రక్రియను వివరిస్తూ, డ్రగ్స్ అండ్ కాస్మటిక్స్ (నేరాల సమ్మేళనం) నిబంధనలు 2025ను రూపొందించింది. అయితే వీటిల్లో జరిమానా మొత్తం ఎంతనేది పేర్కొనలేదు. అలాగే నేరాలను కూడా వెల్లడించలేదు.

## ఓటర్ల జాబితా డిజిటలైజేషన్‌లో లోపాలు

ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌కు లేఖ రాశారు. ఎస్ఐఆర్ మొదలు సీఈసీకి దీదీ లేఖ రాయడం ఇది ఐదోసారి. కృత్రిమ మేధ ఆధారంగా 2002 నాటి ఓటర్ల జాబితా డిజిటలైజేషన్ చేపట్టారు. అయితే, ఈ పక్రియ సందర్భంగా ఓటర్ల వివరాల్లో తీవ్ర తప్పిదాలు చోటుచేసుకున్నాయి. ఇది కాస్తా పెద్దఎత్తున డేటా మిస్‌మ్యాచ్‌కు దారితీసింది. దీంతో నిజమైన ఓటర్లు ఈ సమస్య బారిన పడ్డారు. ఓటర్ల జాబితా సవరణలకు సంబంధించి గత రెండు దశాబ్దాలుగా అనుసరించిన విధానాలను ఎన్నికల సంఘం పక్కనపెట్టింది. దీంతో ఓటర్లు తమ గుర్తింపును మళ్లీ నిరూపించుకోవాల్సి వస్తోంది. ఈసీ తన సొంత పద్ధతులను విస్మరించడం.. ఏకపక్షం, అహేతుకం, రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం. ఎస్ఐఆర్ సమయంలో సమర్పించిన పత్రాలకు సరైన రసీదు ఇవ్వడం లేదు. ఈ పక్రియలోనే లోపం ఉంది. ఎస్ఐఆర్ విచారణ పక్రియ సైతం చాలావరకు యాంత్రికంగా, సాంకేతిక డేటా ఆధారంగానే కొనసాగుతోంది. సున్నితత్వం, మానవీయతను పట్టించుకోవడం లేదు. ఇది మన ప్రజాస్వామ్య, రాజ్యాంగ విలువలను దెబ్బతీస్తోందని మమతా బెనర్జీ తన లేఖలో పేర్కొన్నారు. ఇదిలా ఉండగా.. బెంగాల్‌లో ఎస్ఐఆర్‌లో భాగంగా 58 లక్షల మంది పేర్లను ఈసీ తొలగించిన విషయం తెలిసిందే.

## నిరసనల వేళ నో ఇంటర్నెట్..
### ఇరాన్ 'కిల్ స్విచ్' వాడిందా..?






ఇరాన్‌లో రెండువారాలకుపైగా నిరసనలు జరుగుతున్నాయి. ఇరాన్ కరెన్సీ రియాల్ విలువ దారుణంగా పడిపోవడం, జీవన వ్యయాలు పెరగడం వంటి సమస్యలతో ప్రజల ఆందోళనలు హింసాత్మకంగా మారాయి నిరసనకారుల్ని కట్టడి చేసేందుకు ఇరాన్ ప్రభుత్వం ఇంటర్నెట్‌పై నిషేధం విధించింది. దాంతో కోట్లాదిమంది ప్రజలు డిజిటల్ సేవలకు దూరమయ్యారు. దీంతో చాలామంది స్టార్‌లింక్ సేవల్లోకి మారుతున్నారు. దానిద్వారా చిత్రాలు, వీడియోలు బయట ప్రపంచానికి చేరుతున్నాయి. ఇప్పుడు ఆ సేవల్లో కూడా తీవ్ర అంతరాయం ఏర్పడిందని ఇరాన్ వైర్ మీడియా సంస్థ వెల్లడించింది. స్టార్‌లింక్ శాటిలైట్లను జామ్ చేసేందుకు ఆ దేశ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీ బృందం కిల్ స్విచ్ వాడిందని అంతర్జాతీయ నిపుణులు అంచనా వేస్తున్నారు. అత్యంత ఖరీదైన మిలిటరీ గ్రేడ్ జామింగ్ పరికరాలను ఉపయోగించారని చెబుతున్నారు. ఆ సాంకేతికతను రష్యా లేక చైనా సరఫరా చేసి ఉండొచ్చని అనుమానిస్తున్నారు. ఇరాన్‌పై అమెరికా, పశ్చిమ దేశాలు, సొంత ప్రజల నుంచి వ్యతిరేకత వ్యక్తమవుతోంది. దాంతో జనవరి 8 నుంచి ఇంటర్నెట్ బ్లాకౌట్ కొనసాగుతోంది. 2022లో 'మాసా అమిని'(పోలీసు కస్టడీలో ప్రాణాలు కోల్పోయిన యువతి) నిరసనల్లో ఇరాన్‌లో తొలిసారి ఎలాన్ మస్క్‌కు చెందిన స్టార్‌లింక్ వినియోగం ప్రారంభమైంది. తర్వాత నుంచి దాని యూజర్ల సంఖ్య పెరుగుతూ వస్తోంది. అక్కడ 40వేల నుంచి 50వేల వరకు ఆ యూజర్లు ఉన్నట్లు అంచనా. కొన్నినెలల క్రితం ఇజ్రాయెల్, యూఎస్‌ఏతో చోటుచేసుకున్న ఉద్రిక్తతల నేపథ్యంలో స్టార్‌లింక్, ఇతర శాటిలైట్ సేవలను నిషేధించేలా గూఢచర్య వ్యతిరేక చట్టాన్ని తీసుకువచ్చింది. ఆ సేవలను వినియోగించిన వారికి ఆరు నెలల నుంచి రెండేళ్ల వరకు జైలుశిక్ష విధించేలా చట్టాన్ని కఠినతరం చేసింది. మియాన్ గ్రూప్ డిజిటల్ రైట్స్ అండ్ సెక్యూరిటీ డైరెక్టర్ అమిర్ రషిది మాట్లాడుతూ.. "ఇలాంటి అంతరాయాన్ని 20 ఏళ్లలో ఎన్నడూ చూడలేదు. ఇది అత్యంత అధునాతన సాంకేతికత" అని వెల్లడించారు. ఈ కిల్ స్విచ్ శాటిలైట్ సేవల్లోనే గాకుండా దేశవ్యాప్తంగా మొబైల్ కమ్యూనికేషన్‌ను దెబ్బతీస్తోందని, పౌరుల ఆరోగ్యానికి ముప్పుగా మారుతోందని ఇజ్రాయెల్ జర్నలిస్టు ఎమిలీ ఆందోళన వ్యక్తంచేశారు. జామర్ ఎలా పనిచేస్తుందంటే..? డిజిటల్ సేవల్లో వాడే ఫ్రీక్వెన్సీలను తొలుత జామర్ గుర్తిస్తుంది. తర్వాత ఆ ఫ్రీక్వెన్సీల్లోనే బలమైన రేడియో సిగ్నళ్లను ప్రసారం చేస్తుంది. జామర్ పంపే సిగ్నళ్లు బలంగా ఉండటం వల్ల ఫోన్లు, ఇతర గాడ్జెట్లు దానినే ఎంచుకుంటాయి. దాంతో కమ్యూనికేషన్‌కు అంతరాయం ఏర్పడతుంది. సిగ్నల్ బార్స్ కనిపించవు. దాంతో ఏ డిజిటల్ సేవను పొందలేము. 2014 నుంచి మిలిటరీ ఆపరేషన్లలో ముఖ్యంగా ఉక్రెయిన్‌లో జీపీఎస్ జామింగ్‌ను రష్యా ఉపయోగిస్తోంది. దాంతో నావిగేషన్, డ్రోన్ ఆపరేషన్లకు అంతరాయం ఏర్పడుతోంది. 2022లో ఉక్రెయిన్‌పై సైనికచర్య చేపట్టిన తర్వాత అమెరికా సరఫరా చేసిన జీపీఎస్, స్టార్‌లింక్‌తో లింక్ అయిన వ్యవస్థలను అడ్డుకుందని అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. మరోవైపు చైనా యాంటీ జీపీఎస్ టెక్నాలజీపై భారీగా పెట్టుబడులు పెట్టింది. భారీస్థాయిలో జామింగ్ సామర్థ్యాన్ని కలిగిఉందని పేర్కొన్నాయి. ఇదిలా ఉంటే.. ఇరాన్ నిరసనకారులకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నుంచి గట్టిమద్దతు లభిస్తోంది. నిరసనకారుల్ని ఇరాన్ అణచివేయడాన్ని ఆయన తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. తాము సైనికంగా జోక్యం చేసుకునే అంశాన్ని పరిశీలిస్తున్నామని హెచ్చరించిన సంగతి తెలిసిందే. అలాగే ఇరాన్ ఇంటర్నెట్ సేవలను తిరిగి పునరుద్ధరించేందుకు తాను మస్క్‌తో మాట్లాడాలని అనుకుంటున్నట్లు చెప్పారు. ఈ కిల్ స్విచ్ దాడిని తట్టుకొని మస్క్ సంస్థ ఇంటర్నెట్ సేవలను అందించగలదో లేదో చూడాలి.

## టోల్‌ప్లాజాల వద్ద కొనసాగుతున్న రద్దీ..
### వాహనదారుల ఆగ్రహం!

**యాదాద్రి భువనగిరి(జనంసాక్షి):** సంక్రాంతి పండుగ నేపథ్యంలో జాతీయ రహదారి- 65పై వాహనాల రద్దీ కొనసాగుతోంది. సంక్రాంతికి ఇప్పటికే లక్షలాదిగా పట్నంవాసులు ఏపీకి తరలి వెళ్లారు. ఇవాళ రాత్రి వరకు కూడా వాహనాల రద్దీ కొనసాగే అవకాశం ఉంది. లక్షలాదిగా వాహనాలు ఏపీ వైపు వెళ్లడంతో టోల్ ప్లాజా నిర్వాహకులకు సైతం భారీగా ఆదాయం వస్తోంది. మరోవైపు.. ఆదాయం వస్తున్నా పంతంగి, కొర్లపహాడ్ టోల్ ప్లాజా నిర్వాహకులు సరైన ఏర్పాట్లు చేయలేదని వాహనదారులు మండిపడుతున్నారు.



# వెంకటేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహిస్తాం

- అధికారులు సమన్వయంతో ఏర్పాట్లు చేయాలి
- రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

**కరీంనగర్ జిల్లా బ్యూరో, జనవరి 12 (జనంసాక్షి) :** కరీంనగర్ మార్కెట్ రోడ్డు లోని శ్రీ లక్ష్మీ, పద్మావతి సమేత వేంకటేశ్వర స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలను ఈ ఏడాది మరింత వైభవంగా నిర్వహిస్తామని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఈనెల 23 నుండి 30వ తేదీ వరకు నిర్వహించనున్న బ్రహ్మోత్సవాల సన్నాహక సమావేశం జిల్లా కేంద్రంలోని మార్కెట్ రోడ్డు వెంకటేశ్వర స్వామి ఆలయంలో సోమవారం జరిగింది. ఈ సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ... వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలను ఈ సంవత్సరం మరింత వైభవంగా ఉత్సవాలు నిర్వహిస్తామని అన్నారు. బ్రహ్మోత్సవాల సమయంలో భక్తులు ప్రశాంతంగా స్వామి వారి దర్శనం చేసుకునేలా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించారు. రాజకీయాలకు అతీతంగా ఈ వేడుకలు నిర్వహిస్తున్నామని, పార్టీలతో సంబంధం లేకుండా ప్రజాప్రతినిధులంతా బ్రహ్మోత్సవాల్లో పాల్గొనాలని కోరారు. గతేడాది మాదిరిగానే స్వామివారి సేవకు ముందుకు వచ్చి విరాళాలు సమర్పిస్తున్న దాతలకు ధన్యవాదాలు తెలిపారు. బ్రహ్మోత్సవాల సమయంలో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా బందోబస్తు నిర్వహించాలన్నారు. భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తూ వేడుకలు నిర్వహించాల్సిన బాధ్యత జిల్లా అధికారులపై ఉందని అన్నారు. సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి మాట్లాడుతూ... వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహిస్తామని తెలిపారు. ఆలయ అధికారులతో వివిధ శాఖలు సమన్వయం చేసుకుంటూ భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేయాలని సూచించారు. బ్రహ్మోత్సవాలకు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామివారి ఆశీస్సులు పొందాలని సూచించారు.



జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ... వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం అన్ని చర్యలూ తీసుకుంటుందని తెలిపారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తూ స్వామివారి ఉత్సవాలకు ఏర్పాట్లు చేయాలని అన్నారు. నిరంతర విద్యుత్ సరఫరా, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ కోసం అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. వైద్య శిబిరం ఏర్పాటు చేయడంతో పాటు ఆలయ పరిసరాల్లో శానిటేషన్, క్లీనింగ్ సమస్యలు రాకుండా చూస్తామన్నారు. ఈ సందర్భంగా పలువురు దాతలు బ్రహ్మోత్సవాల నిర్వాహణకు విరాళాలను ప్రకటించారు. ఈ సమావేశంలో ఆర్డీవో మహేశ్వర్, కరీంనగర్ కోపరేటివ్ అర్బన్ బ్యాంక్ చైర్మన్ కర్రె రాజశేఖర్, అడిషనల్ డీసీపీ వెంకటరమణ, ఆలయ చైర్మన్లు చకిలం శ్రీనివాస్, చకిలం గంగాధర్, ఏసీపి వెంకటస్వామి, ఈవో సుధాకర్ పాల్గొన్నారు.

# తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలను కాపాడింది కేసీఆర్

## రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్



**గోదావరిఖని, (జనంసాక్షి):** తెలంగాణ రాష్ట్ర ఉద్యమ మహానేత తొలి సీఎం కెసిఆర్ గారి పదేళ్ల పాలనలో తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలకు పెద్దపీట వేశారని వారి హయాంలోనే మహిళల సంక్షే మం జరిగిందని, ఆడబిడ్డలను కంటికి రెప్పలా కాపాడిన ఘనత కెసిఆర్ గారికి దక్కుతుందని, రాబోవు కాలంలో కేసీఆర్ పాలన రావాలని సంక్రాంతి పండుగ నాడు జై తెలంగాణ జై కేసీఆర్ అంటూ మహిళమణులంతా ముగ్గులు పెట్టాలని రామగుండం మాజీ శాసనసభ్యులు టిఆర్ స్ పార్టీ జిల్లా అధ్యక్షులు కోరుకంటి చందర్ గారు పిలుపునిచ్చారు. సోమవారం గోదావరిఖని పట్టణం జిఎం కాలనీ మైదానంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో సంక్రాంతి పండుగ సందర్భంగా ముగ్గుల పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...పదేళ్ల కెసిఆర్ పాలనలో మహిళలకు బతుకమ్మ పండుగ సందర్భంగా బతుకమ్మ చీరలు, పెద ఆడబి డ్డలకు పెళ్లిళ్లకు కళ్యాణ లక్ష్మి పథకం ద్వా రా లక్ష నూటపదహార్లు అందించింది కేసీ ఆర్ అన్నారు. మహిళ సంక్షేమానికి కేసీఆర్ హాయంలోనే జరిగిందన్నారు. సంక్రాంతి పండుగ సందర్భంగా ఇంటి మహిళలు ముందు జై తెలంగాణ జై కేసీఆర్ అంటూ ముగ్గులు వేయాలని కోరారు. అనంతరం ముగ్గుల పోటిల్లో విజయం సాధించిన మహిళలకు బహుమతులు అందించారు. మెదటి బహుమతి పద్మకు 10 వేలు, రెండ వ బహుమతి దుర్గం రేణుక కు 5 వేలు మూడవ బహుమతి దివ్యకు 3 వేలు ముగ్గుల పోటీల్లో పాల్గోన్న 100 మంది మహిళలు చీరాలను మాజీ ఎమ్మెల్యే కోరు కంటి చందర్ గారు అందించారు. ఈ కార్యక్రమం లో కౌశిక హరి మూల విజయ రెడ్డి పాముకుంట్ల భాస్కర్ కుమ్మరి శ్రీనివాస్ కల్వచర్ల కృష్ణ వేణీ జనగామ కవిత సరోజిని నారాయణదాసు మారుతి వడ్డెపల్లి శంకర్ , అచ్చే వేణు, జక్కుల తిరు పతి , నీరటి శ్రీనివాస్ , పిల్లి రమేష్, చల్లా రవీందర్ రెడ్డి , నూతి తిరుపతి, రంగ జ్యోతి, భాను ప్రసాద్, ఇరుగురాళ్ల శ్రావన్ , చింటూ, కిరన్ జీ, నిమ్మరాజుల సాగర్, గుర్రం పద్మ , తదితరులు పాల్గొన్నారు.

# మాట ఇచ్చాం.. మార్పు చూపిస్తున్నాం..!

- అభివృద్ధి విషయంలో రాజి పడే ప్రసక్తి లేదు
- రాష్ట్ర ఐటీ పరిశ్రమ శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు
- మంథని పట్టణంలో రూ. 50 కోట్లకుపైగా నిధులతో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు



**మంథని, (జనంసాక్షి) :** ఎన్నికల సమయంలో ఇచ్చిన మాట ప్రకారం మంథని నియోజకవర్గంలో మార్పు తీసుకువచ్చామని.. అభివృ ద్ధి విషయంలో రాజీ పడే ప్రసక్తి లేదని రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు అన్నారు. మంథని పట్టణ అభివృద్ధి కొరకు సుమారు 50 కోట్లకు పైగా నిధులను మంత్రి మంజూరు చేయించగా.. సోమవారం సదరు అభివృద్ధి పనులకు జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షతో కలిసి మంత్రి శ్రీధర్ బాబు శంకుస్థాపనలు చేశా రు. అందులో కూచిరాజుపల్లి స్కూల్ వద్ద 4 కోట్ల 50 లక్షలతో నిర్మించబోతున్న ఆర్అండ్ బీ అతిథి గృహానికి శంకుస్థాపన చేయను న్నారు. ఆర్ అండ్ బి రోడ్డు కూచిరాజుపల్లి స్కూల్ వద్ద 60 లక్షలతో నిర్మించబోతున్న మున్నూరు కాపు సంఘం కమ్యూనిటీ హాల్ శంకు స్థాపన చేయనున్నారు. ఆర్ అండ్ బి రోడ్డు కూచిరాజుపల్లి స్కూల్ వద్ద 10 లక్షలతో నిర్మించబోతున్న కూచిరాజుపల్లి బస్టాండ్ శంకు స్థాపన, 10 లక్షలతో నిర్మించబోతున్న శ్రీరామ్ నగర్ బస్టాండ్ శంకుస్థాపన (భూమి పూజ) చేశారు. ఆర్ అండ్ బి రోడ్డు కూచిరా జుపల్లి వద్ద 30 లక్షలతో నిర్మించబోతున్న ఈద్గా నిర్మాణానికి శంకు స్థాపన చేశారు. బోయినపేట నుండి గంగపురి మీదికి 9 కోట్ల 30 లక్షలతో (6.00o3.30) నిర్మించబోతున్న బ్రిడ్జి నిర్మాణానికి శంకు స్థాపన చేశారు. ఆర్ అండ్ బి పెద్దపల్లి రోడ్డు వద్ద నూతన కమ్యూని టీ హాల్ వద్ద 20 లక్షలతో నిర్మించబోతున్న గంగాపురిలోని గౌతమి మేషన్ సంఘం (తాపి మేస్త్రి సంఘం) నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఓడేడు రోడ్డు గంగాపురి వద్ద 10 లక్షలతో నిర్మించబోతున్న బస్ స్టాండ్ కు భూమి పూజ చేశారు. ఓడేడు రోడ్డు గంగాపురిలో 20 లక్షలతో నిర్మించబోతున్న ఎస్సీ కమ్యూనిటీ హాల్, ఎంపీపీఎస్ స్కూల్ కాంపౌండ్ వాల్ నిర్మాణాలకు శంకుస్థాపన, 45 కోట్ల 15 లక్షలతో నిర్మించబోతున్న ఏటీసీ (అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్స్) ల్యాండ్ విసిటిఒగ్ చేశారు. ఆర్ అండ్ బి భారత్ పెట్రోల్ బంక్ వద్ద 30 లక్షలతో నిర్మించబోతున్న మల్లెపూల పోచమ్మ, నల్ల పోచమ్మ దేవాలయాలకు సుందరీకరణ, కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. వీటితోపాటు పలు అభివృద్ధి పనుల శంకుస్థాపనలో సోమవారం మంత్రి శ్రీధర్ బాబు బిజీబిజీగా గడిపారు. ఈ కార్యక్రమంలో మంథని ఆర్డిఓ సురేష్, పలు శాఖల డివిజన్ స్థాయి అధికారులు, మండల స్థాయి అధికారులు, కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు, అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# అట్రాసిటీ కేసుల్లో బాధితులకు సత్వర న్యాయం చేయాలి

- అట్రాసిటీ కేసులు త్వరితగతిన పరిష్కరించాలి
- జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు వడ్డేపల్లి రాంచందర్



**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి జనవరి 12 (జనంసాక్షి):** ఎస్సీ అట్రాసిటీ కేసుల్లో బాధితులకు సత్వర న్యాయం చేయాలని జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు వడ్డేపల్లి రాంచందర్ అధికారులను ఆదేశించారు.జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు వడ్డేపల్లి రాంచందర్ సోమవారం వేములవాడకు రాగా ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్,ఎస్పీ మహేష్ బి గీతే, ఏఎస్పీ రుత్విక్ సాయి పుష్ప గుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. భీమేశ్వర ఆలయ సమీపంలోని అతిథి గృహంలో ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి గీతే, ఏఎస్పీ రుత్విక్ సాయి, ఎస్సీ సంక్షేమ శాఖ అధికారులతో జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు వడ్డేపల్లి రాంచందర్ వివిధ పథకాలు, అట్రాసిటీ కేసులు తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. అనంతరం అయన మాట్లాడుతూ ఎస్సీ అట్రాసిటీ కేసుల్లో ఎంక్వైరీ వేగంగా పూర్తి చేసి చార్జీ షీట్ వేస్తే బాధితులకు న్యాయంతో పాటు ప్రభుత్వ నిబంధనల మేరకు పరిహారం అందుతుందన్నారు.ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.జిల్లాలో ఎస్టీ పథకాల ప్రయోజనాలు అందిపుచ్చుకునేలా అవగాహన కల్పించాలన్నారు. వారి సమస్యలను జిల్లా యంత్రాంగానికి తెలియజేసేలా చూడాలని ఆదేశించారు. జిల్లాలోని ఎస్సీ సంక్షేమ హాస్టళ్లలో ఎంత మంది విద్యార్థులు చదువుతున్నారు, మెనూ, అంబేద్కర్ ఓవర్సీస్ విదేశీ విద్యా నిధి, కులాంతర వివాహాలకు ప్రోత్సాహకంపై ఆరా తీశారు. కులాంతర వివాహాలకు ఇటీవల ఇద్దరికి రూ 2 లక్షల 50 వేల ఫిక్స్ బాండ్ లు అందజేశామని, అంబేద్కర్ ఓవర్సీస్ విదేశీ విద్యా నిధి కింద ఎనిమిది మంది విద్యార్థులకు ఒక్కొకరికి రూ 20 లక్షల చొప్పున మొత్తం రూ 1కోటి 80 లక్షలు లబ్ధిదారులకు అందిం చామని, అన్ని ఎస్సీ సంక్షేమ రెసిడెన్షియల్ విద్యాల యాల్లో ప్రభుత్వ మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం పెడుతున్నామని, కాస్మొటిక్ చార్జెస్, యూనిఫాం, బుక్స్ అందిస్తున్నామని ఇంచార్జి కలెక్టర్ అగ్రవాల్ తెలిపారు.

**భీమేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు..**

జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు వడ్డేపల్లి రాంచందర్ కుటుంబ సమేతంగా భీమేశ్వర ఆలయానికి చేరుకోగా, ఆలయ అర్చకులు స్వస్తితో స్వాగతం పలికారు. స్వామి వారికి ప్రత్యేక పూజలు చేయగా,ఆలయ అర్చకులు వేదోక్త ఆశీర్వచనం చేయాగ ఆలయ ఈవో రమాదేవి స్వామివారి ప్రసాదాలు అందజేశారు.అనంతరం బద్ది పోచమ్మ అమ్మవారికి పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ రమాదేవి, ఏఎస్పీ రుత్విక్ సాయి, వేములవాడ ఆర్డీఓ రాధాభాయ్,తహసీల్దార్ విజయ ప్రకాశ్ రావు,ఇన్చార్జి ఎస్సీ సంక్షేమ అధికారి రవీందర్ రెడ్డి, ఏఎస్ డబ్ల్యూఓ విజయలక్ష్మి పాల్గొన్నారు.

# మున్సిపల్ ఎన్నికల్లో గులాబీ జండానే ఎగురుతుంది

- కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్
- ఈ నెల 19న కరీంనగర్‌కు కేటీఆర్
- బీఆర్ఎస్ సన్నాహక సమావేశంలో నేతల పిలుపు



**కరీంనగర్ జిల్లా బ్యూరో, జనవరి 12 (జనంసాక్షి) :** రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్‌తో పాటు చొప్పదండి, హుజురాబాద్, జమ్మికుంట మున్సిపాలిటీల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను ఘన విజయం వైపు నడిపించాలని మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. కరీంనగర్ 'చింతకుంట' బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో జిల్లా ముఖ్య నేతలతో నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 19న కరీంనగర్‌లో జరిగే సర్పంచుల సమావేశానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరుకానున్న నేపథ్యంలో పార్టీ కార్యాచరణ పై చర్చించారు. అనంతరం మీడియాతో గంగుల కమలాకర్ మాట్లాడుతూ... గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో కరీంనగర్, జమ్మికుంట, హుజురాబాద్, చొప్పదండిలో గత 45 ఏళ్లలో జరగని అభివృద్ధి జరిగిందన్నారు. అభివృద్ధి పనులే ఎన్నికల్లో తమ ఆయుధమని, ప్రజలను ఓట్లు అడిగే నైతిక హక్కు బీఆర్ఎస్‌కే ఉందని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఇంత కాలమైనా చెప్పుకోదగిన అభివృద్ధి జరగలేదని విమర్శించారు. మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ మాట్లాడుతూ... మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తా ఏంటో మరోసారి నిరూపించాలని అన్నారు. ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి మాట్లాడుతూ... ఇటీవల స్థానిక ఎన్నికల్లో ఊహించిన దానికంటే మెరుగైన ఫలితాలు వచ్చాయని, అదే జోరు మున్సిపల్ ఎన్నికల్లో కొనసాగించాలని పిలుపునిచ్చారు. మాజీ ఎమ్మెల్యేలు రసమయిబాలకిషన్, వి. సతీష్ కుమార్, సుంకే రవి శంకర్, మాజీ ఎమ్మెల్సీ నరదాసు లక్ష్మణ్ రావు, కరీంనగర్ బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు జి.వి. రామకృష్ణ రావు, మాజీ జడ్పీ చైర్మన్ తుల ఉమ, మాజీ ఎస్సీ కార్పోరేషన్ చైర్మన్ బండ శ్రీనివాస్, మాజీ జడ్పీచైర్మన్ తుల ఉమ, నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, పొన్నం అనిల్‌లతో పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# రోడ్డు కబ్జా యత్నంపై ఎమ్మెల్యేకు ఫిర్యాదు

**ఆర్మూర్, జనవరి 12 (జనంసాక్షి):** ఆర్మూర్ పట్టణంలోని పెర్కిట్ కుక్కల గుట్ట వద్దగల నందీశ్వర కాలనీలో జాపూ భూమన్న అనే వ్యక్తి 33 ఫీట్ల రోడ్డున ఆక్రమించి ఇంటి నిర్మాణానికి యత్ని స్తున్నాడని కాలనీవాసులు ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డికి ఫిర్యాదు చేశారు. ఆర్మూర్ మున్సిపల్ కార్యాలయంలో అదనపు కలెక్టర్ అంకిత్, మున్సిపల్ కమిషనర్ శ్రావణి లతో సమీక్ష జరుగుతుం డగా సోమవారం కాలనీవాసులు ఎమ్మెల్యేను కలిసి ఫిర్యాదు చేశారు. పెర్కిట్ లోని నందీశ్వర కాలనీలో సర్వేనెంబర్ 480/2ఈ లో ప్లాట్ నెంబర్ 2 పక్కన 33 ఫీట్ల రోడ్డు ఉంది. ఈ రోడ్డును కబ్జా చేసుకుని భూమన్న అనే వ్యక్తి ఇంటి నిర్మాణానికి యత్ని స్తున్నాడని చెప్పారు. దారిపై పెద్ద పెద్ద బండరాళ్లు వేసి మట్టితో రోడ్డును మూసివేయడంతో రాకపోకలు నిలిచిపోయాయని చెప్పారు. బండ రాళ్లు వేసి మట్టితో మూసివేసిన రోడ్డును తిరిగి పునరు ద్ధరించాలని వారు కోరారు. కాలనీలోని మురికి కాలువలు మట్టితో పూడుకొని పోయినందున పారిశుద్ధ్య కార్మికులతో శుభ్రం చేయిం చాలన్నారు.



అదేవిధంగా కాలనీలో స్తంభాలు లేకపోవడంతో చీక టిమయంగా ఉన్నందున విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేయాలని వారు కోరారు. రోడ్డు స్థలాన్ని కబ్జాకు యత్నిస్తున్న వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇందులో మున్సిపల్‌డిఈ భరత్ ఉన్నారు.

# స్మార్ట్ ఫోన్ కాదు స్మార్ట్ మనస్సును తయారు చేసుకోండి

- వైఫై కాదు విల్ పవర్ పెంచుకోండి
- జాతీయ యువజన దినోత్సవంలో యువతకు కేంద్ర మంత్రి బండి సంజయ్ పిలుపు
- కేంద్ర మంత్రి చేతుల మీదుగా పలువురికి స్పోర్ట్స్ కిట్స్ అందజేత




**కరీంనగర్ జిల్లా బ్యూరో, జనవరి 12 (జనంసాక్షి) :** మీరంతా స్మార్ట్ ఫోన్ కే పరిమితం కావొద్దు. స్మార్ట్ మనస్సును తయారు చేసుకోండి అని వైఫై కాదొ విల్ పవర్ పెంచుకోండి, ప్రశ్నించే ధైర్యాన్ని నింపుకోండి ...అన్యాయం జరిగితే ఎదిరించే శక్తి పెంచుకోండి. మీ కోసం, మీ కుటుంబం కోసం కాకుండా దేశం కోసం పనిచేయాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ యువతకు పిలుపునిచ్చారు. భారత దేశ ఖ్యాతిని ఖండాంతారాలు దాటించడమే కాకుండా భారతీయ సమాజాన్ని జాగృతం చేసిన మహనీయుడు స్వామి వివేకానంద అని, నిరాశలో ఉన్న యువతను తట్టి లేపేందుకు ఆయన చెప్పే మాటలు యువతకు తారక మంత్రంగా పనిచేస్తాయన్నారు. స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని మేరా యువ భారత్ ఆధ్వర్యంలో కరీంనగర్ లోని కళాభారతిలో జాతీయ యువజన దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. బండి సంజయ్ తోపాటు జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, జిల్లా యువజన అధికారి రాంబాబు, జిల్లా స్పోర్ట్స్ అధికారి శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి బండి సంజయ్ చేతుల మీదుగా పలువురికి 'స్పోర్ట్స్ కిట్లు అందజేశారు. అంతకుముందు బండి సంజయ్ చేసిన ప్రసంగంలోని ముఖ్యాంశాలు భారత దేశ ఖ్యాతిని ఖండాంతారాలు దాటించిన వ్యక్తి. భారతీయ సమాజాన్ని జాగృతం చెయ్యడమే కాకుండా యోగ, వేదాంత శాస్త్రాలను ప్రపంచ వ్యాప్తం చేసిన మహనీయుడు స్వామి వివేకానంద. నిరాశలో ఉన్న యువతను తట్టి లేపేందుకు ఆయన చెప్పే మాటలు మనకు ఎప్పటికీ తారక మంత్రంగా పనిచేస్తాయి. నీ వెనుకాల ఏముంది.. ముందేముంది అనేది నీకు అనవసరం. నీలో ఏముంది అనేది ముఖ్యం. మందలో ఒకరిగా ఉండొద్దు. వందలో ఒకరిగా ఉండడానికి ప్రయత్నించండి. అంటూ స్వామి వివేకాంద చెప్పిన మాటలు యువతలో ప్రత్యేకతను వెలికి తీసేందుకు పనికొస్తాయన్నారు. ఇనుప కండరాలు, ఉక్కు నరాలు, వజ్ర సంకల్పమున్న యువతను 100 మందిని ఇవ్వండి. ఈ దేశ తలరాతనే మార్చేస్తానంటూ స్వామి వివేకానంద చెప్పిన మాటలను చూస్తే భారతీయ యువత శక్తి సామర్థ్యాల మీద ఆయనకు ఎంత గట్టి నమ్మకం ఉందో అర్ధం చేసుకోవాలి. మీరంతా స్మార్ట్ ఫోన్ కాదొస్మార్ట్ మనస్సును తయారు చేసుకోండి వైఫై కాదొ విల్ పవర్ పెంచుకోండి మీలో ప్రశ్నించే ధైర్యాన్ని నింపుకోండిని అన్యాయం జరిగితే ఎదిరించే శక్తి పెంచుకోండి. నీ కోసం కాదు, దేశం కోసం బతికే ఆలోచనను మనసునిండా నింపుకోండి. ఎందుకంటే ఈ దేశానికి బలహీనులు కాదని బలవంతులు కావాలని చరిత్ర సృష్టించే వారిగా మారండి. యువత అభివృద్ధి, సంక్షేమం, క్రీడల కోసం మోదీజీ ప్రత్యేకంగా ద్రుష్టి పెట్టారు. యూపీఏ పాలనలో క్రీడా బడ్జెట్ 1640 కోట్లు మాత్రమే, పాలనలో నేడు క్రీడల కోసం 3,794 కోట్ల రూపాయలు కేటాయించారు. మోదీ ప్రత్యేక ద్రుష్టి పెట్టడంవల్లే ఒలింపిక్స్, కామన్ వెల్త్, ఏసియన్ గేమ్స్‌లో అనేక పతకాలను సాధిం చగలిగామని, ఉద్యోగాల విషయానికొస్తే ఒక్క ఏడాదిలోనే 10 లక్షల మందికి అవినీతి, పైరవీలకు ఆస్కారం లేకుండా మెరిట్ ద్వారా ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించారు. స్టార్టప్ ఇండియా, స్టాండప్ ఇండియా పేరుతో యువతను పారిశ్రామికవేత్తలుగా, వ్యాపార వేత్తలుగా, ఐటీ యజమానులుగా తీర్చిదిద్దుతున్నారు. గత 10 ఏళ్లలో స్టార్టప్ ఇండియా ద్వారా 1 లక్షా 59 వేల 157 మంది సొంతంగా స్టార్టప్ లు స్థాపిస్తామని కేంద్రం వద్ద దరఖాస్తు చేసుకోవడమే కాకుండా ఇప్పటి వరకు 10 లక్షల మందికిపైగా ప్రత్యక్షంగా ఉద్యోగాలు కల్పించారు. ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన ద్వారా గత పదేళ్లలో 1 కోటి 70 లక్షల మందికి స్కిల్ డెవలెప్ మెంట్ కోర్సుల్లో శిక్షణనందించారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించారని కేంద్ర మంత్రి బండి సంజాయ్ కుమార్ తెలిపారు.

## జేఎన్టీయూ కళాశాలలో

# సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తా



## ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్

**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి జనవరి 12 (జనంసాక్షి):** వేములవాడ అర్బన్ మండలం అగ్రహారంలోని జేఎన్టీయూ కళాశాలను సోమవారం ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కళాశాలలోని తరగతి గదులను,క్యాంటిన్, ల్యాబ్ ను పరిశీంచరు. అనంతరం విప్ మాట్లాడుతూ గతంలో విద్యార్థులు ఇబ్బందులు పడితే వెంటనే ఆ సమస్యను పరిష్కరించడం జరిగిందన్నారు.గతంలో డిగ్రీ కళాశాల సందర్శించినపుడు బాలికలు హాస్టల్ కావాలంటే వెంటనే రూ 10 కోట్లు మంజూరు చేశామన్నారు.హాస్టల్ నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు.కళాశాల ఏర్పాటు కేవలం పేపరుకు మాత్రమే పరిమితమైందని,గత ప్రభుత్వం కళాశాలలో ఎలాంటి వసతులు కల్పించలేదన్నారు. ప్రతి రోజు విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం పెట్టాలని ప్లాస్టిక్ వాడకం తగ్గించాలని స్టీల్ వాడకం పెంచాలని కోరారు.త్వరలోనే ప్రభుత్వం కళాశాలకు అన్ని వసతులతో పక్క భవనం నిర్మాణం చేస్తమన్నారు.గెస్టు ఫ్యాకలిటీ, ఫ్యాకలిటీల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని,విద్యార్థులకు నాణ్యమైన భోజనం మెనూ ప్రకారం అందించాలన్నారు. ఫైనల్ ఇయర్ విద్యార్థులకు అకాడమీ ద్వారా ఉచిత కోచింగ్ ఇవ్వడానికి ఏర్పాట్లు చేస్తున్నమన్నారు. విద్యార్థులు కళాశాల నుండి బయటకు ఉద్యోగంతో వెళ్ళేలా ఏర్పాట్లు చేస్తమన్నారు.జేఎన్టీయూ విద్యార్థులు కోరిన వాటిని సిఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని,ప్రభుత్వం విద్యా విధానంలో పెను మార్పులు తీసుకొస్తున్నారన్నారు.రాష్ట్రంలో విద్యార్థులకు స్కిల్ యూనివర్సిటీ,స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేస్తున్నమన్నారు.మన ప్రాంతంలో రుద్రంగిలో ఆడ్వాస్ టెక్నాలజీ సెంటర్ ఏర్పాటు చేస్తున్నమని,వేములవాడ నియోజకవర్గంలో రూ 200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ మంజూరు కావడం జరిగిందన్నారు. రాష్ట్ర బడ్జెట్ లో సుమారు 8 శాతం విద్యావిధానానికి కేటాయించారని గుర్తు చేశారు.విద్యార్థులు చక్కగా చదువుకొని తల్లిదండ్రుల పేరు నిలబెట్టాలన్నారు. అయన వెంట జేఎన్టీయూహెచ్ వైస్ ఛాన్సలర్ కిషన్ కుమార్ రెడ్డి,రిజిస్టర్ కే వేంటేశ్వరరావు,ప్రిన్సిపాల్ వేణుగోపాల్, సిబ్బంది పాల్గొన్నారు.

# రాష్ట్ర ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం ఎన్నో పథకాలు అమలు

- ప్రజల జీవితాల్లో కనిపించే మార్పే నిజమైన అభివృద్ధి
- మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, దామోదర రాజనర్సింహ





**చేవెళ్ల,జనవరి 12 (జనంసాక్షి):** రాష్ట్ర ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం ఎన్నో పథకాలు ప్రవేశపెట్టి అమలు చేస్తుం దని, ప్రజల జీవితాల్లో కనిపించే మార్పే నిజమైన అభివృద్ధి అని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహా అన్నారు. చేవెళ్ల మున్సిపాలిటీలలో పలు అభివృద్ధి కార్యక్రమాలలో భాగంగా రాష్ట్ర వైద్య, ఆరోగ్య, శాస్త్ర సాంకేతిక శాఖ మంత్రి దామోదర రాజన ర్సింహ, రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి, స్థానిక శాసనసభ్యులు కాలే యాదయ్య, తాండూర్ ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి, చేవెళ్ల పట్టణం లో పలు అభివృద్ధి పనులకు రూ.15 కోట్లు, మండల కేంద్రం లో 100 పడకల రూ.17.5 కోట్ల నిధులతో నూతన ఆసు పత్రి భవనముకు శంకుస్థాపన చేశారు. అనంతరం ఆరోగ్య శాఖ మంత్రి ఆసుపత్రిలో తిరిగి సందర్శించారు. అనంతరం చేవెళ్ల పట్టణంలోని కే.జీ.ఆర్ ఫంక్షన్ హాల్ లో నిర్వహించిన చేవెళ్ల నియోజక వర్గం నూతన సర్పంచులకు సన్మాన కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమా టోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, స్థానిక శాసనసభ్యులు కాలే యాదయ్య,తాండూర్ ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి పాల్గొని, సర్పంచులకు శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా మంత్రి వెంకటరెడ్డి మాట్లా డుతూ... పేదల సంక్షేమం కోసం ఎన్నో పథకాలను రాష్ట్ర ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం ఎన్నో పథకాలు ప్రవేశ పెట్టి అమలు చేస్తుందని మంత్రి కోమటిరెడ్డి స్పష్టం చేశారు. పది సంవత్సరాలు బిఆర్ఎస్ హయాంలో ఒక్క రేషన్ కార్డు కూడా ఇచ్చిన దాఖలాలు లేవని ఎద్దేవా చేశారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు సంవత్స రాలలో అర్హులైన వారందరికీ రేషన్ కార్డులు పంపిణీ చేయ డం జరిగిందని తెలిపారు. రేషన్ కార్డులతో పాటు, మహిళ లకు బస్సులో ఉచిత ప్రయాణం మహాలక్ష్మి పథకం, ఇల్లు లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా నాలుగు సంవత్సరాలలో 20 లక్షల ఇళ్లు నిర్మించాలని ప్రభుత్వం సంకల్పించిందని పేర్కొన్నారు. మహాలక్ష్మి పథకం కింద మహిళల ఉచిత బస్సు ప్రయాణం కింద రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థకు ప్రభుత్వం రూ.10 వేల కోట్లు ఇవ్వడం జరిగిందని స్పష్టం చేశారు. నిరుపేదలు ప్రతినెల 800 నుంచి 1000 కరెంటు బిల్లు చెల్లించే వారిని ప్రస్తుతం 200 యూనిట్ల లోపు వారందరికీ ఉచిత కరెంటు సరఫరా చేస్తున్నందున 50వేల కుటుంబాలకు లబ్ధి చేకూరిందని తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో 42శాతం అమలు చేస్తామని అన్నారు. వచ్చే ఎంపీటీసీ, జెడ్పీటీసీ మండలాధ్యక్షులు జిల్లా పరిషత్ చైర్మన్ల ఎన్నికలకు తప్పనిసరిగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇచ్చి తీరుతామని మంత్రి స్పష్టం చేశారు. ఈ నెలాఖరులోగా మున్సిపాలిటీ ఎన్నికల నోటిఫికేషన్ వెలబడు తుందని మున్సిపల్ ఎన్నికలు పూర్తి అవగానే రిజర్వేషన్ల సమస్య కూడా కొలిక్కి వస్తుందని ఆ తర్వాత ఎంపీటీసీ, జడ్పీ టీసి ఎన్నికలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. దాదాపు మార్చి లోపు ఎన్నికలు పూర్తి చేస్తామన్నారు. వైయస్సార్ బాటలోనే ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దివంగత నేత వైయస్ రాజశేఖర్ రెడ్డి బాటలోనే ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి కృషి చేస్తు న్నాడని మంత్రి కోమటిరెడ్డి స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా రోడ్ల అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.11,300 కోట్లను కేటాయించడం జరుగుతుందని తెలిపారు. జాతీయ రహదా రులకు ప్రత్యామ్నాయంగా రాష్ట్ర జిల్లా మండల గ్రామీణ రోడ్ల అభివృద్ధి కోసం ఈ నిధులు వెచ్చించడం జరుగుతు ందని తెలిపారు. ఇందులో రూ.300 కోట్లు కేవలం చేవెళ్ల నియోజకవర్గానికి కేటాయించడం జరిగిందని తెలిపారు. చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య వారానికి మూడుసార్లు తన వద్దకు వస్తాడని తన నియోజకవర్గంలో రోడ్ల అభివృద్ధికి నిధులు కేటాయించాలని కోర్తాడని, ఇలాంటి ప్రజాసేవ కలిగిన నాయకుడు మీ నియోజకవర్గానికి నాయకుడుగా ఉండడం అదృష్టం అన్నారు. గతంలో బిఆర్ఎస్ హయాంలో పేదల అభివృద్ధి పట్టించుకోలేదని ప్రస్తుతం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిరంతరం రాష్ట్ర అభివృద్ధి కోసం కృషి చేస్తున్నాడని అన్నారు. రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో 90% సీట్లు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు గెలుపొందడం ఖాయమని మంత్రి వెంకట్ రెడ్డి స్పష్టం చేశారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారాన్ని కూడా రంగారెడ్డి జిల్లాలోని చేవెళ్ల నుంచే ప్రారం భించినట్లు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమాలలో జిల్లా గ్రంధా లయ చైర్మన్ ఏలుగంటి మధుసూధన్ రెడ్డి, చింపుల సత్యనా రాయణ రెడ్డి, మల్గారీ జనార్ధన్ రెడ్డి, సొసైటీ మాజీ చైర్మన్ లు దేవర వెంకట్ రెడ్డి, గోనె ప్రతాప్ రెడ్డి, డీసీసీ ఉపా ధ్యక్షుడు బండారు ఆగి రెడ్డి, మాజీ సర్పంచ్ లు శైలజ ఆగి రెడ్డి, మండల మహిళా అధ్యక్షురాలు దేవర సమత, మార్కెట్ కమిటీ చైర్మన్ పెంటయ్య గౌడ్, వైస్ చైర్మన్ రాములు, కాలే శ్రీకాంత్, మంగలి బాల్ రాజ్, మండల సర్పంచ్ ల సంఘం శ్రీనివాస్ గౌడ్, మధుసూదన్ గుప్తా, మద్దెలచింటు, నియోజ కవర్గం ప్రజాప్రతినిధులు, అధికారులు, మా జీప్రజాప్రతి నిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# గొలుసు కట్టు నాలాపై చేపట్టిన అక్రమాన్ని తొలగించండి

## అక్రమ నిర్మాణానికి అనుమతులు ఇచ్చిన అధికారులను బర్తరఫ్ చేయండి

### సిపిఎం డిమాండ్



**శేరిలింగంపల్లి, జనవరి 12 (జనంసాక్షి) :** శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధి చందానగర్ ప్రాంతంలో గొలుసుకట్టు నాలాపై వెలుస్తున్న అక్రమ నిర్మాణాన్ని తక్షణమే కూల్చివేసి దానిని నిర్మూలించాలని సిపిఎం శేరిలింగంపల్లి జోన్ కార్య దర్శి చల్లా శోభన్ తదితరులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం శేరిలింగంపల్లి చందానగర్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జోన్ కార్యదర్శి చెల్లా శోభన్ తదితరులు మాట్లాడుతూ మియాపూర్ సర్కిల్ చందానగర్ ప్రాంతం పరిధి చందానగర్ పోలీస్ స్టేషన్ సమీపంలో గొలుసుకట్టు నాలాను ఆక్రమించి, దానిపై స్లాబును ఏర్పాటు చేసి ఏకంగా ఓ భారీ భవనాన్ని నిర్మిస్తున్న తీరు గర్హనీయమని, తక్షణమే దానిని కూల్చివేయాలని డిమాండ్ చేశారు. చందానగర్ పరిధి పరిసర ప్రాంతాల వర్షపు నీటి సరఫరాకు, చెరువునీటి సరఫరాకు ప్రధాన వనరుగా ఉన్న గొలుసు కట్టు నాలాను దిగమింగి దానిపై స్లాబ్ ను ఏర్పాటు చేసి దానినానుకొని భవనాన్ని నిర్మిస్తున్న వైనాన్ని దుర్మార్గమైనదిగా, ఇది ఓవైపు అక్రమ నిర్మాణదారుడి బరితెగింపుకు నిదర్శనం కాగా మరోవైపు చందానగర్ సర్కిల్ పట్టణ ప్రణాళిక విభాగం అధికారుల అవినీతికి, ఉదాసీనతకు పరాకాష్టగా చల్లా శోభ న్ అభివర్ణించారు. రానున్న వర్షాకాలంలో చెరువులు, వాగులు, వంకలు, కుంటలు నిండిపోయి మిగిలిన నీరు చందానగర్ పరిసర ప్రాంతాల నుండి తరలి వెళ్లడానికి, లోతట్టు ప్రాంతాలు నీట మునగకుండా ఉండడానికి ఈ గొలుసు కట్టనాల ఎంతో కీలకమైన భూమికను పోషిస్తుం దని, ఇలాంటి బృహత్తర నాలాను మింగేస్తున్న అక్రమా ర్కులను పెంచి పోషిస్తున్న సర్కిల్ టౌన్ ప్లానింగ్ అధికారులు ముమ్మాటికి అవినీతిపరులేనని, ఇలాంటి అధికారులను ఒక్క క్షణంకూడా ఉపేక్షించకుండా బర్తరఫ్ చేయడంతోపాటు ఆ నిర్మాణాన్ని తొలగించడానికి అయ్యే ఖర్చును సైతం బాధిత అధికారుల నుండే వసూలు చేయాల్సిన అవసరం ఉందని వారు డిమాండ్ చేశారు. తక్షణమే స్పందించి చందానగర్ సర్కిల్ అధికారులు గొలుసుకట్టునాల అక్రమాన్ని నిరోధిం చకపోతే ప్రజా పోరాటానికి సిద్ధంగా ఉండాలని సవాలు విసిరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జోన్ కార్యవర్గ సభ్యులు వి. మాణిక్యం, కె. కృష్ణ, ఎన్. వరుణ్ పాల్గొన్నారు.

# అదిలాబాద్ పాఠశాల విద్యాశాఖతో స్మైల్ ఫౌండేషన్ ఎంఓయూ



**ఖైరతాబాద్, జనవరి 12 (జనంసాక్షి) :** 2002 నుండి విద్య, సాధికారతకు అంకితమైన ప్రముఖ భారతీయ అభి వృద్ధి సంస్థ అయిన స్మైల్ ఫౌండేషన్, తెలంగాణ ప్రభుత్వం లోని ఆదిలాబాద్‌లోని పాఠశాల విద్యా శాఖతో ఒక అవగాహన ఒప్పందం పై సంతకం చేసిందని స్మైల్ ఫౌండే షన్ సీనియర్ డైరెక్టర్ (ప్రోగ్రామ్స్) సుశాంత కుమార్ భూయాన్, స్మైల్ ఫౌండేషన్ సీనియర్ మేనేజర్ ఎం.కిషోర్ సోమవారం నగరంలో విడుదల చేసిన ఒక ప్రక టనలో పేర్కొన్నారు. వారు మాట్లాడుతూ ఈ వ్యూ హాత్మక భాగస్వామ్యం రాష్ట్ర ఆకాంక్షాత్మక, గిరిజన జిల్లాల్లో ఒకటైన ఆదిలాబాద్‌లో ప్రభు త్వ విద్య పంపిణీని బలోపేతం చేయడానికి నిర్మాణాత్మక జిల్లా-స్థాయి సహకారాన్ని ఏర్పరుస్తుందని తెలిపారు.

# మిగతా పట్టుబడ్డ గంజాయి ఏమైంది..?

## జిల్లా కలెక్టర్, ఎక్సైజ్ కమిషనర్ విచారణ జరిపించాలి



**ఆర్మూర్, జనవరి 12 (జనంసాక్షి):** ఆర్మూర్ పట్టణంలోని పెర్కిట్ వద్ద ఎక్సైజ్ పోలీసులు నిర్వహించిన తనిఖీ లో పట్టుబడ్డ గంజాయి 2 కిలోల ని సాక్షాత్తు సిఐ అంజిత్ రావు ఎమ్మెల్యేతో చెప్పారు.ఆర్మూరు పట్టణంలోని రైతు వేదిక వద్ద సోమవారం ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి గంజాయి పట్టుబడ్డ విషయ మై వార్తలు వస్తుండడంతో సీఐ అంజిత్ రావుకు ఫోన్ చేసి వివరాలు అడిగి తెలుసు కున్నారు. పెర్కిట్ వద్ద పట్టుబడ్డ గంజాయి ఎంత అని ప్రశ్నించగా సిఐ అంజిత్ రావు రెండు కిలోలని చెప్పడం విశేషం. అయితే పట్టుబడ్డ నలుగురి వద్ద 1200 గ్రాముల గంజాయి పట్టుబడినట్లు ఎక్సైజ్ పోలీసులు కేసు నమోదు చేశారు. మిగతా పట్టుబడ్డ 800 గంజాయి ఏమైందనే ప్రశ్న ప్రస్తుతం తలెత్తుతుంది. ఈ విషయమై విలేకరులు సిఐ అంజిత్ రావు కు ఫోన్ చేయగా లిఫ్ట్ చేయడం లేదు.ఎమ్మెల్యే మాట్లాడుతూ గంజాయి సరఫరా చేసే వారి పై ఎక్సైజ్ చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశిం చారు.తిరిగి గంజాయి ఆర్మూర్ లో సరఫరా కాకుండా చూడాలన్నారు.ఎక్సైజ్ అధికారు లు కఠినంగా చర్యలు తీసుకొని గంజాయి సరఫరా కాకుండా నివారించాల న్నారు. పట్టుబడిన గంజాయిలో 800 గ్రాములు ఏమైందనే ప్రశ్నకు ఎక్సైజ్ సీఐ అంజిత్ రావు సమాధానం చెప్పాల్సి ఉంది. ఈ విషయమై జిల్లా కలెక్టర్, ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ విచారణ జరిపి వాస్తవాలు వెల్లడించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

# గొప్ప కళా ఖండాల కేంద్రం ఆర్ట్స్ ఎగ్జిబిషన్

## రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జీ. చిన్నారెడ్డి



**హైదరాబాద్, (జనంసాక్షి) :** గొప్ప కళా ఖండాల కేంద్రం ఆర్ట్స్ ఎగ్జిబిషన్ అని, కళాకారుల ప్రతిభ స్లాఘనీయమని రాష్ట్ర ప్రణాళిక సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జీ. చిన్నారెడ్డి అన్నారు. సోమవారం నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో ఎగ్జిబిషన్ సొసైటీ ఆధ్వ ర్యంలో నిర్వహించిన ఆర్ట్ గ్యాలరీని చిన్నారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా చిన్నా రెడ్డి మాట్లాడుతూ కళాకారులు దూర దృష్టితో, సూక్ష్మ పరిశీలనతో రూపొందించిన ఆర్ట్ ప్రతి ఒక్కరి హృదయాలను చవిచూస్తుందని పేర్కొన్నారు. గత 84 సంవత్సరాలుగా క్రమం తప్పకుండా ప్రతి ఏడాది ఎగ్జిబిషన్ సొసైటీ ఆర్ట్స్ ఎగ్జిబిషన్ ను నిర్వహిస్తుండడం గొప్ప విషయమని చిన్నారెడ్డి అభినందించారు. కళాకారులు రూపొందించిన ఆర్ట్స్ ను చిన్నారెడ్డి సందర్శించారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిబిషన్ సొసైటీ కార్యదర్శి రాజేశ్వర రావు, ఉపాధ్యక్షులు మార్గం అశ్విన్, ఆర్ట్ ఎగ్జిబిషన్ కమిటీ కన్వీనర్ దేవుల పల్లి హను మంతరావు, హైదరాబాద్ ఆర్ట్ సొసైటీ అధ్యక్షులు ఎం.వీ. రమణారెడ్డి, పాల్గొన్నారు.

# అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తాం





- పేదల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం
- పెద్దపల్లి ఎమ్మెల్యే సిహెచ్ విజయరమణ రావు

**పెద్దపల్లి జనవరి 12 (జనంసాక్షి):** పెద్దపల్లి పట్టణంలోని 6,7,8,9, 12,26,27,28,29 వార్డుల్లో అర్హులైన లబ్ధిదారుల ఇందిరమ్మ ఇండ్ల నూతన నిర్మాణాలకు స్థానిక నాయకులతో కలిసి సోమవారం భూమి పూజ శంకు స్థాపనలు చేసి వారికి ఇళ్ల మంజూరు పత్రాలను పంపిణీ చేసిన పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు..ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే విజయరమణ రావు మాట్లాడుతూ. అర్హులం దరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామని పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. పెద్దపల్లి పట్టణంలో పలు వార్డులో అర్హులైన వారికి ఇందిరమ్మ ఇండ్ల నూతన నిర్మాణాలకు భూమి పూజ వారందరికీ మంజూరు పత్రాలు అందజేయడం జరిగిందని అన్నారు. పెద్దపల్లి పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. అభివృద్ధి, సంక్షేమం అజెండాగా ముందుకు వెళుతున్నట్లు పేర్కొన్నారు. రానున్న మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. అనంతరం పెద్దపల్లి పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద మరియు బందంపల్లి రాజీవ్ రహదారి వద్ద నూతన హై మాక్స్ లైట్స్ ను ఎమ్మెల్యే ప్రారంభోత్సవం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ ఆకుల వెంకటేష్, మున్సిపల్ అధికారులు, మాజీ కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, పలు వార్డుల ప్రజలు పాల్గొన్నారు...

## ఐకియా వద్ద రోడ్డు కుంగిన రోడ్డు

# ఐదు రోజులు ట్రాఫిక్ మళ్లింపు



**శేరిలింగంపల్లి, జనవరి 12 (జనంసాక్షి) :** శేరిలింగంపల్లి నియోజకవర్గం మాదాపూర్ డివిజన్ పరిధి మాదాపూర్ సైబర్ గేట్ వద్ద రోడ్డు కుంగిపోవడంతో సోమవారం ఐకియా నుంచి సైబర్ టవర్స్, జేఎన్‌టీయూ వైపు వెళ్లే వాహనాల రాకపోకల్లో అంతరాయం కలుగుతూ ట్రాఫిక్ రద్దీ ఏర్పడింది. ఈ నేపథ్యంలో జిహెచ్ఎంసి పరిధి సంబంధిత విభాగాల అధికా రులు ఘటన స్థలానికి చేరుకొని మరమ్మతు పనులను కొనసాగిస్తున్నారు. ఈ క్రమంలో ఐటి కారిడార్ పరిధిలో ట్రాఫిక్ సజావుగా కొనసాగేందుకు మాదాపూర్ ట్రాఫిక్ పోలీసులు తాత్కాలికంగా ప్రత్యామ్నాయ మార్గాలు సూచిస్తున్నారు. రానున్న ఐదు రోజుల పాటు ఐకియా నుంచి సైబర్ టవర్స్, జేఎన్‌టీయూ వైపు వెళ్లే వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాలు లేదా సూచించిన డైవర్షన్‌ను అనుసరించాలని పోలీసులు తెలియజేస్తున్నారు. సూచించారు. డైవర్షన్‌లో భాగంగా ఐకియానుంచి వచ్చే వాహనాలను లెమన్ ట్రీ హొటల్ వద్ద, రాయదుర్గం మెట్రో స్టేషన్ వద్ద ఎడమ వైపు మళ్ళించడం జరిగింది. అలాగే టెక్ మహీంద్రా--సీఐఐ జంక్షన్ మార్గంగుండా సైబర్ టవర్స్ వైపు వాహనాల మళ్లింపు ఉంటుందని అధికారులు చెబుతున్నారు. ట్రాఫిక్ నియంత్రణలో భాగంగా ప్రయాణికులు పోలీసులకు సహకరించి, సూచించిన మార్గాలను అనుసరించి రాకపోకలు సాగించాలని మాదాపూర్ ట్రాఫిక్ పోలీసులు విజ్ఞప్తి చేశారు.

# నోటీసుకి గడువివ్వకుండానే కూల్చివేస్తారా?

- ధితుడు భిక్షపతి ఆవేదన
- అధికారుల తీరుపై ఆగ్రహం
- ఎమ్మెల్యే ఒత్తిడితోనే కూల్చివేశారని ఆరోపణ



**కాప్రా, జనవరి 12 (జనంసాక్షి):** కాప్రా సర్కిల్ చర్లపల్లి డివి జన్ పరిధిలోని సాయికృష్ణ కాలనీలో మున్సిపల్ అధికారులు అత్యుత్సాహం ప్రదర్శించారని బాధితుడు భిక్షపతి ఆరోపిం చారు. ప్లాట్ నెంబర్ 104/1లో నిబంధనల ప్రకారమే తాను నిర్మాణం చేపడుతుంటే, అధికారులు అన్యాయంగా కాంపౌం డ్ వాల్‌ను కూల్చివేశారని ఆయన వాపోయారు. అన్నీ ఉన్నా అక్రమమా, బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. 2006 లో జీపీ లేఅవుట్‌లో ఈ ప్లాటును కొనుగోలు చేసి, ఎల్ఆర్ ఎస్ కూడా పూర్తి చేసుకున్నారు. ఇంటి నిర్మాణానికి అనుమ తి కోరుతూ దరఖాస్తు కూడా చేసుకున్నట్లు ఆయన తెలిపా రు. అయితే, జనవరి 1వ తేదీన నోటీసులు ఇచ్చి, వాటిని గోడకు అతికించిన అధికారులు.. తాను సమాధానం ఇచ్చేలో పే, ఈ నెల 7న అకస్మాత్తుగా వచ్చి కూల్చివేతలు చేపట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే ఒత్తిడి ఉందంటూ సర్కిల్ పరిధిలో అక్రమ నిర్మాణాలు యథేచ్ఛగా కొనసాగుతున్నా అధి కారులు పట్టించుకోవడం లేదని, కేవలం తన ప్లాటుపైనే ఎందుకు ప్రతాపం చూపుతున్నారని భిక్షపతి ప్రశ్నించారు. ఈ విషయమై టిపిఎస్ తుజ్జాసింగ్‌ను వివరణ కోరగా.. కాలనీ మాజీ అధ్యక్షుల ఫిర్యాదు మేరకు, ఎమ్మెల్యే నుంచి ఒత్తిడి రావడంతోనే కూల్చివేత చేపట్టినట్లు స్వయంగా ఆయ నే చెప్ప డం కొసమెరుపు. రాజకీయ వేధింపులతో సామాన్యు లను ఇబ్బందులకు గురిచేయడం ఎంతవరకు సమంజసమని ఆయ న అధికారులను నిలదీశారు. న్యాయబద్ధంగా రిజిస్ట్రేష న్, ఎల్ఆర్ఎస్ క్లియర్ అయిన తన ప్లాటులో కూల్చివేతలు చేప ట్టడంపై ఉన్నతాధికారులు స్పందించి న్యాయం చేయాలని ఆయన కోరుతున్నారు.

## ముక్కు మూసుకోవడం కాదు...

# ముక్కున వేలేసుకునేలా పని చేయండి


### శేరిలింగంపల్లి జెడ్సి హేమంత్ బోర్ఖడే



**శేరిలింగంపల్లి, జనవరి 12 (జనంసాక్షి) :** శేరిలింగంపల్లిలో శానిటేషన్ విభాగం అధికారులు జాగరూకతతో మరింత బాధ్యతగా పనిచేయాల్సిన అవసరం ఉందని, ప్రజలు శానిటేషన్ పట్ల ఎప్పుడు ఫిర్యాదు భావం తోనే ఉంటారని, ముక్కు మూసుకొని కాదు ముక్కున వేలేసుకునేలా శానిటేషన్ మెరుగుపడాల్సిన అవసరం ఉందని శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ హేమంత్ బోర్ఖడే స్పష్టం చేశారు. ఈ మేరకు సోమవారం వీళ్ళ సోమవారం అధికారులతో కలిసి శానిటేషన్ రివ్యూ మీటింగ్ ను శేరిలింగంపలి జోన్ మీటింగ్ హాల్‌లో నిర్వహించారు. ఈ సందర్భం గా మాట్లాడుతూ శేరిలింగంపల్లి జోన్ పరిధిలో ప్రధాన రహదారుల తోపాటు కాలనీలలో అంతర్గత రహదారులుసైతం పరిశుభ్రతకు నెలవుగా నిలవాలని శానిటేషన్ విభాగం అధికారులకు సూచించారు. ఓ వైపు శానిటేషన్ మెరుగుదల కోసం ప్రజలను చైతన్య పరుస్తూనే మరోవైపు సిబ్బందితో జోన్ పరిధిలోని ప్రతి ప్రాంతాన్ని పరిశుభ్రంగా ఉంచేలా వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు. ముక్కు మూసు కోవాల్సిన పరిస్థితులనుంచి ముక్కున వేలేసుకునేంత శుభ్రంగా, అందం గా రహదారులను తీర్చిదిద్దాలని ఇందుకు క్షేత్రస్థాయిలో చేపట్టే పారిశు ద్ధ్య చర్యలే అత్యంత ప్రధానమన్నారు. శేరిలింగంపల్లి జోన్ పరిధిలో శానిటేషన్ విభాగంలో చేపట్టాల్సిన విప్లవత్మక చర్యల గురించి, విన్నూ త్న కార్యక్రమాల గురించి జోనల్ కమిషనర్ అధికారులకు పలు సూచ నలు చేశారు. ప్రధానంగా పరిశుభ్రత చర్యలను ఏలా చేయాలో సూచిం చారు. ఐటీ పరిశ్రమలకు శేరిలింగంపల్లి జోన్ వేదికగా ఉన్నందున ఆ స్థాయిలోనే రహదారుల నిర్వహణ జరగాలని, క్షేత్రస్థాయిలో ఎప్పటికప్పుడు సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుంటూ మెరుగైన పరిస్థితులను సృష్టించడానికి ప్రతి ఒక్కరూ బాధ్యతతో ముందుకు సాగా లని సూచించారు. స్వీపింగ్ అనంతరం వెంటనే చెత్త కుప్పలు తొలగిం చాలని, ఫ్లై ఓవర్‌లపై మట్టి ఇసుక ఇతర వ్యర్థాలు లేకుండా పరిశు భ్రంగా ఉండేలా చూడాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. వివిధ సర్కిళ్ల ఉప కమిషనర్ స్థాయినుండి కిందిస్థాయి వరకు అధికా రులు క్షేత్రస్థాయిలో పారిశుద్ధ్య పనులను పకడ్బందీగా పర్యవేక్షించాలని, లోటు పాట్లను సవరించుకుంటూ చక్కని పరిసరాలు నెలకొనేలా చూడా లన్నారు. ప్రతి షాపు , కమర్షియల్ ఏరియా దుకాణాలలో డస్ట్ బిన్ ఏర్పాటు చేసేలా చూడాలని, దీనికోసం ఆయా షాపులకు, వాణిజ్య భవనాలకు ఈ నెల 15 తారీకును ఆఖరి రోజుగా నిక్కచ్చిగా తెలియజే యాలని తెలిపారు. సమీక్షా సమావేశానికి ఆయా సర్కిళ్ల డిప్యూటీ కమిషనరులు, ప్రశాంతి, శశిరేఖ, సురేష్, ప్రదీప్, ఎస్ డబ్ల్యూఎం ఎస్‌లు, ఎస్ఆర్పీలు, ఎస్ఎఫ్ఏలు, రాంకీ సిబంది హాజరయ్యారు.

# రంగారెడ్డి జిల్లాను హైదరాబాద్‌లో విలీనం చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధం

- చేవెళ్ల ఎంపీ కొండ విశ్వేశ్వర్ రెడ్డి, రంగారెడ్డి జిల్లా బిజెపి అధ్యక్షుడు పతంగి రాజ్ భూపాల్ గౌడ్
- రంగారెడ్డి జిల్లా విలీనానికి వ్యతిరేకంగా బీజేపీ మహాధర్నా



**రాజేంద్రనగర్, జనవరి 12( జనంసాక్షి):** రంగారెడ్డి జిల్లాను హైదరాబాద్ జిల్లాలో విలీనం చేయాలన్న రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదనకు వ్యతిరేకంగా భారతీయ జనతా పార్టీ రంగారెడ్డి జిల్లా ఆధ్వర్యంలో సోమ వారం రాజేంద్రనగర్ ఆరాంఘర్ చౌరస్తాలో భారీ మహాధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమం రాజేంద్ర నగర్ అసెంబ్లీ కన్వీనర్ పి.మల్లేష్ యాదవ్ అధ్యక్షతన జరిగింది. ఈ మహాధర్నాకు చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి, బీజేపీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు పంతంగి రాజ్ భూపాల్ గౌడ్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. వేలాదిగా తరలివచ్చిన బీజేపీ శ్రేణులు “హైదరాబాద్ వద్దు -- రంగారెడ్డి ముద్దు”, “ప్రజాభిప్రాయం లేకుండా విలీనం అప్రజా స్వామికం” అంటూ నినాదాలతో నిరసన తెలిపారు. ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ ప్రజాభిప్రా యం తీసుకోకుండా రంగారెడ్డి జిల్లాను హైదరాబా ద్‌లో విలీనం చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని, దీనివల్ల స్థానిక భూములు, ఉపాధి అవకాశాలు దెబ్బతింటాయని అన్నారు. జిల్లా ప్రత్యేక గుర్తింపును కాపాడేందుకు బీజేపీ తుదివరకు పోరాడుతుందని స్పష్టం చేశారు. జిల్లా అధ్యక్షులు పంతంగి రాజు భూపాల్ గౌడ్ మాట్లాడుతూ విలీనం తో గ్రామీణ, అర్ధపట్టణ ప్రాంతాల సమస్యలు మరు గున పడతాయని, ప్రజల స్వయం నిర్ణయ హక్కు హరించబడుతుందని విమర్శించారు. నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జ్ , కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రంగారెడ్డి జిల్లాను హైదరాబాద్‌లో విలీనం చేయాలన్న ప్రతిపాదన పూర్తిగా కక్షపూరితమైనది, ప్రజావ్యతిరేకమైన కుట్ర అని తీవ్రంగా విమర్శించారు. రాజేంద్రనగర్-- శంషాబాద్ , ఓఆర్ఆర్ పరిధిలోని మున్సిపాలిటీలను జీహెచ్ఎంసీలో కలపకుండా సైబరాబాద్‌లో గానీ, లేక ప్రత్యేక రంగారెడ్డి జోన్‌గా గానీ ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. విలీనం జరిగితే అధిక పన్నులు చెల్లిస్తున్న రాజేంద్రనగర్ వంటి నియోజకవర్గాల ఆదాయాన్ని, పన్నులు సరిగా చెల్లించని ప్రాంతాల అభివృద్ధికి మళ్లించేందుకు ప్రభుత్వం యత్నిస్తోందని ఆరోపించారు. నాలుగు సార్లు ఎమ్మెల్యేగా ప్రకాష్ గౌడ్‌ను గెలిపించిన ప్రజలకు ఈ ప్రభుత్వ నిర్ణయంపై స్పష్టమైన సమాధానం చెప్పాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే అని అన్నారు. ముఖ్యమంత్రి రాజేంద్రనగర్ నియోజక వర్గంపై కుట్ర పన్నుతున్నారని, ప్రజల విశ్వాసాన్ని ద్రోహం చేసేలా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ప్రజాభిప్రాయం తీసుకోకుండా, గ్రామసభలు నిర్వహి ం చకుండా తీసుకుంటున్న ఈ నిర్ణయం ప్రజా స్వామ్య విరుద్ధమని పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే ఈ విలీన ప్రతిపాదనను ఉపసంహరించుకోకపోతే బీజేపీ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరిం చారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అంజన్ కుమార్ గౌడ్, వై. శ్రీధర్, కొమురయ్య, మహాలింగం గౌడ్, మల్లారెడ్డి, శేఖర్ ముదిరాజ్, విజయ్ కుమార్, సూరెడ్డి వినయ్ రెడ్డి పాల్గొన్నారు.

జనంసాక్షి www.janamsakshi.org | మంగళవారం 13 జనవరి 2026




## ట్రైబల్ పోలీస్ బెటాలియన్‌ను బలోపేతం చేయండి

- డీజీపీ కార్యాలయంలో మంత్రి సీతక్క
- ట్రైబల్ పోలీస్ బెటాలియన్ సమస్యలపై కీలక భేటీ

**హైదరాబాద్ (జనంసాక్షి) :** ట్రైబల్ పోలీస్ బెటాలియన్‌ను బలోపేతం చేయాలని మంత్రి సీతక్క అన్నారు. హైదరాబాద్‌లోని డీజీపీ కార్యాలయంలో రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డితో మంత్రి సీతక్క, ఎమ్మెల్యేలు కోరం కనకయ్య, తెల్లం వెంకటరావు, జారే ఆది నారాయణలతో కలిసి మంగళవారం కీలక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సత్తుపల్లి లోని ట్రైబల్ పోలీస్ బెటాలియన్‌కు సంబంధించిన పలు సమస్యలను మంత్రి, ఎమ్మెల్యేలు డీజీపీ దృష్టికి తీసుకువచ్చారు. ట్రైబల్ పోలీస్ బెటాలియన్‌లో నూతన రిక్రూట్మెంట్లు, పదోన్నతులు, స్థానికత, బదిలీల అంశాల్లో సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలను మంత్రి సీతక్క, ఎమ్మెల్యేలు వివరించారు. ఈ సమస్యల వల్ల ట్రైబల్ యువత, పోలీస్ సిబ్బందిలో అసంతృప్తి నెలకొని ఉందని, తక్షణమే పరిష్కారాలు చూపాలని వారు డీజీపీని కోరారు. ట్రైబల్ పోలీస్ బెటాలియన్‌ను బలోపేతం చేయాలంటే ఉద్యోగ భద్రత, నూతన నియామకాలు, బదిలీలు పదోన్నతులు కల్పించడం అత్యంత అవసరమని మంత్రి సీతక్క స్పష్టం చేశారు. ఈ అంశాలపై డీజీపీ శివధర్ రెడ్డి సానుకూలంగా స్పందించి, ట్రైబల్ బెటాలియన్ సమస్యలను ప్రాధాన్యతతో పరిశీలించి తగిన పరిష్కారాలు తీసుకుంటానీ తెలిపారు. ఇదే సందర్భంలో త్వరలో జరగనున్న మేడారం మహా జాతరకు సంబంధించి భద్రతా ఏర్పాట్లపై కూడా మంత్రి సీతక్క డీజీపీతో చర్చించారు. లక్షలాది మంది భక్తులు తరలివచ్చే మేడారం జాతరను దృష్టిలో ఉంచుకుని, ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేయాలని, అవసరమైతే అదనపు పోలీసు సిబ్బందిని కూడా నియమించాలని సూచించారు. అనంతరం మంత్రి సీతక్క డీజీపీకి మేడారం మహా జాతర ఆహ్వాన పత్రికను అందజేసి, పోలీస్ కుటుంబాలందరినీ జాతరకు ఆహ్వానించారు. ఆదివాసీ సంప్రదాయాలు, తెలంగాణ సంస్కృతికి ప్రతీక అయిన మేడారం జాతరకు ప్రతి ఒక్కరూ రావాలని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

# గాడితప్పిన సోషల్ మీడియా..!

- పరాకాష్టకు చేరిన ఎల్లో జర్నలిజం
- దళిత మహిళా ఐఏఎస్ ప్రతిష్టను దిగజారుస్తూ రోత రాతలు
- సర్వత్రా ఖండిస్తున్న పౌర సమాజం, మేధావులు, అధికారులు
- పలు ఛానెళ్లు, ఈ పేపర్లపై కేసులు నమోదు
- సీరియస్‌గా తీసుకున్న తెలంగాణ ప్రభుత్వం
- ఖండించిన తెలంగాణ ఉద్యమ జర్నలిస్టుల సంఘం




**హైదరాబాద్ (జనంసాక్షి) :** ప్రజాస్వామ్యానికి నాలుగో స్తంభంగా పరిఢవిల్లుతున్న మీడియాకు ఇదో మాయని మచ్చ. విచక్షణ మరిచి విలువలకు తిలోదకాలిస్తున్నారన్న విమర్శలకు ఇది మరొక దృష్టాంతం..! నానాటికీ జర్నలిజం దిగజారిపోతోందని వేనోళ్ల వినబడుతున్న తరుణంలో తులసివనంలో గంజాయి మొక్కలా కొన్ని సోషల్ మీడియా హ్యాండిల్స్, ఈ పేపర్లు వక్రబుద్ధిని చాటుకుంటున్నాయి. వ్యక్తిగత, కుటుంబ జీవితాలను ఛిద్రం చేసేలా లేనివాటిని ఉన్నట్టుగా చూపెడుతూ 'పైసా'చికానందాన్ని పొందుతున్నాయి. ఇటీవల ఓ మహిళా ఐఏఎస్‌పై కొన్ని ఛానెళ్లు, ఈ పేపర్లు, సోషల్ మీడియాలో నిరాధారమైన ఆరోపణలు చేస్తూ కథనాన్ని ప్రచురించడం పట్ల తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. తెలంగాణ ప్రజలు, మేధావులు, విద్యావంతులు, అధికారులు సైతం ఆ కథనాలు ప్రసా రం చేసినవారి పట్ల కఠిన చర్యలకు పూనుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

మహిళా ఐఏఎస్ అధికారిణి పట్ల అసభ్యకర వార్తలను ప్రచురించడం పట్ల తెలంగాణ ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంది. ఈ మేరకు మంత్రులందరూ స్పందించారు. ప్రభుత్వం పట్లగానీ, అధికారుల పట్లగానీ తప్పుడు కథనాలు ప్రచురించినా, ప్రసారం చేసినా ఊరుకునే ప్రసక్తే లేదని హెచ్చరించారు. ఈ నేపథ్యంలో ఇటీవల పలు చానెళ్లు, ఈ పేపర్లు, సోషల్ మీడియాలో వైరల్ చేసిన వార్త పట్ల పోలీసులు చర్యలకు ఉపక్రమించారు. ఐఏఎస్ సంఘం ఫిర్యాదుతో పలు మీడియా ఛానెళ్లపై కేసులు నమోదు చేశారు. ఐఏఎస్ అసోసియేషన్ సెక్రటరీ, సీనియర్ ఐఏఎస్ అధికారి జయేష్ రంజన్ ఫిర్యాదు ఆధారంగా హైదరాబాద్ సెంట్రల్ క్రైమ్ స్టేషన్ పోలీసులు ఎన్టీవీ, తెలుగు స్క్రైబ్, టీ న్యూస్, మిర్రర్ అఫిషియల్, ప్రైమ్9 తెలంగాణ, పీవీ న్యూస్, ఓల్గా న్యూస్, ఎం.ఆర్.మీడియా తెలంగాణ వంటి డిజిటల్ న్యూస్‌లపై ఎఫ్ఐఆర్ (నెం.07/2026) నమోదు చేశారు. ఆ కథనంలో ఆమె పేరు ప్రస్తావించనప్పటికీ, ఆమె గతంలో నల్గొండ కలెక్టర్‌గా, ప్రభుత్వ కార్యదర్శిగా పనిచేశారని పేర్కొంటూ ఆమె గుర్తింపును పరోక్షంగా వెల్లడించారని, ఇది ఆమె వ్యక్తిగత గోప్యతకు భంగం కలిగించడమే కాకుండా, ఆమె నైతికతను దెబ్బతీసేలా ఉందని ఐఏఎస్ అసోసియేషన్ ఫిర్యాదులో పేర్కొంది. అంతేగాక, వార్తలో అసభ్యకరమైన వ్యాఖ్యలు, ద్వంద్వ అర్థాలు ఉన్నాయని ఆరోపించింది.

### కుళ్లు, కుతంత్రాలతో అసత్య ప్రచారాలు

ఇటీవల కొన్ని యూట్యూబ్ ఛానెళ్లు, ఈ పేపర్లు, ఇతర సోషల్ మీడియా వేదికలు కొన్ని పూర్తిగా విచక్షణ మరిచాయి. వ్యక్తుల మధ్య వైరం పెంచేలా, కుటుంబాలు విచ్ఛిన్నమయ్యేలా ప్రవర్తిస్తున్నాయి. ఎలాంటి ఆధారాల్లేని అక్రమ సంబంధాలు అంటగట్టేందుకు యత్నిస్తున్నాయి. ప్రజాప్రతినిధులు, అధికారులు అనే తేడాలేకుండా వ్యక్తిగత గోప్యతకు భంగం కలిగించేలా, అవమానపరిచేలా వార్తలను ప్రచారం చేస్తున్నాయి. జర్నలిజం ముసుగులో స్వార్థపూరిత చర్యలకు ఒడిగడుతూ అసలైన మీడియా పట్ల కూడా బురద జల్లేందుకు కారణమవుతున్నాయి. కొన్నిసార్లు ప్రధాన స్రవంతిలో ఉన్నటువంటి సంస్థ పేరిట న్యూస్ క్లిప్పులను సోషల్ మీడియాలో వైరల్ చేస్తూ గందరగోళం సృష్టిస్తున్నాయి. ఆతో 'ఇది మేం ప్రచురించింది కాదంటూ' ఆయా సంస్థలు మళ్లీ అదే సోషల్ మీడియాలో వివరణ ఇచ్చుకోవాల్సిన దుస్థితి ఏర్పడుతోంది. ఇటువంటి కుట్రలపూరిత వేదికలను, విషప్రచారాలకు అడ్డుకట్ట వేయాలని, లేకపోతే మొత్తం జర్నలిజమే ప్రమాదం పడే అవకాశం ఉందని మేధావులు, విద్యావంతులు సూచిస్తున్నారు.

### ఖండించిన తెలంగాణ ఉద్యమ జర్నలిస్టుల సంఘం

తెలంగాణలో ఒక మహిళా ఐఏఎస్ అధికారిణిపై ఇటీవల పలు మీడియా ఛానళ్లు, సోషల్ మీడియా ఛానళ్లు, వెబ్ సైట్లు చేసిన అసత్య, అసభ్యకరమైన ప్రచారాన్ని తెలంగాణ ఉద్యమ జర్నలిస్టుల సంఘం తీవ్రంగా ఖండిస్తోంది. ఈ మేరకు టియుజెఏస్ అధ్యక్షుడు ఎంఎం రెహమాన్, ప్రధాన కార్యదర్శి టి.రమేష్ బాబు సంయుక్తంగా విడుదల చేసిన ప్రకటనలో ఈ అంశాన్ని ఖండించారు. ఈ ప్రచారం ఆ మహిళా అధికారిణి గౌరవాన్ని, ఆమె వ్యక్తిగత జీవితాన్ని, వృత్తిపరమైన నీతిని దెబ్బతీసేలా ఉందని ఒక అట్టడుగు సామాజిక వర్గం నుంచి వచ్చిన ఉన్నతమైన స్థానానికి ఎదిగి ప్రభుత్వ పాలనలో తమదైన ముద్ర వేస్తున్న ఇలాంటి అధికారులను ప్రోత్సహించాల్సింది పోయి వ్యక్తిత్వ హననానికి పాల్పడేలా చేస్తున్న మీడియా హక్కుల దురుపయోగాన్ని వారు తీవ్రంగా ఖండించారు. ఆ వార్త ప్రచురణలో లేదా ప్రసారంలో ఆ మహిళాధికారి నీ వ్యక్తిగతంగా దాడి చేసినట్టుగా ఉండే తప్ప అందులో ప్రజా ప్రయోజనం ఏమాత్రం లేదని టియుజెఏస్ భావిస్తోందని, ఇది ఆమెకే కాకుండా, మహిళా సివిల్ సర్వెంట్స్ అందరి గౌరవాన్ని, తెలంగాణ పరిపాలనా వ్యవస్థను, మీడియా నైతికతను కూడా దెబ్బతీసే చర్య. తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న జర్నలిస్టులుగా తాము నిజాయితీ, సత్యం, సమాజ బాధ్యతల పునాదుల మీదనే జర్నలిజం నడుస్తుందని నడవాలని వారు అభిప్రాయపడ్డారు. కొన్ని మీడియా సంస్థలు సంచలనం కోసం, టీఆర్పీల కోసం, రాజకీయ ప్రయోజనాల కోసం అసత్యాలు, అపవాదులు ప్రచారం చేయడం సమర్థనీయం కాదన్నారు. తెలంగాణ ఐఏఎస్ అధికారుల సంఘం, ఐపీఎస్, ఐఎఫ్ఎస్ సంఘాలు ఇప్పటికే ఈ అసత్య ప్రచారాన్ని ఖండించి, హైదరాబాద్ సెంట్రల్ క్రైమ్ స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నమోదు చేయించారు. ఇది సరైన చర్యగా తాము సమర్థిస్తున్నట్లు పేర్కొన్నారు.



## పక్కాగా పనిదినాలు.. కూలీ అమలు

- గుంతలు తవ్వే కార్యక్రమానికి చెల్లుచీటీ
- వ్యవసాయానికి ఉపాధిహామీ జోడింపు
- జీ రామ్ జీ పథకంపై దుష్ప్రచారం తగదు
- పాక్, బంగ్లాలో హిందూమహిళలను ప్రధానిని చేయమంటారా
- ఓవైసీ వ్యాఖ్యలపై కిషన్ రెడ్డి సవాల్

**హైదరాబాద్, జనవరి 12 (జనంసాక్షి) :** వీబీ జీ రామ్‌జీ ఉపాధి హామీ పథకం మీద కాంగ్రెస్ తప్పుడు ప్రచారం చేస్తోందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మండిపడ్డారు. కొత్త చట్టంతో ఈ పథకంలో సాంకేతికత ఉపయోగించామన్నారు. పారదర్శకత, జవాబుదారీతనం తీసుకురావడంతో పాటు వంద రోజుల పనిదినాలను 125కి పెంచామన్నారు. వ్యవసాయ సీజన్‌లో కూలీల కొరత లేకుండా.. వ్యవసాయానికి అనుసంధానం చేస్తున్నామన్నారు. వ్యవసాయ సీజన్ లేనప్పుడు 125 పని దినాలు దొరికేలా చూస్తామన్నారు. ఈ పథకం ద్వారా రాష్ట్రాలకి అదనపు భారం పడుతుంది. అయితే, కేంద్రం కూడా అదనంగా ఖర్చు పెడుతుంది. కూలీల పేరుతో నకిలీ జాబ్ కార్డులు తయారు చేసే దళారీ వ్యవస్థను నిర్మూలించడమే ఈ చట్టం ఉద్దేశం. నీతి ఆయోగ్ సూచనలతో కొత్త ఉపాధి హామీ పథకంలో మార్పులు చేశాంఅని తెలిపారు. ఉపాధి హామీ పథకాన్ని తీసేశారంటూ బీజేపీపై కొందరు కావాలనే తప్పుడు ప్రచారం చేస్తున్నారని కిషన్ రెడ్డి వ్యాఖ్యానించారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఉపాధి హామీ పథకంలో గతంలో చాలా అవకతవకలు, అక్రమాలు జరిగాయని ఆరోపించారు. ఒక సంవత్సరం ఒకచోట గుంతలు తవ్వితే మరుసటి ఏడాదీ అదే ప్రాంతంలో తవ్వేవారని విమర్శించారు. దేశంలో అనేక మార్పులు, సంస్కరణలు చేస్తున్నామని.. మార్పులకు అనుగుణంగానే ఉపాధి హామీ పథకం పేరును మార్చామని కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. వీబీ–జీ రామ్ జీ ద్వారా గోడౌన్‌లు నిర్మించాలని నిర్ణయించామని ఆయన వెల్లడించారు. అలాగే వ్యవసాయ రంగానికి దీనిని అనుసంధానం చేస్తామని కూడా మంత్రి వివరించారు. పని ఇవ్వలేని పరిస్థితుల్లోనూ పరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. 'ఇది కేవలం గుంతలు తవ్వే పథకం కాదు.. దేశాన్ని అభివృద్ధి చేసే పథకం' అని కేంద్ర మంత్రి ఉద్ఘాటించారు.

గ్రామ పంచాయతీలకు అమలు అధికారం కల్పించామని, పని దినాలను 100 నుంచి 125కు పెంచామన్నారు మంత్రి. రాష్ట్రాలకు అదనపు నిధులు వచ్చేలా చేస్తున్నామని వివరించారు. దివ్యాంగులు, వృద్ధులకు కూడా ఉపాధి హామీ కార్డులు ఇస్తామని కిషన్ రెడ్డి హామీ ఇచ్చారు. భాజపా గాలివాటంతో గెలుస్తుందన్న కేటీఆర్ వ్యాఖ్యలపై కిషన్ రెడ్డి ఘాటుగా స్పందించారు. గాలివాటం అయితే దేశంలో మూడుసార్లు అధికారంలోకి ఎలా వచ్చామో చెప్పాలన్నారు. మళ్లీ గెలిచి దేశంలో ప్రధానిగా మోదీ అధికారంలోకి వస్తారన్నారు. బీఆర్ఎస్ పని అయిపోయిందని ఎద్దేవా చేశారు. పార్లమెంట్, ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలిచి చూపించామన్నారు. హిజాబ్ ధరించే మహిళను ప్రధాని చేయాలని మజ్లిస్ అధినేత అసదుద్దీన్ ఓవైసీ చేసిన వ్యాఖ్యల పట్ల కిషన్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. పాకిస్థాన్, బంగ్లాదేశ్‌కు వెళ్లి బొట్టు పెట్టుకునే హిందువును ప్రధాని చేయాలని ఓవైసీ అడుగుతారా అని ప్రశ్నించారు. పాకిస్థాన్‌లో హిందువులు లేకుండా చేశారని, బంగ్లాదేశ్‌లో హిందువులను హింసిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో హిందువులు లేకుంటే ప్రజాస్వామ్యం ఉండదన్నారు. మతాల పేరు మీద రాజకీయాలు నడవవని ఓవైసీ గుర్తుపెట్టుకోవాలని హితవు పలికారు.

## నశీర్ అహమ్మద్ చరిత్ర పుస్తకాలను ఉర్దూలోకి అనువదించి ప్రచురిస్తాం

- ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ మహమ్మద్ ఫారూఖ్ షుబ్లీ వెల్లడి



**విజయవాడ (జనంసాక్షి) :** ప్రముఖ చరిత్రకారులు సయ్యద్ నశీర్ అహమ్మద్ రచించిన చరిత్ర గ్రంథలను ఉర్దూ భాషలోకి అనువదించి ప్రచురిస్తామని రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ మహమ్మద్ ఫారూఖ్ షుబ్లీ ప్రకటించారు. విజయవాడలో జరుగుతున్న 36వ పుస్తక ప్రదర్శన మహోత్సవంలో ఈ ఏడాది ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఉర్దూ అకాడమీ స్టాల్ వద్ద సోమవారం (11- 01-2026) రాత్రి జరిగిన పుస్తకావిష్కరణ సభలో షుబ్లీ మాట్లాడుతూ ఈ మేరకు ప్రకటన చేశారు. సయ్యద్ నశీర్ అహ్మద్ రచించిన నూతన గ్రంథం "అల్లూరికి అండగా నిలిచిన ఫజులుల్లా ఖాన్ షేక్ మదీనా" ను కార్యక్రమంలో పాల్గొన్న పలువురు ప్రముఖులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అకాడమీ చైర్మన్ మాట్లాడుతూ భారత స్వాతంత్ర్యోద్యమం లో ముస్లింల పాత్రను వివరిస్తూ సయ్యద్ నశీర్ అహమ్మద్ వెలువరించిన చరిత్ర గ్రంథలను ఉర్దూ భాషలోకి అనువాదం చేస్తామని, ఆ గ్రంథాలను ముద్రించి మన రాష్ట్రం, మన దేశ వ్యాప్తంగా ఉన్న ప్రముఖ గ్రంథలయాలకు అందజేస్తామని వెల్లడించారు. ఈ సందర్భంగా ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న పెద్దలు అకాడమీ చైర్మన్ శ్రీ మహమ్మద్ ఫారూఖ్ షుబ్లీ ప్రకటించిన నిర్ణయాన్ని స్వాగతిస్తూ ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు మరియు పార్టీ రాజకీయ కార్యదర్శి టీడీ జనార్ధన్ , సిపిఐ జాతీయ కార్యదర్శి కె రామకృష్ణ , సిపిఐ (ఎం) జాతీయ పొలిటి బ్యూరో సభ్యులు బివి రాఘవులు, ఆంధ్ర ఆర్ట్స్ అకాడమీ అధ్యక్షులు గొల్ల నారాయణరావు, సమతా సైనిక్ దళ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లి సురేంద్రబాబు తదితర ప్రముఖులు, ప్రజలు పాల్గొన్నారు.

## కోనసీమలో సంక్రాంతి సంబరాలు ప్రారంభం

- రసవత్తరంగా పడవ పోటీలు



**కోనసీమ, జనవరి12 (జనంసాక్షి) :** సంక్రాంతి సంబరాల్లో భాగంగా.. కోనసీమ జిల్లాలో పడవ పోటీలు రసవత్తరంగా జరుగుతున్నాయి. సోమవారం అంబేద్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట నియోజకవర్గం ఆత్రేయపురం కాలవరేవు తాడిపూడి వంతెన వద్ద ఆత్రేయపురం ఉత్సవం పేరుతో రెండో రోజు పడవ పోటీలు ప్రారంభమయ్యాయి. సర్ ఆర్థర్ కాటన్ గోదావరి ట్రోఫీ సంక్రాంతి సంబరాలలో భాగంగా ప్రారంభమైన పడవ పోటీలను ఆ నియోజకవర్గ ఎమ్మెల్యే బండా రు సత్యానందరావు, ఆర్డీవో పి. శ్రీకర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ పోటీల్లో ఆంధ్రా, తెలంగాణ రాష్ట్రాలతో పాటు కేరళ, తమిళనాడు, ఒరిస్సా రాష్ట్రాలకు చెందిన 22 జట్లు పాల్గొన్నాయి. పర్యాటక శాఖ ఆధ్వర్యంలో జరిగే ఈ బోటు ఫెస్టివల్ ను చూసేందుకు ఇతర రాష్ట్రాల నుండే కాకుండా ఇతర దేశాల నుండి కూడా చూసేందుకు తరలివచ్చారు. ఇకపోతే గుంటూరు నగరంలో వైకాపా జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు ఆధ్వర్యంలో ఆదివారం సంక్రాంతి పోటీలు నిర్వహించారు. మాజీ మంత్రి రోజా పాల్గొన్నారు. మహిళల ముగ్గుల పోటీల్లో మొదటి విజేతకు రూ.లక్ష, రెండో విజేతకు రూ.50 వేల చొప్పున బహుమతులు అందించారు. అనంతరం కోడిపందేలు నిర్వహించగా.. రాంబాబు, రోజా కోడి పుంజులను బరిలోకి వదిలారు. తాను ఏటా సంక్రాంతి సంబరాలు నిర్వహిస్తున్నానని, గతంలో సత్తెనపల్లి లోనూ ఈ పోటీలు జరిగినట్లు అంబటి రాంబాబు తెలిపారు. రాష్ట్రంలో రాంబాబు అంటే సంక్రాంతి.. సంక్రాంతి అంటే రాంబాబు అంటూ అంబటికి రోజా కితాబిచ్చారు.



## పిజెఆర్‌కు రేవంత్ ఘన నివాళి

- ఖైరతాబాద్ విగ్రహం వద్ద పుష్పాంజలి

**హైదరాబాద్, జనవరి 12(జనంసాక్షి) :** దివంగత కాంగ్రెస్ నేత, మాజీమంత్రి పి. జనార్దన్ రెడ్డి జయంతి సందర్భంగా ఖైరతాబాద్ సర్కిల్ లోని ఆ మహనీయుడి విగ్రహానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా పిజెఆర్ పేదల గుండెల్లో చిరస్థాయిగా నిలిచన నేతగా కొనియాడారు. ఆయన ప్రజల కోసం నిరంతరంగా పాటుపడ్డారని అన్నారు. పేదల సమస్యలపై అలుపెరగని పోరాటం చేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో పిజెపి తనయ విజయా రెడ్డి,మంత్రి దామోర రాజనర్సింహ, ఎమ్మెల్యే నవీన్ యాదవ్ కూడా పాల్గొని పిజెఆర్‌కు నివాళి అర్పించారు.

## సమ్మక్క-ది గ్లోరీ ఆఫ్ మేడారం

- పుస్తకాన్ని ఆవిష్కరించిన మంత్రి సీతక్క

**హైదరాబాద్, జనవరి 12 (జనంసాక్షి):** సమ్మక్క–ది గ్లోరీ ఆఫ్ మేడారం పుస్తకాన్ని మంత్రి సీతక్క ఆవిష్కరించారు. సమాచార పౌర సంబంధాల శాఖ జాయింట్ డైరెక్టర్ కన్నెకంటి వెంకటరమణ వెలువరించిన సమ్మక్క ది గ్లోరీ ఆఫ్ మేడారం అనే పుస్తకాన్ని రాష్ట్ర పంచాయతీరాజ్, శ్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ ఆవిష్కరించారు. మేడారంలో జరిగిన ఈ ఆవిష్కరణ కార్యక్రమంలో మంత్రి సీతక్కతో పాటు ములుగు జిల్లా కలెక్టర్ దివాకర, మేడారం వడ్డే పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్దబోయిన జగ్గారావు, ములుగు మార్కెట్ కమిటీ చైర్పర్న్ ములుగు డిపిఆర్ఓ రఫీ తదితరులు ఈ ఆవిష్కరణ సభలో పాల్గొ న్నారు. మేడారం జాతర ను కళ్ళ ముందుం చేలా విస్తృత సమాచారంతో కూడిన ఈ సమ్మక్క గ్లోరీ ఆఫ్ మేడారం పుస్తకం వెలువ రించడం పట్ల రచయితను మంత్రి సీతక్క అభినందించారు. మేడారం జాతరలో గిరిజన సంస్కృతీ, సాంప్రదా యాలు, మొక్కులు, జాతర జరిగే తీరు, వివిధ రాష్ట్రాలనుండి వచ్చే గిరిజన జాతుల సంస్కృతీ సాంప్రదాయాలు, మీడియా కవరేజి, జాతరలో ఎదురయ్యే ఇబ్బందులు... ఇలా భిన్న అంశాలపై ఈ సమ్మక్క పుస్తకం ముద్రించడం జరిగింది.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370